www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 7-9-2025
పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం
వెల (Price) : Rs. 8.00
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 160

ఆదివారంశ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి రా.11.38 తదుపరి పాడ్యమి, నక్షత్రం: శతభిషం రా.9.41 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: తె.3.38-5.08, దుర్ముహూర్తం: సా.4.42-5.31, అమృతఘడియలు: మ.2.51-4.22, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.20

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నిమజ్జనం.. ప్రభంజనం

గంగమ్మ ఒడికి గణనాథుడు


నిమజ్జన వేడుకలో తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి

కన్నుల పండువగా శోభాయాత్ర

- జన సంద్రంగా మారిన హుస్సేన్‌సాగర్ తీరం
- మధ్యాహ్నానికే 'మహాగణపతి' నిమజ్జనం
- ప్రత్యేక బస్సులు.. అదనపు ఎంఎంటీఎస్‌లు
- బాలాపూర్ పాట అదుర్స్.. లడ్డూ రూ.35లక్షలు
- విదేశాల్లోనూ గణేశ్ లడ్డూలకు మహా గిరాకీ
- కెనడాలో రూ.15.1 లక్షలు పలికిన లడ్డూ
- ఆస్ట్రేలియాలో రూ.2.25 లక్షలకు వేలం

భక్తజనం మధ్య సీఎం రేవంత్

- గణపతి బప్పా మోరియా అంటూ నినాదం
- ఆయనతో సెల్ఫీల కోసం జనం పోటాపోటీ



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అశేష భక్తకోటి పూజలు అందుకున్న వినాయకుడు గంగమ్మ ఒడికి చేరాడు. నామస్మరణ, భజనలు, కోలాటాలు, నృత్యాల మధ్య 'వెళ్లిరా.. గణేశా' అంటూ భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఎక్కడికక్కడ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. స్థానిక చెరువులు, వాగుల్లో వినాయక నిమజ్జనాలు నిర్వహించారు. హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్, ఇతర చెరువులతోపాటు 74 కృత్రిమ కొలనుల్లో నిమజ్జనం కొనసాగింది. హుస్సేన్‌సాగర్ తీరం జన సంద్రంగా మారింది. శోభాయాత్ర మార్గాల్లో భక్తుల కోసం తాగునీరు, పులిహోర, పొంగల్, పూరీలు, గుగ్గిళ్ల వంటి ప్రసాదాలు అందజేశారు. ఖైరతాబాద్ మహాగణపతిని శనివారం తెల్లవారుజామున 5.15కు వాహనం పైకి చేర్చారు. 7.41 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవగా మధ్యాహ్నం 1.45 గంటలకు నిమజ్జనం పూర్తయింది. ముందుగానే ఆ ప్రాంతంలో పూడిక తీయడంతో 70 అడుగుల భారీ విగ్రహం ఈసారి పూర్తిగా నీట మునిగింది. కాగా, ఈసారి ఖైరతాబాద్ మహాగణపతిని సుమారు 40 లక్షల మంది దర్శించుకున్నట్టు అంచనా వేస్తున్నారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో శనివారం సాయంత్రం వరకు 2.54 లక్షల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని జీహెచ్ఎంసీ ప్రకటించింది. కనీసం 1.5 అడుగుల కన్నా పెద్ద విగ్రహాలను లెక్కించామని

మిగతా 13వ పేజీలో...

పన్ను సరళీకరణ..

అందరికీ ఉపయోగమే

తప్పుడు ఇన్వాయిస్‌లను జీఎస్టీ విభాగం గమనిస్తుంది



- పన్ను తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందివ్వకపోతే చట్టపరమైన చర్యలు
- 'ఆంధ్రజ్యోతి'తో జీఎస్టీ కమిషనర్ సాధు నర్సింహారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్ల తగ్గింపును కేవలం శ్లాబుల తగ్గింపుగా చూడలేమని.. ప్రస్తుతం అమల్లో ఉన్న పన్నులను సరళతరం చేయడం, వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడం, దేశీయ ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్రం ఈ సంస్కరణలను చేపట్టిందని సెంట్రల్ జీఎస్టీ (అప్పీల్స్) కమిషనర్ సాధు నర్సింహారెడ్డి అన్నారు. జీఎస్టీ శ్లాబులను 5%, 18%, 40 శాతంగా సరళీకరించడం ద్వారా ప్రభుత్వం


సాధు నర్సింహారెడ్డి

జీఎస్టీ రేట్లపై ఉన్న విమర్శలకు సమాధానం చెప్పినట్లయిందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలను ప్రకటించిన నేపథ్యంలో.. ధరల తగ్గింపుపై కొనుగోలుదారుల్లో చర్చ మొదలైంది. సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి రానున్న కొత్త పన్ను రేట్లపై చాలా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాటన్నింటినీ 'ఆంధ్రజ్యోతి'.. సాధు నర్సింహారెడ్డి ముందు ఉంచింది. ఆ సందేహాలకు ఆయన ఇచ్చిన

మిగతా 12వ పేజీలో...



మహీంద్రా తగ్గింపు తక్షణమే

- ఆ కార్లు 1.56 లక్షల వరకు తగ్గింపు
- టయోటా రూ.3.49 లక్షల వరకు,
- రెనో రూ.96,395 వరకు తగ్గింపు
- ఇప్పటికే తగ్గిస్తున్నట్టు టాటా ప్రకటన
- భారీగా తగ్గించే యోచనలో మారుతి

2

రేవంత్ దెబ్బకు రెండు పిట్టలు!


కొత్త పలుకు!

సీఎం రేవంత్ దూకుడుతో కేసీఆర్ పరిస్థితి తలకిందులవుతోంది. ఓటుకు నోటు కేసులో రేవంత్ జుట్టు దొరకపుచ్చుకొని ఒక ఆట ఆడుకున్న కేసీఆర్... ఇప్పుడు అదే రేవంత్ ఎత్తుగడలకు చిత్తు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న రేవంత్ అవకాశం కోసం ఎదురుచూశారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా కాళేశ్వరంపై సీబీఐతో విచారణ చేయిస్తామని శాసనసభలో ప్రకటించి కేంద్రానికి విజ్ఞప్తి పంపడం ద్వారా ఇటు బీఆర్ఎస్‌ను, అటు బీజేపీని రేవంత్ ఒకేసారి ఇరకాటంలోకి నెట్టారు.

రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా అవినీతి జరిగిందని చెప్పించి... కేసీఆర్‌పై చర్యలు తీసుకొని ఉంటే కక్ష సాధింపునకు పాల్పడ్డారన్న అపవాదు వచ్చి ఉండేది. కేసీఆర్ అండ్ కోకు క్లీన్‌చిట్ ఇస్తే... బీఆర్ఎస్-బీజేపీ ఒకటేనని నిందించే అవకాశం రేవంత్‌కు దక్కుతుంది. అలా కాకుండా కేసీఆర్ అండ్ కోను సీబీఐ దోషులుగా నిర్ధారిస్తే తాను కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డానన్న అపవాదు నుంచి తప్పించుకోవచ్చు.

పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగానే సీఎం తదుపరి చర్యలు తీసుకుంటారని భావించి, దాని ఆధారంగా చర్యలు తీసుకోకుండా నిలువరించాలని బీఆర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో కూడా అంచనాలకు భిన్నంగా రేవంత్ వ్యవహరించారు. హైకోర్టు కూడా సీబీఐ విచారణను అడ్డుకోజాలమని ప్రకటించింది. దీంతో నీళ్లు ఇచ్చిన మహానేతపై నిప్పులు కురిపిస్తారా అంటూ కేసీఆర్ మీడియాలో కథనాలు వండి వార్చారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా మహా కుట్ర జరిగిందని, రేవంత్-ఏపీ సీఎం బాబు-ప్రధాని మోదీ కలిసి కుట్ర పన్నారని నిందించడం మొదలు పెట్టారు.

ఇబ్బంది ఎదురైన ప్రతిసారీ చంద్రబాబును బూచిగా చూపించడం బీఆర్ఎస్‌కు అలవాటే. ఇప్పుడు కూడా కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరిగితే అందుకు బాబు కారణమని నిందించడం మొదలు పెట్టారు. తెలంగాణ సెంటిమెంటు ఆవిరైతే కేసీఆర్‌కు అజెండా ఉండదు. కనుక వ్యూహంలో భాగంగా బాబును ముడి సరుకుగా వాడుకోవడాన్ని ఆక్షేపించాల్సింది లేదు.

మూడేళ్ల తర్వాత జరగబోయే సాధారణ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఉనికిలో ఉండకూడదని రేవంత్ బరాబర్ కోరుకుంటున్నారు. కాంగ్రెస్-బీజేపీ మధ్యనే ఎన్నికల పోరు కేంద్రీకృతం కావాలని, మూడో పార్టీ రంగంలో ఉండకూడదు అన్నది రేవంత్ అభిమతం. అదే సమయంలో బీజేపీ కూడా బీఆర్ఎస్‌ఉనికిలో ఉండకూడదనే భావిస్తోంది.

వచ్చే ఎన్నికల నాటికి సీబీఐ విచారణ పూర్తవుతుందో లేదో తెలియదు. కేసీఆర్ అండ్ కో పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా ఉంటుంది. కేసీఆర్‌ను దోషిగా నిర్ధారించి తదుపరి చర్యలు తీసుకుంటే బీఆర్ఎస్ అస్తిత్వం కోల్పోతుందని, రాజకీయంగా ఇది తమకు ప్రయోజనకరం అని భావిస్తే కేంద్రం చర్యలు ఆ దిశగానే ఉండవచ్చు. అంత దూరం వెళ్లకపోతే బీఆర్ఎస్‌ను తమ పార్టీలో విలీనంచేయాలని బీజేపీ ప్రతిపాదించవచ్చు.

వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి కేసీఆర్ మళ్లీ సీఎం కాగలరా? అంటే ప్రస్తుతం చెప్పలేని పరిస్థితి. సీబీఐ వచ్చే ఎన్నికల నాటికి ఆయనను నిర్దోషిగా ప్రకటించి వదిలేస్తే మాత్రం ప్రజల్లో సానుభూతి ఏర్పడి కేసీఆర్ సీఎం కావొచ్చు. కేంద్ర పెద్దలు అంత ఉదారంగా వ్యవహరిస్తారా? అన్నది ప్రశ్నార్థకమే.

ఇంటిపోరు కూడా కేసీఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కాళేశ్వరంలో అవినీతి జరిగిన మాట వాస్తవమేనని, కాకపోతే అప్పటి సాగునీటి మంత్రి హరీశ్ మాత్రమే అవినీతికి పాల్పడ్డారని కేసీఆర్ కుమార్తె కవిత ప్రకటించారు. అవినీతి జరగడం వాస్తవమైతే అది హరీశ్‌కు మాత్రమే పరిమితం అంటే ప్రజలు నమ్ముతారా? కేంద్రం సీబీఐకి పూర్తి స్వేచ్ఛ ఇస్తే కేసీఆర్‌తోపాటు హరీశ్ కూడా బోనులో చిక్కుకుంటారు. అదే జరిగితే బీఆర్ఎస్ అస్తిత్వమే ప్రశ్నార్థకం అవుతుంది.

మోదీ నా ఫ్రెండే కానీ..

ప్రస్తుతం ఆయన చేస్తున్న పనే నాకు నచ్చట్లేదు

- రష్యా చమురును ఇండియా పెద్ద ఎత్తున కొనుగోలు చేయడం నాకు నిరాశ కలిగించింది
- కానీ.. ఇరు దేశాల మధ్య ప్రత్యేక బంధం ఉంది
- చిన్న చిన్న విభేదాలున్నా ఆందోళన చెందక్కర్లేదు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త రాగం

ఆయన సానుకూల భావాలకు అభినందనలు

నాదీ అదే మాట: 'ఎక్స్'లో ప్రధాని మోదీ స్పందన

2

ప్రధాని మోదీ అమెరికా పర్యటన రద్దు


అధ్యక్షుడు ట్రంప్ అధిక సుంకాలపై నిరసనే కారణం

2

కొత్తగా 31 క్రిటికల్ కేర్ బ్లాక్‌లు

అధునాతన వైద్య సేవలకు 29చోట్ల 50, రెండు చోట్ల వంద పడకలతో ఏర్పాటు

- రూ.769.75 కోట్ల వ్యయం.. డిసెంబరు నాటికి 80 శాతం సీసీబీల్లో సేవలు
- ఐసీయూ, డయాలసిస్, ఎమర్జెన్సీ బెడ్స్, లైఫ్ సేవింగ్ సపోర్ట్, బ్లడ్ బ్యాంక్, డయాగ్నస్టిక్ లేబొరేటరీ సదుపాయం


వనపర్తిలో ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ బ్లాక్

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అధునాతన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 31 క్రిటికల్ కేర్ బ్లాకుల (సీసీబీలు)ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాబోతోంది. 'పీఎం అభిమ్' కింద ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రాల్లో 29 చోట్ల 50 పడకలు, మరో రెండు చోట్ల వంద పడకలు ఉంటాయి. 50 పడకల కేంద్రాలకు ఒక్కోదానికి రూ.23.75 కోట్ల చొప్పున, వంద పడకల కేంద్రాలకు ఒక్కోదానికి రూ.40.5 కోట్ల చొప్పున రూ.769.75 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. వంద పడకల కేంద్రాలను ఒక్కోదాన్ని హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రి, రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 92 వేల చదరపు

మిగతా 14వ పేజీలో...



బీజేపీలో కామరాజ్ ప్లాన్!?

2

- పదేళ్లుగా క్యాబినెట్లో ఉన్నవాళ్లు పార్టీలోకి
- పార్టీలో పనిచేసిన వారు ప్రభుత్వంలోకి
- మంత్రివర్గంలో కొత్త ముఖాలకు చోటు
- పార్టీలో, ప్రభుత్వంలో సమూల ప్రక్షాళన
- యువకులు, అనుభవజ్ఞులకు అవకాశం
- తరం మార్పుపై ప్రజల్లోకి సంకేతాలు
- కమలనాథుల యోచన.. త్వరలో అమలు



కవిత వ్యాఖ్యలను.. ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా

- రాష్ట్ర సాధనలో నా నిబద్ధత అందరికీ తెలుసు
- నా జీవితం తెరిచిన పుస్తకం: హరీశ్‌రావు
- కేసీఆర్‌తో హరీశ్‌రావు కీలక భేటీ
- లండన్ నుంచి రాగానే ఎర్రవల్లి ఫాంహౌస్‌కు
- భేటీలో పాల్గొన్న కేటీఆర్.. సుదీర్ఘ మంతనాలు
- కవిత వ్యాఖ్యలు, కాళేశ్వరం అంశంపై చర్చ
- వారం రోజులుగా కేసీఆర్‌తోనే కేటీఆర్

12

నార్కోటిక్స్ తయారీ గుట్టురట్టు

చర్లపల్లిలోని ఓ ల్యాబ్‌లో 5.79 కిలోల మెఫెడ్రోన్ స్వాధీనం

- నార్కోటిక్స్ బ్యూరో, మహారాష్ట్ర పోలీసుల ఆపరేషన్
- బంగ్లాదేశ్ మహిళ సహా 12 మంది అరెస్టు
- మత్తుమందుల ముఠాతో జతకట్టి డెకాయ్ ఆపరేషన్
- ఆ సరుకుతో రూ.12వేల కోట్ల డ్రగ్స్ తయారీకి అవకాశం
- ల్యాబ్ యజమాని శ్రీనివాస్ విజయ్ ఓలేటి మోసాలెన్నో?
- గతంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు.. మూసివేత
- వాగ్దేవి ల్యాబ్ పేరుతో బోర్డులేని కంపెనీలో డ్రగ్స్ తయారీ

14


చర్లపల్లిలో అరెస్టయిన ఓలేటి, తానాజీ (కూర్చున్నవారు)

సీబీఐ డైరెక్టర్‌కు అస్వస్థత

అపోలో ఆస్పత్రికి తరలింపు

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. శనివారం ఉదయం ప్రవీణ్ సూద్ శ్రీశైలం వెళ్లి మధ్నాహ్నం సీబీఐ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో గుండెలో అసౌకర్యంగా ఉందని సిబ్బందికి చెప్పడంతో వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు 24 గంటలు పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. ప్రవీణ్ సూద్ హైదరాబాద్ పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ జోన్ అధికారులతో సమావేశమయ్యారు.

మెరుగైన ప్రతిపక్షం కోసం ప్రజా ఉద్యమం రావాలి



- జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్ష నేతలవి అవగాహన లేని విమర్శలు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఫైర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: ప్రతిపక్ష నేతలు జీఎస్టీపై ఏ మాత్రం అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. మన దేశంలో మెరుగైన ప్రతిపక్షం, మెరుగైన ప్రతిపక్ష నేతల అవసరం ఉందని వ్యాఖ్యానించారు. చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు వచ్చిన తరహాలో దేశంలో మెరుగైన ప్రతిపక్షం, మెరుగైన ప్రతిపక్ష నేతల కోసం ఉద్యమం రావాల్సి ఉందని పేర్కొన్నారు. శనివారం పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలపై నిర్మల విమర్శలు గుప్పించారు. "జీఎస్టీ ప్రవేశపెట్టిన మొదట్లో 4శ్లాబులు పెట్టడం తప్పు అని, తాము చెప్పినట్టే ఇప్పుడు 2శ్లాబులకు తగ్గించారని కాంగ్రెస్ చెప్పడం తప్పు. జీఎస్టీ తేవడం, పన్ను శ్లాబుల నిర్ధారణ బీజేపీ ఒక్కదాని నిర్ణయం కాదు. అప్పటి కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడి సాధికార కమిటీ నిర్ణయం తీసుకున్నది అప్పటి పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి అసిమ్ దాస్ గుప్తా అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి చర్చల్లోనే 4శ్లాబులను నిర్ణయించారు. ఇది ప్రతిపక్షాలకు తెలియదా? అవగాహన లేదా? ఒకవేళ మేం తప్పు చేసి ఉంటే క్షమాపణ చెప్పడానికి నేను సిద్ధం. కానీ ప్రతిపక్షాల ఆరోపణలన్నీ అవాస్తవం. విషయం ఏమిటనేది అర్థం కానప్పుడు ఏమీ మాట్లాడకుండా ఉంటే మంచిది" అని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతల వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించేలా, దేశానికి హాని చేసేలా ఉన్నాయని.. అది మంచిది కాదని పేర్కొన్నారు. జీఎస్టీ శ్లాబుల తగ్గింపు, రేట్ల మార్పు ప్రజా సంస్కరణలని, వాటి ప్రయోజనం ప్రతి కుటుంబానికి దక్కుతుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ ప్రయోజనాలు ప్రజలకు అందేలా తాను వ్యక్తిగతంగా కూడా పర్యవేక్షిస్తానని తెలిపారు. ఇప్పటికే కార్ల తయారీ సంస్థలు, ప్రభుత్వ రంగ ఇన్సూరెన్స్ సంస్థలు, దుస్తులు, పాదరక్షల సంస్థలు ధరల తగ్గింపును ప్రకటించాయని చెప్పారు. జీఎస్టీ మండలి భేటీలో రాష్ట్రాల ప్రతినిధులు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలను వెల్లడించారని.. చివరికి ఏకగ్రీవంగా సంస్కరణలకు ఆమోదం తెలిపారని నిర్మల చెప్పారు. దీనితో దేశంలో సాధారణ ప్రజలకు ప్రయోజనం చేకూరిందని, దీనిపై అభినందిస్తూ రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాశానని తెలిపారు.

బీడీలు-బిహార్ పోస్ట్ వివాదంతో కేరళ కాంగ్రెస్ సోషల్ మీడియా చీఫ్ రాజీనామా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: బీడీలు-బిహార్ అంటూ పెట్టిన సోషల్ మీడియా పోస్ట్‌పై విమర్శలు వచ్చిన నేపథ్యంలో కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(కేపీసీసీ) సోషల్ మీడియా, డిజిటల్ సెల్ చీఫ్ వీటీ బలరాం రాజీనామా చేశారు. జీఎస్టీ పన్నుల్లో మార్పులను ఉద్దేశించి కేపీసీసీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో బిహార్‌ను బీడీలతో ముడిపెట్టి ఈ పోస్ట్ పెట్టారు. బీడీల మీద పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తూ, అదే సమయంలో సిగరెట్లపై పన్నును పెంచుతూ జీఎస్టీ మండలి నిర్ణయం తీసుకుంది. దీన్ని ఉద్దేశించి.. "బీడీలు, బిహార్.. బితో మొదలవుతాయి.. ఇక బీడీలు తాగడం తప్పు కాదు.." అని ఆ పోస్ట్ పెట్టిన గంటల్లోనే రాజకీయ పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. బిహార్ అధికార ఎన్డీయే పక్ష నేతలు ఇది బిహార్‌ను అవమానించడమేనని ఆరోపించారు. విమర్శల నేపథ్యంలో కేపీసీసీ ఆ పోస్ట్‌ను తొలగించి క్షమాపణలు తెలియజేసింది.

పెద్దనోట్ల రద్దు సమయంలో 450 కోట్లతో చక్కెర ఫ్యాక్టరీ కొన్న శశికళ!



చెన్నై, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలు వీకే శశికళపై మరో సీబీఐ కేసు నమోదయింది. పెద్ద నోట్ల రద్దు సమయంలో రూ.450 కోట్లతో ఓ చక్కెర ఫ్యాక్టరీనీ కొనుగోలు చేశారని, తన బినామీల ద్వారా ఆ ఫ్యాక్టరీని నడిపారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. కాంచీపురంలో ఉన్న ఓ చక్కెర ఫ్యాక్టరీ రూ.కోట్లు రుణం తీసుకొని మోసగించినట్లు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మద్రాసు హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆ పిటిషన్‌పై విచారణ జరిపి, కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు గత జూలైలో సీబీఐ అధికారులు పలుచోట్ల సోదాలు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి సీబీఐ తయారు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఐటీ శాఖ స్వాధీనం చేసుకున్న దస్తావేజుల్లో శశికళకు సంబంధించిన చక్కెర ఫ్యాక్టరీ వ్యవహారాన్ని కూడా ప్రస్తావించింది. అంతేకాకుండా ఆ చక్కెర కర్మాగారాన్ని నడిపిన విదేశ్ శివగన్ పటేల్ ఇచ్చిన వాంగ్మూలం మేరకు ఆ చక్కెర కర్మాగారాన్ని కొనుగోలు చేసేందుకు రూ.450 కోట్ల విలువైన రద్దయిన పెద్దనోట్లను ఉపయోగించారని కూడా వివరించింది. ఆ చక్కెర కర్మాగారం బినామీ ఆస్తి అని, దాని స్వంతదారు శశికళ అని ఐటీ శాఖ ప్రకటించిన విషయాన్నీ సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

ఖలిస్థానీ గ్రూపులకు కెనడా నుంచే నిధులు

- తాజా నివేదికలో ఆ దేశ ప్రభుత్వం అంగీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: ఖలిస్థానీ గ్రూపులతో సహా పలు ఉగ్ర సంస్థలకు కెనడా నుంచే నిధులు అందుతున్నట్లు ఆ దేశ ప్రభుత్వం తాజా నివేదికలో వెల్లడించింది. కెనడా ఆర్థిక విభాగం '2025 అసెస్‌మెంట్ ఆఫ్ మనీలాండరింగ్ అండ్ టెర్రరిస్టు ఫైనాన్సింగ్ రిస్క్స్ ఇన్ కెనడా' పేరుతో విడుదల చేసిన నివేదికలో బబ్బర్ ఖాల్సా ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ అనే రెండు ఖలిస్థానీ ఉగ్ర గ్రూపుల పేర్లను పేర్కొంది. రాజకీయ ప్రేరేపిత హింసాత్మక తీవ్రవాదం (పీఎంవీఈ) సంబంధిత కార్యకలాపాలకు హమాస్, హెజ్‌బొల్లా, ఖలిస్థానీ ఉగ్ర సంస్థలకు కెనడా భూభాగంపై నుంచే ఆర్థిక మద్దతు లభిస్తోందని తెలిపింది. ఈ మేరకు భద్రతా, నిఘా సంస్థలు గుర్తించాయని వెల్లడించింది. భారత్‌లోని పంజాబ్‌లో స్వతంత్ర రాజ్య స్థాపనకు ఖలిస్థానీ తీవ్రవాద గ్రూపులు హింసాత్మక మార్గాలను ఆశ్రయిస్తున్నాయని కెనడా ప్రభుత్వం నివేదికలో అంగీకరించింది.

మీరట్‌లో 'న్యూడ్ గ్యాంగ్' అరాచకాలు

మీరట్, సెప్టెంబరు 6: ఎలాంటి దుస్తులు ధరించకుండా నగ్నంగా తిరిగే పురుషులు కొందరు 'న్యూడ్ గ్యాంగ్' పేరుతో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు. దౌరాలా, భారాల గ్రామాల్లో తిరుగుతూ మహిళలను నిర్మానుష్య ప్రాంతాలకు లాక్కెళ్తున్నట్టు సమాచారం అందింది. ఇంతవరకు నిందితులు ఎవరూ దొరకకపోవడంతో పోలీసులు డ్రోన్లను వినియోగించి గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవల భారాల గ్రామంలో ఒంటరిగా నడుచుకొని వెళ్తున్న మహిళను నగ్నంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు పొలాల్లోకి లాక్కెళ్లారు. ఆమె ఎలాగోలాగ తప్పించుకొని ఇంటికి చేరింది. దాంతో గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు ఇలాంటివి మూడు సంఘటనలు జరిగినా సిగ్గుతో అధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని తెలిసింది. నిందితుల ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులు కీలక ప్రదేశాల్లో సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేశారు. డ్రోన్ల ద్వారా కూడా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఇది కేవలం వదంతి మాత్రమేనని కొందరు కొట్టిపారేస్తున్నారు.

గుజరాత్‌లో రోప్ వే ట్రాలీ కూలి ఆరుగురి మృతి

- మహాకాళి శక్తిపీఠం వద్ద కేబుల్స్ తెగడంతో ఘటన

గాంధీనగర్, సెప్టెంబరు 6: గుజరాత్‌లోని పంచమహల్ జిల్లా పావ్‌గఢ్ హిల్స్ మహాకాళి శక్తిపీఠం వద్ద జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. ఆలయం సమీపంలో కేబుల్ రోప్ వేకు సంబంధించిన పనులు చేస్తుండగా కార్గో రోప్‌వే ట్రాలీ కూలిపోవడంతో ఈ ఘటన జరిగింది. టవర్‌పై నుంచి రోప్ వే ట్రాలీ ద్వారా నిర్మాణ సామాగ్రిని తరలిస్తుండగా కేబుల్స్ తెగి ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు లిఫ్ట్ ఆపరేటర్లు, ఇద్దరు కార్మికులు, మరో ఇద్దరు ఉన్నారు. మృతుల్లో ఇద్దరు కశ్మీరీలు, ఒకరు రాజస్థాన్‌కు చెందినవారున్నారు.

నాకు మోదీ మిత్రుడే కానీ..

ప్రస్తుతం ఆయన చేస్తున్న పనే నచ్చట్లేదు



- ఇరు దేశాల మధ్య ప్రత్యేక బంధం ఉంది
- విభేదాలున్నా ఆందోళన చెందక్కర్లేదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త రాగం

న్యూయార్క్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: పెనం మీద అట్టు తిరగేసినంత సులువుగా మాట మార్చడంలో ట్రంప్ నేర్పరి అని మరోసారి రుజువైంది. "భారత్‌ను, రష్యాను చీకటి చైనాకు కోల్పోయాం.. ఆ మూడు దేశాలూ చిరకాలం సుసంపన్నంగా వర్ధిల్లాలి" అంటూ వ్యంగ్యం ఒలకబోసిన 24 గంటల్లోనే.. ట్రంప్ స్వరం మార్చారు. తాను ఎప్పటికీ మోదీకి స్నేహితుడుగా ఉంటానని.. భారత్, అమెరికా మధ్య ప్రత్యేక సంబంధాలు ఉన్నాయని కొత్త రాగం అందుకున్నారు. వైట్‌హౌస్‌లోని తన కార్యాలయమైన ఓవల్ ఆఫీసులో మీడియాతో మాట్లాడిన ఆయన.. భారత్-అమెరికా సంబంధాలను పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉన్నారా? అని అడిగిన ప్రశ్నకు ఇలా స్పందించారు. "నేనెప్పటికీ మోదీకి మిత్రుడిగా ఉంటాను. ఆయనో గొప్ప ప్రధాని. చాలా గొప్పవాడు. ఆయనతో స్నేహంగా ఉంటాను. కాకపోతే.. ప్రస్తుతం ఆయన చేస్తున్న పనే నాకు నచ్చట్లేదు. కానీ, భారత్-అమెరికా మధ్య ప్రత్యేక బంధం ఉంది. (రెండు దేశాల సంబంధాల గురించి) ఆందోళన చెందాల్సిన పని లేదు. కొన్నిసార్లు చిన్న చిన్న విభేదాలు వస్తాయి అంతే" అని నవ్వుతూ చెప్పారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేయడం తనను నిరాశకు గురి చేసిందన్నారు. "అందుకే భారత్‌పై భారీగా 50% సుంకాలు విధించాం. అది చాలా ఎక్కువ టారిఫ్. అయినా నేను ప్రధాని మోదీతో బాగా కలిసిపోతాను. ఆయన చాలా గొప్పవారు" అని వ్యాఖ్యానించారు. భారత్‌తో, ఇతర దేశాలతో వాణిజ్య చర్చలు ఎలా జరుగుతున్నాయనే మరో ప్రశ్నకు.. భారత్‌తో పాటు చాలా దేశాలతో చర్చలు బాగా జరుగుతున్నాయని చెప్పారు. కానీ.. గూగుల్‌తో సహా పలు ఇతర పెద్ద కంపెనీల విషయంలో యూరోపియన్ యూనియన్‌లో జరుగుతున్న దాని పట్ల తాము అసంతృప్తిగా ఉన్నామని ట్రంప్ బదులిచ్చారు. గూగుల్ వ్యాపార విధానాలు చట్టవిరుద్ధమని పేర్కొంటూ ఈయూ ఇటీవలికాలంలో రూ.వేల కోట్ల జరిమానాలు విధించిన సంగతి తెలిసిందే. అలాగే.. పన్ను ఎగవేత కేసులో యాపిల్‌పైన, వినియోగదారుల డేటా రక్షణ విషయంలో ఫేస్‌బుక్(మెటా)పైన, మార్కెట్లో సొంత ఉత్పత్తులకు మాత్రమే ప్రోత్సాహం ఇచ్చిందంటూ అమెజాన్‌పైన, ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్‌ను విండోస్‌తో కలిపి అమ్మినందుకు మైక్రోసాఫ్ట్‌పైన ఈయూ జరిమానాలు విధించింది. ఈ క్రమంలోనే ట్రంప్ ఈయూపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సానుకూల భాగస్వామ్యం..

ఇండియా-అమెరికా మధ్య ప్రత్యేక బంధం ఉందని.. చిన్నచిన్న విభేదాలున్నా అవి సర్దుకుంటాయన్న ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ అంతే సానుకూలంగా స్పందించారు. ట్రంప్ అభిప్రాయాలను తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని.. తాను కూడా అదే భావాలతో స్పందిస్తున్నానని మోదీ పేర్కొన్నారు. "ఇండియా, అమెరికా మధ్య అత్యంత సానుకూలమైన, ముందుచూపుతో కూడిన సమగ్ర అంతర్జాతీయ స్థాయి వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది" అని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మోదీ, ట్రంప్ చివరిసారిగా ఈ ఏడాది జూన్ 17న ఫోన్‌లో మాట్లాడుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత వారిద్దరూ బహిరంగ వేదికపై తమ అభిప్రాయాలు పంచుకోవడం ఇదే మొదటిసారి.

ఒక్క ముద్ద తక్కువ తింటాం కానీ, ఆత్మ గౌరవాన్ని వదులుకోం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: భారత్, రష్యా దేశాలు చైనాకు తలొగ్గాయన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత మనీశ్ తివారీ తీవ్రంగా స్పందించారు. "భారతీయులు ఒక ముద్ద తక్కువైనా తింటారేమో గానీ, ఆత్మ గౌరవాన్ని మాత్రం వదులుకోరు" అని అన్నారు. ఆయుధ బలాన్ని చూపించి భారతదేశాన్ని ఎవరూ లొంగదీసుకోలేరని వ్యాఖ్యానించారు. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంతో పోరాడి విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. "ఇక్కడ సమస్య టారిఫ్‌లు కాదు.. ఆత్మగౌరవం, మర్యాద" అని ట్రంప్, నవారోను ట్యాగ్ చేస్తూ మనీశ్ తివారీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, జిన్‌పింగ్, పుతిన్ కలిసి ఉన్న ఫొటోను ట్రంప్ శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి.. "భారత్, రష్యా చైనాకు లొంగిపోయినట్లున్నాయి. భారత్‌ను మనం కోల్పోయాం" అని వ్యాఖ్యానించారు.

ఎప్పటి నుంచో జీఎస్టీ సంస్కరణలపై కసరత్తు

- వాటికి, బయటి విషయాలకు సంబంధం లేదు: అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలకు, దేశం బయట నెలకొన్న పరిస్థితులకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర రైల్వే, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఏడాదిన్నర క్రితమే.. అమెరికా ఎన్నికలకు ముందే జీఎస్టీ సంస్కరణలపై కసరత్తు మొదలైందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలకు, ఇటీవల భారత వస్తువులపై అమెరికా అధిక సుంకాలు విధించడానికి సంబంధం ఏదైనా ఉందా అన్న ప్రశ్నకు ఆయన ఈ వివరణ ఇచ్చారు. శనివారం ఆయన బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. దసరా నవరాత్రుల మొదటి రోజైన ఈ నెల 22 నుంచి జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వస్తాయని, ఇవి ప్రజలపై పన్నుల భారం తగ్గిస్తాయని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ఇచ్చిన వాగ్దానం నెరవేరిందన్నారు. రోజువారీ వినియోగించే వస్తువులు అన్నింటిపై జీఎస్టీ తగ్గుతుందని తెలిపారు.

మోదీ అమెరికా పర్యటన రద్దు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: ప్రధాని మోదీ అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నెల చివరిలో అమెరికాలోని ఐక్య రాజ్యసమితి(ఐరాస) సచివాలయంలో 80వ ఉన్నతస్థాయి సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మోదీ హాజరై ప్రసంగించాల్సి ఉంది. అయితే, ట్రంప్ విధించిన సుంకాల వైఖరిపై ఆగ్రహంతో ఉన్న ప్రధాని.. ఈ సమావేశానికి దూరంగా ఉండడంతోపాటు తన ప్రసంగాన్నీ రద్దు చేసుకున్నారు. ప్రధానికి బదులుగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరుకానున్నారు. దీంతో ఈ సమావేశంలో ప్రసంగించే వారి పేర్లను సవరిస్తూ ఐరాస తాజాగా జాబితాను విడుదల చేసింది. ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు జరిగే సమావేశాల్లో తొలిరోజు ప్రపంచ దేశాల నేతలను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించనున్నారు. అనంతరం.. బ్రెజిల్ సహా ఇతర దేశాలకు చెందిన నాయకులు ప్రసంగిస్తారు. భారత్ తరఫున హాజరయ్యే జైశంకర్ ఈ నెల 27న మాట్లాడనున్నారు. కాగా, గత జూలైలో విడుదల చేసిన వక్తల జాబితాలో మోదీ 26వ తేదీన ప్రసంగించనున్నట్టు పేర్కొన్నారు.

లోకం తీరు



హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న కాంగ్రెస్

- ఎంపీ శశికాంత్ యూట్యూబర్లతో ధర్మస్థలపై అసత్య ప్రచారం చేయించారు
- రాహుల్ గాంధీ హస్తం కూడా ఉంది
- గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి



బళ్లారి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాలపై కాంగ్రెస్ పార్టీ అసత్య ఆరోపణలు చేయిస్తోందని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ తెరవెనుక ఉండి, యూట్యూబర్ల చేత ధర్మస్థల మంజునాథ ఆలయంలో హత్యలు జరిగాయని అసత్య ఆరోపణలు చేయించారని ఆయన తీవ్ర విమర్శచేశారు. బళ్లారిలోని తన నివాసంలో బీజేపీ నాయకులతో కలిసి శనివారం గాలి జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ శశికాంత్ సెంథిల్‌తోపాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా తెరవెనుక ఉన్నారని ఆరోపించారు. ఈ కేసును సీబీఐ, ఎన్ఐఏకి అప్పగిస్తే వాస్తవాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ధర్మస్థలలో హత్యలు జరిగాయని, మృతదేహాలను పూడ్చిపెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేసిన మాజీ పారిశుధ్యకార్మికుడు వాస్తవాలను అంగీకరించాడని, కొందరి ఒత్తిడి కారణంగానే అసత్య ఫిర్యాదు చేశానని ఒప్పుకున్నాడని గుర్తు చేశారు. అయితే, గాలి జనార్దనరెడ్డి నిరాధార ఆరోపణలు చేశారని పేర్కొంటూ బెంగళూరు సిటీ సివిల్ కోర్టులో శశికాంత్ సెంథిల్ శనివారం పరువునష్టం దావా వేశారు. ఇదిలా ఉండగా, ధర్మస్థలలో యువతుల మృతదేహాలను పాతిపెట్టినట్టు అసత్య ఫిర్యాదు చేసిన మాజీ పారిశుధ్య కార్మికుడు చిన్నయ్యకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

మహీంద్రా తగ్గింపు తక్షణమే

కార్ల ధరల తగ్గింపును ప్రకటించిన టయోటా, రెనో, మహీంద్రా



న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాన్ని కొత్త కార్ల కొనుగోలుదారులకు అందించేందుకు మరిన్ని కంపెనీలు ముందుకువచ్చాయి. ఇప్పటికే పలు మోడళ్ల ధరలను తగ్గించనున్నట్టు టాటా మోటార్స్ శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఇదే బాటలో టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం), రెనో ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలు తమ వాహనాల ధరలను తగ్గిస్తున్నట్టు శనివారం ప్రకటించాయి. టయోటా, రెనో ఈ నెల 22 నుంచి తగ్గించిన ధరలను అమల్లోకి తీసుకురానున్నట్టు ప్రకటించగా.. మహీంద్రా మాత్రం తక్షణమే అమల్లోకి తెస్తున్నట్టు వెల్లడించింది.

టయోటా రూ.3.49 లక్షల వరకు..

తన వాహనాల ధరలను రూ.3.49 లక్షల వరకు తగ్గిస్తున్నట్టు కంపెనీ వెల్లడించింది. గ్లాంజా హ్యాచ్‌బ్యాక్ ధర రూ.85,300 వరకు, టైసర్ ధర రూ.1.11 లక్షలు, రుమియన్ ధర రూ.48,700, హైరైడర్ రూ.65,400, క్రిస్టా రూ.1.8 లక్షలు, హైక్రాస్ రూ.1.15 లక్షలు, ఫార్చూనర్ ధర రూ.3.49 లక్షలు తగ్గనున్నట్టు పేర్కొంది. అలాగే లెజెండర్ ధర రూ.3.34 లక్షలు తగ్గే అవకాశం ఉండగా.. హైలక్స్ ధర రూ.2.52 లక్షలు, కామ్రీ ధర రూ.1.01 లక్షలు, వెల్‌ఫైర్ ధర రూ.2.78 లక్షలు తగ్గనున్నట్టు తెలిపింది. ఈ నెల 22 నుంచి సవరించిన ధరలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఈ ప్రయోజనాలను తమ కస్టమర్లకు అందిస్తున్నందుకు సంతోషంగా ఉందని టీకేఎం వైస్ ప్రెసిడెంట్ (సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ అండ్ ప్రాఫిట్ ఎన్‌హాన్స్‌మెంట్) వరిందర్ వాధ్వా పేర్కొన్నారు.

రెనో రూ.96,395 వరకు..

జీఎస్టీ రేటు తగ్గింపు ప్రయోజనాన్ని కొనుగోలుదారులకు పూర్తిగా అందించనున్నట్టు రెనో ప్రకటించింది. తమ వాహనాల ధరలను రూ.96,395 వరకు తగ్గించనున్నట్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా అన్ని డీలర్‌షిప్‌లలో కొత్త ధరలతో కస్టమర్లు రెనో కారును బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఎంట్రీలెవల్ క్విడ్ ధర రూ.55,095 వరకు, ట్రైబర్ ధర రూ.80,195, కైగర్ ధర రూ.96,395 వరకు తగ్గనున్నట్టు కంపెనీ తెలిపింది. సవరించిన ధరలు ఈనెల 22న, ఆ తర్వాత చేసే అన్ని డెలివరీలకు వర్తిస్తుందని పేర్కొంది.

మహీంద్రా రూ.1.56 లక్షల వరకు

తన ప్యాసెంజర్ వాహన శ్రేణి ధరలను రూ.1.56 లక్షల వరకు తగ్గించినట్టు కంపెనీ ప్రకటించింది. తగ్గించిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. బొలెరో/నియో రేంజ్ ధర రూ.1.27 లక్షలు, ఎక్స్‌యూవీ3ఎక్స్‌వో (పెట్రోల్) రూ.1.4 లక్షలు, ఎక్స్‌యూవీ3ఎక్స్‌వో (డీజిల్) రూ.1.56 లక్షలు, థార్2డబ్ల్యూడీ (డీజిల్) రూ.1.35 లక్షలు, థార్4డబ్ల్యూడీ (డీజిల్) రూ.1.01 లక్షలు, స్కార్పియో క్లాసిక్ రూ.1.01 లక్షలు, థార్‌రాక్స్ రూ.1.33 లక్షలు, ఎక్స్‌యూవీ700 రూ.1.43 లక్షల మేర తగ్గించింది.

భారీగా ధరలు తగ్గించే యోచనలో మారుతీ

దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ అయిన మారుతీ సుజుకీ కూడా తన కార్ల ధరలను భారీగా తగ్గించే అవకాశం ఉందన్న సంకేతాలిచ్చింది. ఆల్టో ధర రూ.40,000-50,000, వ్యాగన్ ఆర్ ధర రూ.60,000-67,000 మధ్య తగ్గవచ్చని మారుతీ సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ 'బిజినెస్ స్టాండర్డ్' ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ధరలకు సంబంధించిన వివరాలపై కంపెనీ అధికారులు ఇంకా కసరత్తు చేస్తున్నారని చెప్పారు. జీఎస్టీ తగ్గింపు నేరుగా చిన్న కార్లకు ప్రయోజనం కలిగిస్తాయని, ఈ ఏడాదిలో అమ్మకాల్లో 10 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పన్ను సంస్కరణలతో ఆటో రంగానికి కీలకమైన ఊతం లభిస్తుందన్నారు. కాగా పన్ను తగ్గింపు తర్వాత (ఎక్స్‌షోరూమ్) మారుతీ కార్ల బేస్ మోడళ్ల ధరల అంచనాల విషయానికి వస్తే.. ఆల్టో కే10 రూ.40వేలు, వ్యాగన్ ఆర్ రూ.57 వేలు, స్విఫ్ట్ రూ.58వేలు, డిజైర్ రూ.61 వేలు, బాలెనో రూ.60వేలు, ఫ్రాన్‌ఎక్స్ రూ.68వేలు, బ్రెజ్జా రూ.78వేలు, ఎర్టిగా రూ.41వేలు, సెలేరియో రూ.50వేలు, ఎక్స్‌ఎల్ 6 రూ.35 వేలు, జిమ్నీ రూ.1.14 లక్షలు, ఇగ్నిస్ రూ.52వేలు, ఇన్విక్టో రూ.2.25 లక్షలు, ఎస్-ప్రెసో రూ.38 వేలు తగ్గవచ్చని అంచనా.

రూ.2 లక్షల దిగువకు జావా, యెజ్డీ బైక్‌లు

350 సీసీకన్నా తక్కువ ఉన్న మోటార్‌సైకిళ్లపై జీఎస్టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించిన నేపథ్యంలో జావా, యెజ్డీ మోటార్‌సైకిళ్ల ధరలను తగ్గిస్తున్నట్టు క్లాసిక్ లెజెండ్స్ కంపెనీ ప్రకటించింది. దీంతో కొత్త కస్టమర్లకు రూ.17 వేల వరకు ప్రయోజనం కలుగనుంది. ధరల తగ్గింపుతో పలు మోడళ్ల ధరలు రూ.2 లక్షల ధరకన్నా(ఎక్స్‌షోరూమ్) దిగువకు రానున్నాయి. యెజ్డీ అడ్వెంచర్, రోడ్‌స్టర్, స్క్రాంబ్లర్, జావా 42 బాబర్ వంటి మోడళ్ల ధరలు దిగిరానున్నాయి. జావా 42 ధర రూ.1,72,942 నుంచి రూ.1,59,431కు (రూ.13,511 ఆదా), జావా 350 ధర రూ.1,98,950 నుంచి రూ.1,83,407కు (రూ.15,543 ఆదా), 42 బాబర్ ధర రూ.2,09,500 నుంచి రూ.1,93,133కు (రూ.16,367 ఆదా), 42 ధర రూ.2,10,142 నుంచి రూ.1,93,725కు (రూ.16,417 ఆదా), పెరాక్ ధర రూ.2,16,705 నుంచి రూ.1,99,775కు (రూ.16,930 ఆదా) తగ్గనుంది. ఇక యెజ్డీ రోడ్‌స్టర్ ధర రూ.2,09,969 నుంచి రూ.1,93,565కు (రూ.16,404 ఆదా), అడ్వెంచర్ ధర రూ.2,14,900 నుంచి రూ.1,98,111కు (రూ.16,789 ఆదా), స్క్రాంబ్లర్ ధర రూ.2,11,900 నుంచి రూ.1,95,345కు (రూ.16,555 ఆదా) దిగిరానున్నాయి.

దేశమంతా 'సర్' ప్రక్రియ!

- బిహార్ ఎన్నికల తర్వాత చేపట్టే యోచన?


న్యూఢిల్లీ, సెప్టెంబరు 6 : ఓటరు సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను దేశమంతా అమలుచేసే ఆలోచనలో భారత ఎన్నికల సంఘం(ఈసీ) ఉంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియను సర్వత్రా చేపట్టాలని యోచిస్తోంది. దీనిపై ఈసీ అధికారికంగా ఇంతవరకు ప్రకటన చేయకపోయినా, ఎన్నికల సంఘం వర్గాల కథనాలు, మాత్రం ఇదే విషయం ధ్రువీకరిస్తున్నాయి. ఈ వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ చానల్ కథనం ప్రసారం చేసింది. ఈ కథకాన్ని అనుసరించి.. ఈ నెల 10వ తేదీన రాష్ట్రాల/కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారులతో (సీఈవోలు) భారత ఎన్నికల సంఘం ఢిల్లీలో భేటీ కానుంది. 'సర్' ప్రక్రియను దేశమంతా విస్తరించడంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే వీలుంది. పది పాయింట్లపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌కు వీలుగా సిద్ధమై రావాలని సీఈవోలను ఈసీ ఆదేశించింది. అయితే, ఇవన్నీ 'సర్'తో ముడిపడినవే కావడం గమనార్హం.. సీఈవోలు పనిచేస్తున్న రాష్ట్రం లేక కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు... చివరిగా 'సర్' ప్రక్రియ అక్కడ ఎప్పుడు నిర్వహించారు.. తదితర అంశాలపై ప్రజంటేషన్ ఉండాలని ఈసీ నిర్దేశించింది.

బీజేపీలో కామరాజ్ ప్లాన్!?

- పదేళ్లుగా క్యాబినెట్లో ఉన్నవాళ్లు పార్టీలోకి.. పార్టీలో సీనియర్లు వారు ప్రభుత్వంలోకి
- ప్రజల్లోకి తరం మార్పు జరిగిందనే సంకేతాలు.. ఢిల్లీలో బీజేపీ అగ్ర నేతల ఆలోచన



న్యూఢిల్లీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో బీజేపీ కామరాజ్ ప్లాన్‌ను అమలు చేయనుందా!? పదేళ్లుగా కేంద్ర మంత్రివర్గంలో ఉన్న వారిని పార్టీలోకి.. పార్టీలో ఉన్న ముఖ్య నాయకులను ప్రభుత్వంలోకి తీసుకోనుందా!? తద్వారా, ఇటు పార్టీలోనూ అటు ప్రభుత్వంలోనూ కొత్త వారికి అవకాశం కల్పించనుందా!? ఈ ప్రశ్నకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. ఉపరాష్ట్రపతి ఎన్నిక ముగిసిన తర్వాత పార్టీ అగ్రనేతలు ఈ అంశంపై దృష్టి సారించనున్నారని వివరించాయి. ప్రభుత్వంలో చిరకాలం ఉన్న నాయకులు పార్టీలోకి.. పార్టీకి చెందిన ముఖ్యమైన నాయకులు ప్రభుత్వంలోకి వెళ్లినప్పుడే కొత్త వారికి అవకాశాలు లభిస్తాయంటూ ఒకప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ అధ్యక్షుడు కామరాజ్ రూపొందించిన ప్రణాళికను ఇప్పుడు బీజేపీ తనదైన శైలిలో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. మోదీ క్యాబినెట్లో మొదటి నుంచీ కొనసాగుతున్న.. అధికార యంత్రాంగం నుంచి మంత్రి వర్గంలోకి చేరిన మంత్రుల్లో అత్యధికులను తప్పించి.. ఇప్పటి వరకూ పార్టీ సేవకే అంకితమైన వారిని క్యాబినెట్లో చేర్చుకునే విషయంపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఈ ప్రణాళికకు తుది రూపకల్పన జరిగిన వెంటనే మోదీ తన మంత్రివర్గ సభ్యులతో రాజీనామా చేయించే అవకాశాలున్నాయని, ఆ తర్వాత సాధ్యమైనంత మేరకు కొత్త ముఖాలతో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. అలాగే, క్యాబినెట్లోనే కాకుండా పార్టీలోనే కొనసాగుతున్న మరి కొంతమందికి వివిధ స్థాయుల్లోనూ అవకాశాలు కల్పిస్తారన్న చర్చ జరుగుతోంది. ముఖ్యంగా యువకులు, అనుభవజ్ఞులకు సమానంగా అవకాశం ఇవ్వాలని, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తరం మార్పు జరిగిందనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకూ పలువురు ఎంపీలను ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్యేలను ఎంపీలుగా పోటీ చేయించే పద్ధతి బీజేపీలో ఉందని, కానీ, పార్టీ నుంచి ప్రభుత్వానికి, ప్రభుత్వం నుంచి పార్టీకి నాయకులను బదిలీ చేసి వారి సేవలను ఉపయోగించుకునే ప్రక్రియను అంతగా అమలు చేయలేదని పార్టీ నేత ఒకరు చెప్పారు. తద్వారా, పార్టీతో పాటు ప్రభుత్వాన్ని కూడా మరింత బలోపేతం చేయాలన్నదే తమ లక్ష్యమని ఆయన వివరించారు. కాగా, ఈ ప్రణాళికను అమలు చేస్తే కేంద్ర క్యాబినెట్లో దాదాపు 30 మంది మంత్రులను తప్పించాల్సి వస్తుందని తెలుస్తోంది. వీరిలో అత్యధికులు 2014 నుంచీ మంత్రి పదవిలో ఉన్నవారు ఉండవచ్చని సమాచారం. ఇక, పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కూడా ప్రస్తుతం చర్చలో ఉన్న పేర్లు కాక కొత్త వ్యక్తిని ముందుకు తీసుకువచ్చినా ఆశ్చర్యం లేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటి వరకూ శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరుల పేర్లు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. పార్టీ అధ్యక్షుడి టీమ్‌లో కూడా అనేక కొత్త ముఖాలకు ఆస్కారం ఉందని తెలుస్తోంది.



గుడి ఆవరణలో కాకతీయుల పాలనా కాలాన్ని తప్పుగా పేర్కొన్న బోర్డు

క్రీస్తు శకం బదులు క్రీస్తు పూర్వం

- కాకతీయులపై పురావస్తు పొరపాట్లు
- వేయి స్తంభాల గుడి బోర్డుపై తప్పులు.. పురావస్తుశాఖ నిర్లక్ష్యం

హనుమకొండ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో పురాతన కాలం నాటి వివిధ రాజుల పాలనా కాలంపై సర్వం తెలిసిన కేంద్ర పురావస్తుశాఖ.. తప్పులో కాలేసిందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ వేయి స్తంభాల గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన బోర్డులే అందుకు నిదర్శనంగా నిలిచాయి. తన పరిధిలోని సుప్రసిద్ధ ప్రాచీన చారిత్రక కట్టడాలపై పర్యాటకులకు తెలిపేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బోర్డుపై 2,3 చోట్ల క్రీ.పూ అని రాశారు. క్రీ.పూ.1158-1198 మధ్య పాలించిన కాకతీయ రుద్రదేవుడి హయాంలో వేయిస్తంభాల గుడిని త్రికూటాలయం నిర్మించారని పేర్కొన్న పురావస్తుశాఖ.. కాకతీయ రాజుల్లోకెల్లా ఎంతో ప్రతిభావంతంగా క్రీ.పూ. 1199 నుంచి 1262 వరకు.. గణపతి మహారాజు తదనంతరం క్రీ.పూ 1262 నుంచి 1289 వరకు అన్న వాక్యంలోనూ అదే తప్పు చేసింది. ఇది పెద్ద తప్పని.. కాకతీయుల పాలించింది క్రీ.పూ. కాదు క్రీ.శ అని ఉండాలని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ విషయాన్ని కేంద్ర పురావస్తుశాఖ కన్సర్వేటర్ నవీన్ దృష్టికి తీసుకెళ్లగా, దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిదిద్దుతామని చెప్పారు.

విమోచన వేడుకల ముఖ్య అతిథిగా రక్షణ మంత్రి

అదే రోజు కంటోన్మెంట్‌లో వాజ్‌పేయి విగ్రహానికి శంకుస్థాపన

కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ నెల 17న నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవాలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఉత్సవాల్లో రాజ్‌నాథ్‌తోపాటు ఇతర కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే పాల్గొంటారని బీజేపీ వర్గాల సమాచారం. ఉత్సవాల్లో తెలంగాణ స్వాతంత్ర్య సమర యోధుల పోరాటాలను వివరించే ఎగ్జిబిషన్ చేసి, సమర యోధులను సన్మానిస్తారు. తర్వాత కంటోన్మెంట్ వద్ద పార్కులో మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహానికి రక్షణ మంత్రి శంకుస్థాపన చేస్తారు.

జూనియర్ మైనింగ్ ఇంజనీర్ల పునర్నియామకం

జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ (జేఎంఈటీ)లుగా చేరి... వివిధ కారణాలతో తొలగింపునకు గురైన 43 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సింగరేణి సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వీరంతా విధులకు గైర్హాజరు కావడం... ధ్రువీకరణ పత్రాలను సమర్పించకపోవడంవల్ల విధుల నుంచి తొలగించినట్లు సంస్థ తెలిపింది. అయితే వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవడంపై డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది.

పోస్టుల్లో దూషిస్తున్నాడని..

యువకుడి అపహరణ.. హత్య

- ఆపై పెట్రోల్ పోసి, దహనం.. ఆరుగురి అరెస్టు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పోస్టుల్లో దూషిస్తున్నాడనే కోపంతో ఓ యువకుడిని అపహరించి, హతమార్చిన నిందితులను భూపాలపల్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు పెట్రోల్ పోసి, ఆ యువకుడి శవాన్ని దహనం చేశారు. ఈ ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో జరిగింది. భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు శనివారం మీడియాకు వివరాలను వెల్లడించారు. భూపాలపల్లి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎండీ బాసిత్(20)తో శాంతినగర్ కాలనీకి చెందిన రడపాక భాస్కర్ అలియాస్ బబ్లూ, బుస్స ప్రశాంత్ అలియాస్ సోనూ, గాజుల కుషాల్‌తో వివాదాలున్నాయి. రెండు నెలలక్రితం అసభ్యంగా మాట్లాడాడంటూ బాసిత్‌పై వీరు దాడి చేశారు. దీంతో బాసిత్ వారిని దూషిస్తూ ఇన్‌స్టాగ్రామ్, వాట్సా్‌ప్‌లో పోస్టు లు పెట్టడం ప్రారంభించారు. దీంతో ఈ ముగ్గురూ కలిసి బాసిత్‌ను అంతమొందించాలని పథకం వేశారు. స్నేహితులు పందిళ్ల శ్రవణ్, బరిగల ప్రణయ్, చొప్పరి నవీన్ సాయం తీసుకున్నారు. ఈ నెల 4న అరుణ్ అనే మిత్రుడితో కలిసి బాసిత్ బైక్‌పై వెళ్తుండగా.. అడ్డుకుని బాసిత్‌పై దాడి చేసి, కారులో అపహరించి, ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లోకి తీసుకెళ్లారు. అక్కడ బాసిత్ చేతులను వెనక్కి కట్టేసి, కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం పెట్రోల్ పోసి, శవాన్ని దహనం చేశారు. భూపాలపల్లి పోలీసులు, ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.



టాప్ ర్యాంకర్‌కు బంగారు పతకం, ప్రశంసాపత్రం ప్రదానం చేస్తున్న డా.కె.విశ్వనాథన్, డా.జీవీ సెల్వం తదితరులు

ఉన్నత విద్యతోనే దేశాభివృద్ధి

వీఐటీ వ్యవస్థాపకులు కె. విశ్వనాథన్

- ఘనంగా 'వీఐటీ చెన్నై' 13వ స్నాతకోత్సవం
- 6,581 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'వీఐటీ చెన్నై' 13వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వీఐటీ చెన్నై ప్రాంగణంలో జరిగిన ఈ స్నాతకోత్సవానికి వీఐటీ వ్యవస్థాపకులు, చాన్స్‌లర్ డాక్టర్ కె.విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, వర్సిటీ ఉపాధ్యక్షులు డా.శంకర్ విశ్వనాథన్, డా.జీవీ సెల్వం అతిథులను పరిచయం చేశారు. వైస్ చాన్స్‌లర్ డా.వీఎస్ కాంచన భాస్కరన్ స్వాగతోపన్యాసం చేశారు. తమిళనాడు సమాచార, సాంకేతిక శాఖ మంత్రి డా.పళనివేల్ త్యాగరాజన్ ముఖ్య అతిథిగా, చెన్నైలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ షెల్లీ సలేహిన్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ స్నాతకోత్సవంలో 6,468 మంది అండర్ గ్రాడ్యుయేట్, 113 మంది పోస్టుగ్రాడ్యుయేట్ మొత్తం 6,581 మంది విద్యార్థిని,విద్యార్థులు పట్టాలు స్వీకరించారు. 39 మంది టాప్ ర్యాంకర్లు బంగారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో విద్యార్థుల స్థూలనమోదు నిష్పత్తి కేవలం 29 శాతమేనని, ఇది 50 శాతానికి పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యకు కేవలం 2.5 శాతం నిధులు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. ఉన్నత విద్య ద్వారా మాత్రమే భారతదేశం 2047 నాటికి ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటవగలదని అభిప్రాయపడ్డారు. మంత్రి త్యాగరాజన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్య అనేది ఉద్యోగం, నైపుణ్యాలను మెరుగుపరచడం గురించి మాత్రమే ఉందని, ఈ విధానాన్ని కొద్దిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక అతిథి షెల్లీ సలేహిన్ మాట్లాడుతూ... యువత జీవితంలో విజయం సాధించాలంటే ప్రతిభ మాత్రమే సరిపోదని, క్రమశిక్షణ, సద్గుణాలు కూడా చాలా ముఖ్యమైనవని సూచించారు. వీఐటీ వ్యవస్థాపకులు విశ్వనాథన్ నిర్వహిస్తున్న ఉన్నత విద్యాసంస్థల్లో డిగ్రీలు పూర్తిచేసిన వారెందరో బంగ్లాదేశ్‌తో పాటు వివిధ దేశాల్లో ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ వైస్ చాన్స్‌లర్ డా.డి.త్యాగరాజన్, అడ్వైజర్ డా.ఎస్పీ త్యాగరాజన్, వీఐటీ వేలూరు అసోసియేట్ వైస్ చాన్స్‌లర్ డా.పార్థసారధి మాలిక్, అదనపు రిజిస్ట్రార్ టి.జయభారతి, డా.పీకే మనోహరన్ పాల్గొన్నారు.

మహేశ్‌గౌడ్‌కు సీఎం రేవంత్ సన్మానం

- టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి
- గాంధీభవన్‌లో రేపు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మహేశ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు సైతం టీపీసీసీ చీఫ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కాగా, గాంధీ భవన్‌లో సోమవారం టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. మహేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. స్థానిక ఎన్నికలకు ముందే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహంపైనా చర్చించే అవకాశం ఉంది.

సదరన్ ఆర్మీ కమాండర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ


అందజేస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్

హైదరాబాద్, అల్వాల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్ సీఎం రేవంత్‌రెడ్డితో శనివారం ఆయన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమం, విపత్తు సహాయక చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు వంటి కీలక అంశాలపై వారు చర్చించారు. భారత సైన్యం అందిస్తున్న అమూల్యమైన సేవలకు గానూ సీఎం రేవంత్‌రెడ్డి ఆర్మీ అధికారులను ప్రశంసించారు. జనరల్ ధీరజ్ సేథ్ మాట్లాడుతూ.. భారత సైన్యం దేశ రక్షణతో పాటు అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేస్తుందని సీఎంకు హామీ ఇచ్చారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణలో సైన్యం, పౌర సంబంధాలు మరింతగా బలపడుతాయని ఆర్మీ అధికారులు వెల్లడించారు. సీఎంను కలిసిన వారిలో దక్షిణ భారత ఏరియా జీవోసీ, మేజర్ జనరల్ ఆర్ఎన్ శ్రీనివాస్, తెలంగాణ, ఏపీ జీవోసీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా కూడా ఉన్నారు. కాగా, శనివారం సాయంత్రం ఉప్పల్ సమీపంలో ప్రమాదానికి గురైన సీనియర్ జర్నలిస్టు కట్ట కవితకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

కాళేశ్వరంలో కమీషన్ల కోసమే..

పేదల ఇళ్ల సొమ్ములనూ మళ్లించారు.. మేం 4.50 లక్షల ఇళ్లకు 22,500 కోట్లు ఖర్చు పెట్టాం

- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాల్లో.. కవిత కొరివి దెయ్యం
- ఎక్సైజ్, పర్యాటక మంత్రి జూపల్లి
- మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు


గద్వాలలో డబుల్ ఇళ్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు పొంగులేటి, జూపల్లి, శ్రీహరి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "పేదల సంక్షేమం పట్టని గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్లు కావాలనుకుంది. అందుకే.. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఖర్చు పెట్టాల్సిన సొమ్మును కాళేశ్వరానికి మళ్లించి, అవినీతికి పాల్పడ్డారు" అని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన ఎక్సైజ్, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి.. మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం - అభివృద్ధిని రాష్ట్రంలో జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్తున్నామన్నా రు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు గుర్తుచేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదని, తాము రూ.22,500 కోట్లు ఖర్చుచేసి, 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. "ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటే బిల్లులు రావని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారు. అప్పులు చేసి, పుస్తెలమ్ముకోవాలని ప్రజలను భయపెట్టారు. మేము ప్రతీ సోమవారం ఇళ్ల నిర్మాణాలు జరిగిన మేరకు బిల్లులను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని ఆయన కుమార్తె కవిత అంటున్నారని, ఆమె కూడా ఒక కొరివి దెయ్యమేనని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకానికి కనీసం రూ.లక్ష పెంచాలని నాడు తాము కోరినా.. కేసీఆర్ కనికరించలేదని విమర్శించారు. "అప్పట్లో నేను అదే పార్టీ(బీఆర్ఎస్)లో ఉన్నానని హరీశ్‌రావు చెబుతున్నారు. అప్పట్లో నేను తప్పులను ఎత్తి చూపినా పట్టించుకోలేదు" అని వివరించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల మంజూరు విషయంలో ముఖం చూసి, బొట్టు పెట్టిందని, తమ సర్కారు మాత్రం పార్టీలకు అతీతంగా అర్హులకే ఇళ్లను మంజూరు చేసిందని స్పష్టం చేశారు.

కొరతపై రైతు కన్నెర్ర!

- యూరియా బస్తాల కోసం ఆగని రైతుల ఆందోళనలు
- మానుకోటలో యూరియా లారీపై రైతుల దాడి
- కరీంనగర్ జిల్లాలో ఘర్షణలు, పలువురికి గాయాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్కేపల్లిలో బారులు తీరిన రైతులు

రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతుల ఆందోళనలు, ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. చాలాచోట్ల టోకెన్లు పంపిణీ చేసినా.. యూరియా లేకపోవడంతో తీవ్ర నిరాశతో అనేక మంది రైతులు వెనుదిరగగా.. పలు చోట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగుతున్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యాలయానికి శనివారం వచ్చిన లారీపై రాళ్లు, కర్రలతో దాడి చేసి పలు యూరియా బస్తాలను అపహరించుకుపోయారు. పంటలకు సరిపడా యూరియా అందించాలని కోరుతూ రైతులు గూడూరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎరువుల దుకాణం ఎదుట ఆందోళన చేపట్టారు. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం మల్లారంలో యూరియా లోడ్‌తో వచ్చిన లారీని అడ్డుకుని నిరసన తెలిపారు. యూరియాను సక్రమంగా సరఫరా చేయడం లేదంటూ కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, వెన్నంపల్లి, సైదాపూర్‌లోని విక్రయ కేంద్రాలకు భారీగా తరలివచ్చిన రైతులు ఆందోళన చేపట్టారు. వెన్నంపల్లిలో ఘర్షణ తలెత్తి పలువురు రైతులకు గాయాలయ్యాయి. వెన్కేపల్లి సొసైటీ కార్యాలయంపై రైతులు దాడి చేసి ప్రధాన ద్వారం, కౌంటర్‌ను ధ్వంసం చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, జగిత్యాల జిల్లా సారంగాపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలోనూ ఆందోళనలు కొనసాగాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాల్లోనూ రైతులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

•ఆర్కే RK

నిజానికి ఆరు నెలల క్రితం భారత రాష్ట్ర సమితి పుంజుకుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం తమదే అని బీఆర్ఎస్ నేతలు బలంగా నమ్మారు. ఇప్పుడు అదే పరిస్థితి ఉందా అంటే చెప్పలేం. ఎందుకంటే, ఎన్నికల వైతరణిని కేసీఆర్ సునాయాసంగా దాటాలంటే మధ్యలో ఎన్నో గండాలను అధిగమించాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా రేవంత్‌రెడ్డి–చంద్రబాబు–మోదీ కలిసి కుట్రపన్నారన్నది నిజమే అనుకుందాం. ఇలాంటి రాజకీయాలు కేసీఆర్‌కు కొత్త కాదు. 2019 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించడానికి జగన్మోహన్‌రెడ్డితో కలసి కుట్ర చేశారు కదా! ప్రస్తుతం సాధారణ ఎన్నికలకు మూడేళ్లకు పైగా వ్యవధి ఉన్నందున సీబీఐ విచారణ ఎలా ఉండబోతుందన్నదే కీలకం. బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా బీజేపీ పెద్దలకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య అవగాహన నిజంగానే ఉంటే... ప్రస్తుత సంకటం నుంచి కేసీఆర్ తప్పించుకోలేరని చెప్పవచ్చు. కాంగ్రెస్, బీజేపీ ఆటలో కేసీఆర్ పావుగా మారతారని ఎవరైనా ఊహించగలరా?

రేవంత్ దెబ్బకు రెండు పిట్టలు!



'ఆయనొక అపర చాణక్యుడు – రాజకీయ గండర గండడు! పాచిక విసిరాడంటే రాజకీయ ప్రత్యర్థులు చిత్తు కావాల్సిందే'... తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు ఆయన మద్దతుదారులు తగిలించిన భుజకీర్తులు ఇవి. కాలం కలిసి వచ్చినంత వరకు ఆయన అలాగే వెలుగొందారు. 2023 ఎన్నికల తర్వాత ఆయన జాతకం తిరగబడింది. ఒకప్పుడు తన ఎత్తుగడలకు చిత్తయిన రాజకీయ ప్రత్యర్థులే ఇప్పుడు ఆయనపై పైచేయి సాధిస్తున్నారు. ఒకవైపు ఇంటిపోరు, మరో వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూకుడుతో కేసీఆర్ పరిస్థితి తలకిందులవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జుట్టు దొరకపుచ్చుకొని ఒక ఆట ఆడుకున్న కేసీఆర్... ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి ఎత్తుగడలకు చిత్తు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అవకతవకలు జరిగాయని చాలాకాలంగా ఆరోపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవకాశం కోసం ఎదురుచూశారు. పీసీ ఘోష్ నివేదిక తదనంతర పరిణామాలతో కేసీఆర్‌కు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా కాళేశ్వరంపై సీబీఐతో విచారణ చేయిస్తామని శాసనసభలో ప్రకటించి కేంద్రానికి విజ్ఞప్తి పంపటం ద్వారా ఇటు భారత రాష్ట్ర సమితిని, అటు భారతీయ జనతా పార్టీని రేవంత్‌రెడ్డి ఒకేసారి ఇరకాటంలోకి నెట్టారు. తన చేతికి మట్టి అంటకుండా సీబీఐ భుజాలపై తుపాకీ పెట్టి కేసీఆర్‌ను దెబ్బతీసే ఎత్తుగడను ఆయన ఎంచుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా అవినీతి జరిగిందని చెప్పించి... కేసీఆర్‌పై చర్యలు తీసుకొని ఉంటే కక్ష సాధింపునకు పాల్పడ్డారన్న అపవాదు వచ్చి ఉండేది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల విశ్వసనీయత ప్రశ్నార్థకంగా ఉండేది. దీంతో నిజాన్ని నిగ్గు తేల్చే బాధ్యతను సీబీఐకి బదలాయించారు. ఈ చర్యవల్ల ఒక రకంగా బీజేపీ కూడా ఇరకాటంలో చిక్కుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసీఆర్ అండ్ కోకు క్లీన్ చిట్ ఇస్తే... బీఆర్ఎస్-బీజేపీ ఒకటేనని నిందించే అవకాశం రేవంత్‌రెడ్డికి దక్కుతుంది. అలా కాకుండా కేసీఆర్ అండ్ కోను సీబీఐ దోషులుగా నిర్ధారిస్తే తాను కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డానన్న అపవాదు నుంచి తప్పించుకోవచ్చు. ఒకవేళ సీబీఐ విచారణకు కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తే ఆ రెండు పార్టీలూ తోడు దొంగలని నిందించవచ్చు. రాజకీయాల్లో తనకు లోతు తెలియదని అనుకోవద్దని వివిధ సందర్భాలలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానిస్తూ రావడం ఈ సందర్భంగా గమనార్హం. ఫార్ములా వన్ కారు రేసు వ్యవహారం, ఫోన్ టాపింగ్ ఉదంతంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తుపై ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్టుగా ఉంది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం లడ్డూలా రేవంత్‌రెడ్డి చేతికి అందింది. అందివచ్చిన ఈ అవకాశాన్ని దొరకపుచ్చుకున్న ముఖ్యమంత్రి తనలోని రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శించారు. చాతుర్యం అని ఎందుకు అనవలసి వచ్చిందంటే, కాళేశ్వరం వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలతో మాత్రమే దర్యాప్తు జరిపిస్తారని బీఆర్ఎస్ ముఖ్యులు భావించారు. వారి అంచనాలకు భిన్నంగా కేసును సీబీఐకి అప్పగించడంతో వారు కంగుతిన్నారు. అందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచుగా విమర్శించే సీబీఐని ఎంచుకోవడం ద్వారా రేవంత్‌రెడ్డి పార్టీ అధిష్ఠానాన్ని కూడా ధిక్కరిస్తున్నారని విమర్శలు చేశారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి తదుపరి చర్యలు తీసుకుంటారని భావించి, దాని ఆధారంగా చర్యలు తీసుకోకుండా నిలువరించాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులు ఎలా ఉన్నా తన లక్ష్యం దెబ్బతినకూడదని భావించి... ఎన్‌డీఎస్‌ఏ వంటి సంస్థల నివేదికల ఆధారంగా సీబీఐ చేత విచారణ జరిపించాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ విషయంలో కూడా బీఆర్ఎస్ నేతల అంచనాలకు భిన్నంగా ఆయన వ్యవహరించారు. హైకోర్టు కూడా సీబీఐ విచారణను అడ్డుకోజాలమని ప్రకటించింది. దీంతో నీళ్లు ఇచ్చిన మహానేతపై నిప్పులు కురిపిస్తారా అంటూ కేసీఆర్ తన సొంత మీడియాలో కథనాలు వండి వార్చారు. రాష్ట్రాన్ని సాధించిన మనిషిపై సీబీఐ విచారణ జరిపించడం అన్యాయమని విమర్శలు చేశారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా మహా కుట్ర జరిగిందని, రేవంత్‌రెడ్డి-ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు-ప్రధాని నరేంద్ర మోదీ కలసి కుట్ర పన్నారని నిందించడం మొదలుపెట్టారు. ఇంకా నయం, చైనాలో ఇటీవల సమావేశమైన జిన్ పింగ్-పుతిన్-మోదీ కలసి కుట్ర చేశారని ఆరోపించడం లేదంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ప్రతిసారీ బాబు బూచీ...

తెలంగాణ ఏర్పడి పదకొండు సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ రాజకీయంగా ఇబ్బంది ఎదురైన ప్రతిసారీ చంద్రబాబును బూచిగా చూపించడం భారత రాష్ట్ర సమితికి అలవాటే. ఇప్పుడు కూడా కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరిగితే అందుకు చంద్రబాబు కారణమని నిందించడం మొదలు పెట్టారు. తెలంగాణ సెంటిమెంటు పూర్తిగా ఆవిరైతే కేసీఆర్‌కు అజెండా ఉండదు. కనుక రాజకీయ వ్యూహంలో భాగంగా చంద్రబాబును ముడిసరుకుగా వాడుకోవడాన్ని ఆక్షేపించాల్సింది లేదు. అయితే, సీబీఐ విచారణ పర్యవసానాలు తెలంగాణ రాజకీయాలపై ఎలా ఉండబోతున్నాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. మూడేళ్ల తర్వాత జరగబోయే సాధారణ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఉనికిలో ఉండకూడదని రేవంత్‌రెడ్డి బరాబర్ కోరుకుంటున్నారు. కాంగ్రెస్-బీజేపీ మధ్యనే ఎన్నికల పోరు కేంద్రీకృతం కావాలని, మూడో పార్టీ రంగంలో ఉండకూడదు అన్నది రేవంత్‌రెడ్డి అభిమతం. అదే సమయంలో బీజేపీ కూడా భారత రాష్ట్ర సమితి ఉనికిలో ఉండకూడదనే భావిస్తోంది. బీజేపీ అగ్రనేతలు ప్రాంతీయ పార్టీల మనుగడకు వ్యతిరేకమన్న అభిప్రాయం ఎప్పటి నుంచో ఉంది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో తన కుమార్తె కవిత తీహార్ జైల్లో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తానని కేసీఆర్ ప్రతిపాదనలు పంపారు. ఈ విషయాన్ని కొంత కాలం క్రితం కవిత కూడా ధ్రువీకరించారు. విలీనం కాకపోయినా పొత్తు పెట్టుకుందామని బీఆర్ఎస్ నేతలు ప్రతిపాదించగా, పొత్తుతో ఆ పార్టీకి ప్రాణం పోయడం ఇష్టం లేని బీజేపీ అగ్రనేతలు అందుకు కూడా తిరస్కరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ జుట్టును కేంద్ర ప్రభుత్వం చేతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించారు. వచ్చే ఎన్నికల నాటికి సీబీఐ విచారణ పూర్తవుతుందో లేదో తెలియదు. అయితే, కేసీఆర్ అండ్ కో పరిస్థితి దిన దిన గండం నూరేళ్ల ఆయుష్షుగా ఉంటుంది. కేసీఆర్‌ను దోషిగా నిర్ధారించి తదుపరి చర్యలు తీసుకుంటే బీఆర్ఎస్ అస్తిత్వం కోల్పోతుందని, రాజకీయంగా ఇది తమకు ప్రయోజనకరం అని భావిస్తే కేంద్ర ప్రభుత్వ చర్యలు ఆ దిశగానే ఉండవచ్చు. అంత దూరం వెళ్లడం ఇష్టం లేకపోతే బీఆర్ఎస్‌ను తమ పార్టీలో విలీనం చేయాలని బీజేపీ ప్రతిపాదించవచ్చు. లేదా పొత్తుపెట్టుకొని తాము పెద్దన్న పాత్ర పోషించవచ్చు. ప్రస్తుతం బీఆర్ఎస్ నిస్సహాయ స్థితిలో ఉందని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఒంటి కాలిపై లేచినట్టుగా కేంద్ర ప్రభుత్వంపై కాలు దువ్వలేరు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుత పరిస్థితి అందరికీ తెలిసిందే. లిక్కర్ కుంభకోణంలో అరెస్టయి జైలుకు వెళ్లక ముందు కేజ్రీవాల్ జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగారు. కాంగ్రెస్ పార్టీకి తానే ప్రత్యామ్నాయం అనేదాకా ఆయన ఆలోచనలు సాగాయి. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఆప్ ఉనికి లేకుండా పోయింది. ఇండియా కూటమి నేతలు కూడా కేజ్రీవాల్‌ను పట్టించుకోవడం లేదు. ఇకపైనా... భారతీయ జనతా పార్టీ విజయానికి హరియాణాలో సహకరించినట్టుగా మున్ముందు జరిగే ఎన్నికల్లో కూడా కేజ్రీవాల్ అదే పాత్ర పోషించవచ్చు. కళ్లెదురుగా కేజ్రీవాల్ అనుభవాన్ని చూస్తూ కూడా కేసీఆర్ అండ్ కో తల ఎగరేస్తారని భావించలేం. చంద్రబాబు-రేవంత్‌రెడ్డికి ముడిపెట్టి రాజకీయంగా ప్రయోజనం పొందాలనుకోవడం వేరు. కేంద్ర పెద్దలు మోదీ-షాలతో పెట్టుకుని మనుగడ సాగించడం వేరు. కేసీఆర్ మీదనే సీబీఐ విచారణ జరిపిస్తారా అని హైదరాబాద్‌లో కూర్చొని విమర్శలు చేసినా, గింజుకున్నా ప్రయోజనం ఉండదు. లిక్కర్ కేసులో అరెస్టయ్యే వరకు కేజ్రీవాల్ జాతీయ స్థాయిలో కేసీఆర్‌కంటే బలమైన నాయకుడు. పలు రాష్ట్రాల్లో ఆమ్ ఆద్మీ పార్టీని విస్తరించారు. ఆయన బాటలోనే కేసీఆర్ కూడా పలు రాష్ట్రాలలో బీఆర్ఎస్‌ను విస్తరించాలనుకున్నారు. చివరకు సొంత రాష్ట్రంలోనే చతికిలపడ్డారు. కేజ్రీవాల్‌కు కూడా ఇదే అనుభవం ఎదురైంది. పుట్టిల్లు ఢిల్లీలోనే ఆప్ తుడిచిపెట్టుకుపోయింది. కేజ్రీవాల్ ఉద్యోగం పోయింది. ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ... అంతర్గత సంభాషణల్లో మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి! ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీ జరిపిన దర్యాప్తు నివేదిక ఆధారంగా చంద్రబాబును జైల్లో పెట్టారు. దీంతో చంద్రబాబు పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడింది. కేజ్రీవాల్‌ను కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు అరెస్టు చేశాయి. చంద్రబాబు విషయంలో జరిగినట్టుగా కేజ్రీవాల్‌కు సానుభూతి లభించలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేస్తున్నప్పటికీ... ప్రజల్లో ఆయన విశ్వసనీయత సన్నగిల్లలేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేష్టల కారణంగా మోదీ ప్రతిష్ఠ జాతీయంగా, అంతర్జాతీయంగా మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ అండ్ కో కేంద్ర పెద్దలను ధిక్కరించజాలరు. ఒక్క మాటలో చెప్పాలంటే కేసీఆర్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు బీజేపీ పెద్దల చేతుల్లోనే ఉంది. ప్రస్తుతానికి వారి టర్ఫ్‌కు లోబడి నడుచుకోవాల్సిన పరిస్థితిలో కేసీఆర్ ఉన్నారు.

నెగ్గడం... తగ్గడం!

రాజకీయాల్లో ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో కూడా తెలియాలి. అది తెలుసుకున్నందువల్లే ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా 30 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు మధ్యలో కొన్నాళ్లు అధికారం కోల్పోయినా మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. చంద్రబాబును వివిధ సందర్భాలలో ఈసడించుకొన్న కేసీఆర్ ప్రస్తుత గడ్డు పరిస్థితుల్ని ఎలా అధిగమిస్తారో చూడాలి. చంద్రబాబును హైదరాబాద్ నుంచి తరిమేసిన ఘనుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ నేతలు గొప్పగా చెప్పుకొంటారు. ప్రతికూల పరిస్థితుల్లో వెనకడుగు వేయడం, తగ్గి ఉండటం తెలుసు గనుకనే చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రాగలిగారు. మూడేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో విజయం సాధించి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాగలరా? అంటే ప్రస్తుతం చెప్పలేని పరిస్థితి. నిజానికి ఆరు నెలల క్రితం భారత రాష్ట్ర సమితి పుంజుకుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం తమదే అని బీఆర్ఎస్ నేతలు బలంగా నమ్మారు. ఇప్పుడు అదే పరిస్థితి ఉందా అంటే చెప్పలేం. ఎందుకంటే, ఎన్నికల వైతరణిని కేసీఆర్ సునాయాసంగా దాటాలంటే మధ్యలో ఎన్నో గండాలను అధిగమించాల్సి ఉంటుంది. కాళేశ్వరం కేసులో విచారణ జరపబోతున్న సీబీఐ వచ్చే ఎన్నికల నాటికి ఆయనను నిర్దోషిగా ప్రకటించి వదిలేస్తే మాత్రం ప్రజల్లో సానుభూతి ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావొచ్చు. కేంద్ర పెద్దలు అంత ఉదారంగా వ్యవహరిస్తారా? అన్నది ప్రశ్నార్థకమే. కీలు ఎరిగి వాత పెట్టినట్టు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం అంశాన్ని తెర మీదకు తెచ్చారు. నిజానికి ఈ అంశం అటకెక్కినట్టే అని ఇప్పటి వరకు అందరూ భావించారు. ఏకంగా సీబీఐ విచారణను కోరతారని చాలా మంది ఊహించలేదు. ఈ నేపథ్యంలో సీబీఐ విచారణ ప్రారంభమవడంలో జాప్యం జరిగే కొద్దీ స్థానికంగా బీజేపీపై ఒత్తిడి పెరుగుతుంది. బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా రేవంత్‌రెడ్డి–చంద్రబాబు–మోదీ కలసి కుట్రపన్నారన్నది నిజమే అనుకుందాం. ఇలాంటి రాజకీయాలు కేసీఆర్‌కు కొత్త కాదు. 2019 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించడానికి జగన్మోహన్ రెడ్డితో కలసి కుట్ర చేశారు కదా! ప్రస్తుతం సాధారణ ఎన్నికలకు మూడేళ్లకు పైగా వ్యవధి ఉన్నందున సీబీఐ విచారణ ఎలా ఉండబోతుందన్నదే కీలకం. బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా బీజేపీ పెద్దలకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య అవగాహన నిజంగానే ఉంటే... ప్రస్తుత సంకటం నుంచి కేసీఆర్ తప్పించుకోలేరని చెప్పవచ్చు. కాంగ్రెస్, బీజేపీ ఆటలో కేసీఆర్ పావుగా మారతారని ఎవరైనా ఊహించగలరా? ప్రస్తుతానికి రాజకీయ ఎత్తుగడల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే పైచేయి అయింది. ఇకపై బీజేపీ, బీఆర్ఎస్‌లలో ఎవరిది పైచేయి కాబోతుందన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే. నిన్నటిదాకా బీఆర్ఎస్‌ను విమర్శించినా తెలంగాణ అస్తిత్వంపై దాడిచేసినట్టు ప్రచారం చేసినవాళ్లు, కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు లబ్ధి పొందినవాళ్లు ఎందుకనో ప్రస్తుతం మౌనంగా ఉన్నారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరపడమంటే తెలంగాణ అస్తిత్వంపై దాడి చేయడమేనని గుండ్రని బల్లల చుట్టూ కూర్చొని చర్చలు చేయడం లేదు కూడా!

**ప్రస్తుతం బీఆర్ఎస్ నిస్సహాయ స్థితిలో ఉందని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఒంటి కాలిపై లేచినట్టుగా కేంద్ర ప్రభుత్వంపై కాలు దువ్వలేరు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుత పరిస్థితి అందరికీ తెలిసిందే. లిక్కర్ కుంభకోణంలో అరెస్టయి జైలుకు వెళ్లక ముందు కేజ్రీవాల్ జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగారు. కాంగ్రెస్ పార్టీకి తానే ప్రత్యామ్నాయం అనేదాకా ఆయన ఆలోచనలు సాగాయి. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఆప్ ఉనికి లేకుండా పోయింది. ఇండియా కూటమి నేతలు కూడా కేజ్రీవాల్‌ను పట్టించుకోవడం లేదు. కళ్లెదురుగా కేజ్రీవాల్ అనుభవాన్ని చూస్తూ కూడా కేసీఆర్ అండ్ కో తల ఎగరేస్తారని భావించలేం. చంద్రబాబు–రేవంత్‌రెడ్డికి ముడిపెట్టి రాజకీయంగా ప్రయోజనం పొందాలనుకోవడం వేరు. కేంద్ర పెద్దలు మోదీ–షాలతో పెట్టుకుని మనుగడ సాగించడం వేరు.
కేసీఆర్ మీదనే సీబీఐ విచారణ జరిపిస్తారా అని హైదరాబాద్‌లో కూర్చొని విమర్శలు చేసినా, గింజుకున్నా ప్రయోజనం ఉండదు. లిక్కర్ కేసులో అరెస్టయ్యే వరకు కేజ్రీవాల్ జాతీయ స్థాయిలో కేసీఆర్‌కంటే బలమైన నాయకుడు. పలు రాష్ట్రాల్లో ఆమ్ ఆద్మీ పార్టీని విస్తరించారు. ఆయన బాటలోనే కేసీఆర్ కూడా పలు రాష్ట్రాలలో బీఆర్ఎస్‌ను విస్తరించాలనుకున్నారు. చివరకు సొంత రాష్ట్రంలోనే చతికిలపడ్డారు.**

ఇంటిపోరుతో ఉక్కిరి బిక్కిరి!

ఈ విషయం అలా ఉంచితే, ఇంటిపోరు కూడా కేసీఆర్‌ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇంటి గుట్టు లంకకు చేటు అంటారు. ఇప్పుడు కేసీఆర్ పరిస్థితి అలాగే ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిన మాట వాస్తవమేనని, కాకపోతే అప్పటి సాగునీటిశాఖ మంత్రి హరీశ్‌రావు మాత్రమే అవినీతికి పాల్పడ్డారని కేసీఆర్ కుమార్తె కవిత స్వయంగా ప్రకటించారు. అవినీతి జరగడం వాస్తవమైతే అది హరీశ్‌రావుకు మాత్రమే పరిమితం అంటే ప్రజలు నమ్ముతారా? ఒకప్పుడు బీఆర్ఎస్ పార్టీని ఇంటి పార్టీగా ప్రచారం చేసిన కవితకు ఇప్పుడు ఆ ఇంటి పార్టీలో చోటు లేకుండా పోయింది. ఇంటి పార్టీ ఆడపడుచుకు ఇప్పుడు పుట్టింట కూడా ప్రవేశం లేదని అంటున్నారు. ఇంతకూ కవిత తెగింపునకు కారణం ఏమిటో? ఏమి చూసుకొని ఆమె పార్టీతో సంబంధం తెంచుకోవడానికి సిద్ధపడ్డారన్నది ప్రస్తుతానికి మిస్టరీగానే ఉంది. కొద్ది మాసాల క్రితం ధిక్కార స్వరం వినిపించిన కవిత అప్పుడు తన సోదరుడు కల్వకుంట్ల తారక రామారావును టార్గెట్ చేసుకున్నట్టుగా మాట్లాడారు. కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ తనకు అండగా నిలవలేదని ఆరోపించారు. ఇప్పుడు సడన్‌గా ఆమె యూ టర్న్ తీసుకున్నారు. నాన్నను, పార్టీని రామన్నే కాపాడుకోవాలని కోరారు. కేవలం హరీశ్‌రావు, సంతోష్‌రావులను మాత్రమే ఆమె టార్గెట్ చేసుకున్నారు. మొదట్లో ఆమె హరీశ్‌రావు జోలికి వెళ్లలేదు. ఇప్పుడు కవిత అనే బాణం దిశ మార్చుకుంది. మొదట్లో కేటీఆర్‌కు గుచ్చుకుంటే ఇప్పుడు దిశ మార్చుకొని హరీశ్‌రావుకు గుచ్చుకుంది ఏమిటా అని రాజకీయ పరిశీలకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. కేసీఆర్ ఇంటిలో మొదలైన పోరుకు కారణం దోచుకున్నది పంచుకోవడంలో వచ్చిన తేడాల వల్లనే అనే ప్రచారం జరగడంతో కవిత తన దిశను మార్చుకున్నారా? లేక, ఆమె కేసీఆర్ వదిలిన బాణమేనా? అన్న సందేహాలు ఇప్పుడు కలుగుతున్నాయి. నిజానికి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కూడా తనకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని కవిత మదనపడేవారు. కన్న కూతురైనప్పటికీ తనకంటే వరుసకు సోదరుడైన సంతోష్‌రావుకు పార్టీలో, ప్రభుత్వంలో ప్రాబల్యం పెరగడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారు. అదే సమయంలో, కేటీఆర్ తదుపరి ముఖ్యమంత్రి అని ప్రచారం జరిగింది. అదే జరిగితే పార్టీలో తన పరిస్థితి మరింత దిగజారుతుందని తెలిసి కూడా అప్పట్లో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి ఆమెది. ఇంతలో ఎన్నికలు రావడం, నిజామాబాద్ నుంచి పోటీ చేయవద్దని కేసీఆర్ ఆదేశించడంతో ఆమెకు పుండు మీద కారం రాసినట్టయింది. పార్టీ అధికారం కోల్పోయినా కేటీఆర్, హరీశ్‌రావులు ఎమ్మెల్యేలు అయ్యారు. సంతోష్‌రావు ప్రాధాన్యత తగ్గలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే తాను రాజకీయంగా కనుమరుగు కావడం తథ్యమన్న ఆందోళన కవితలో ఏర్పడింది. ఎన్నికలకు ముందు నుంచి అసంతృప్తితో రగిలిపోతున్న ఆమె ఇప్పుడు బయట పడ్డారు. చివరకు పార్టీకి కూడా దూరమయ్యారు.

కేసీఆర్ ఇంటిలో మొదలైన పోరుకు కారణం దోచుకున్నది పంచుకోవడంలో వచ్చిన తేడాల వల్లనే అనే ప్రచారం జరగడంతో కవిత తన దిశను మార్చుకున్నారా? లేక, ఆమె కేసీఆర్ వదిలిన బాణమేనా? అన్న సందేహాలు ఇప్పుడు కలుగుతున్నాయి.

రాజకీయ వారసులెవరంటే...

ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా మన సమాజంలో వారసులు అంటే కుమారులే అన్న భావన ఉంది. రాజకీయాల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. మగ పిల్లలు లేని సందర్భంలోనే ఆడ పిల్లలకు రాజకీయ వారసత్వం లభిస్తోంది. కాంగ్రెస్ నాయకత్వం కూడా రాహుల్‌గాంధీకే దక్కడం గమనార్హం. ప్రియాంకగాంధీకి అర్హత లేదా? అంటే ఏం చెబుతాం? తెలుగు రాష్ట్రాలు మాత్రం ఇందుకు మినహాయింపు కావు కదా! ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డిని రాజశేఖరరెడ్డి వారసుడిగా ప్రజలు గుర్తిస్తున్నారు. అన్నతో విభేదించి రాజకీయ అరంగేట్రం చేసిన షర్మిల ప్రస్తుతానికి సక్సెస్ కాలేదు. తెలంగాణలో ఇందుకు భిన్నంగా జరుగుతుందని భావించలేం. ఇంకా చెప్పాలంటే కేసీఆర్ కుమారుడు, కుమార్తెతో పోలిస్తే మేనల్లుడు హరీశ్‌రావుకు అటు ప్రజల్లో, ఇటు పార్టీ నాయకుల్లో ఆదరణ ఎక్కువ. కేసీఆర్ ఉన్నంత వరకు పరిస్థితి ఒక రకంగా ఉంటుంది. లేనప్పుడు మరో విధంగా ఉంటుంది. కేసీఆర్ వారసత్వం అయితే కేటీఆర్‌కు లేదంటే హరీశ్‌కు దక్కుతుంది. కానీ, కవితకు దక్కే అవకాశం లేదని చెప్పవచ్చు. బహుశా ఈ తత్వం ఆమెకు ఆలస్యంగా బోధపడినట్టు ఉంది. అయితే... అన్న లేదంటే తనకు వారసత్వం దక్కాలిగానీ హరీశ్ పోటీలో ఉండకూడదన్నది ఆమె ఆలోచన కావొచ్చు. అందుకే తాజాగా ఆమె హరీశ్‌ను టార్గెట్ చేసుకున్నట్టుగా ఒక అభిప్రాయం. కేసీఆర్ వారసత్వం ఎవరికి? అని ప్రస్తుత పరిస్థితుల్లో కొట్టుకోవడం ఆశ్చర్యంగా ఉంది. బీఆర్ఎస్ మనుగడపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి. కేంద్ర ప్రభుత్వం సీబీఐకి పూర్తి స్వేచ్ఛ ఇస్తే కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు కూడా బోనులో చిక్కుకుంటారు. అదే జరిగితే బీఆర్ఎస్ అస్తిత్వమే ప్రశ్నార్థకం అవుతుంది. మనిషి తాను నిస్సహాయుడిని అని భావించినప్పుడే దేవుడి వైపు చూస్తాడు. ఇప్పుడు కేసీఆర్ పరిస్థితి కూడా అదే కావొచ్చు. అందుకే ఆయన ఫాం హౌజ్‌లో యాగాలు చేస్తున్నారు. 2023 ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగం చేసినా అధికారం కోల్పోయారు. యాగాలు చేస్తే అధికారం సిద్ధిస్తుందన్నది నిజమైతే ప్రతి ఒక్కరూ చేయకపోతారా? 2018లో రాజశ్యామల యాగం అధికారం తెచ్చిందనుకుంటే, 2023లో ఎందుకు తెచ్చిపెట్టలేదన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. అయినా.. కర్మఫలం ఒకటి ఉంటుంది. అది మనల్ని వదలదు. కర్మఫలాన్ని అనుభవించాల్సిందే. యజ్ఞాలను, యాగాలను నమ్ముకొనే కంటే తల రాతను నమ్ముకోవడం మంచిది. మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాసిపెట్టి ఉంటే అవుతారు. లేని పక్షంలో ఎన్ని యాగాలు చేసినా నిష్ఫలమే!

మధుర విషాద కాళింది.. భానుమతి!



వివిధ కళల సమాహారంతో పండిత, పామరులను అలరిస్తున్న ఏకైక మాధ్యమం చలనచిత్రం. తెలుగులో నిర్మించబడిన ఉదాత్త, కళాత్మక, కుటుంబ చిత్రాల కారణంగా 1950–1981 ప్రాంతాన్ని తెలుగు చలనచిత్ర 'స్వర్ణయుగం'గా అభివర్ణిస్తున్నారు. ఎంతోమంది మహానటులు, నటీమణులు తెలుగు ప్రేక్షకుల మనస్సులపై గాఢమైన ముద్రనువేసి చిరస్మరణీయుల య్యారు. వారిలో అభినేత్రి, మధుర గాయని, కథా రచయిత్రి, నిర్మాత, దర్శకురాలు, స్టూడియో అధినేత భానుమతీ రామకృష్ణ ఒకరు.

భానుమతి 1925 సెప్టెంబర్ 7న ఒంగోలు సమీపంలోని దొడ్డవరం గ్రామంలో బొమ్మరాజు వెంకటసుబ్బయ్య, సరస్వతమ్మ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులిద్దరికీ శాస్త్రీయ సంగీతంలో ప్రవేశం ఉండడంతో సహజంగానే భానుమతికి సంగీతం పట్ల అభిలాష కలిగింది. పద్నాలుగేళ్ల వయసులోనే సి. పుల్లయ్య దర్శకత్వంలో 'వరవిక్రయం'లో కాళింది పాత్రను పోషించడమే కాక, ఆ సినిమాలో పాటలు పాడి ప్రేక్షకులను మెప్పించారు. 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ భానుమతిని ప్రశంసించి 'మధుర విషాద కాళింది' అని తన పుస్తకంపై రాసి ఆమెకు బహూకరించారు. తదుపరి సంవత్సరాల్లో విశ్వనాథ కవిరాజు అనే హాస్య రచయిత భానుమతికి కథలు ఎలా రాయాలో సూచనలిచ్చారు. 1943లో తన నాలుగో చిత్రం 'కృష్ణప్రేమ'లో నటిస్తుండగా అప్పటి అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎస్ రామకృష్ణను భానుమతి ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహానంతరం సినిమా రంగానికి దూరంగా ఉండాలనుకున్నారామె. కానీ, నాటి ప్రసిద్ధ 'వాహినీ' డైరెక్టర్ బి.యన్.రెడ్డి, నటుడు లింగమూర్తి ఆమెను ఒప్పించి 'స్వర్గసీమ' (1946)లో నటింపజేశారు. ఆ చిత్రంలో 'ఓహో పావురమా' పాటతో తెలుగు, తమిళ ప్రేక్షకులకు భానుమతి మరింతగా దగ్గరయ్యారు. అగ్రనటిగా, గాయనిగా గుర్తింపు పొందారు.

భరణి సంస్థ పతాకంపై 'లైలా మజ్ను, విప్రనారాయణ, బాటసారి' మొదలైన చిత్రాలను నిర్మించారు భానుమతి. ఈ మూడు చిత్రాలూ తన నట జీవితంలో ఆణిముత్యాలని చెబుతూ నిర్మాత భానుమతిని అక్కినేని ప్రశంసించారు. బి.యన్.రెడ్డి నిర్మాణం, దర్శకత్వంలో వచ్చిన సినిమా 'మల్లీశ్వరి'. ఈ సినిమాలో భానుమతి తన విలక్షణ నటనతో పాటు, అపూర్వ గానంతోనూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'సెల్యులాయిడ్‌పై దృశ్య కావ్యం' అంటూ సినీ పండితులు ఈ చిత్రాన్ని ప్రశంసించారు. విప్రనారాయణ చిత్రంతో భానుమతికి తెలుగు సినీ లోకంలో అగ్రపీఠం లభించింది. తాను నిర్మించిన కొన్ని చిత్రాల్లో తండ్రి కోరికపై 'నగుమోము గనలేని', 'శరణం నీ దివ్యచరణం', 'శరణం భవ కరుణామయి', 'ఏ తావునరా నిలకడ నీకు', 'శాంతము లేక సౌఖ్యము లేదు', 'ప్రక్కల నిలబడి' వంటి శాస్త్రీయ సంగీత పాటలను ఆలపించారు. ఆరోగ్యకర హాస్యం తొణికిసలాడేలా 'అత్తగారి కథలు'ను భానుమతి రచించారు. ఆ కథలు ఇలా సాగుతాయి.. అత్తగారు సత్తెకాలం మనిషి. అన్నీ తనకే తెలుసుననుకునే అమాయకురాలు. ఆవకాయ పచ్చడి ఎలా పెడతారో ఆ అత్తగారికి తెలియదు. తోటలో పనిచేసే పాలవాడికి ఇద్దరు భార్యలు. 'మీరిద్దరూ సవతులైనా పోట్లాడుకోరేమే' అంటుంది అత్తగారు. బారిష్టర్ పార్వతీశంలాగా భానుమతి 'అత్తగారు' ఒక విశిష్టమైన పాత్ర. ఈ కథల గురించి ప్రముఖ రచయిత 'భరాగో' (భమిడిపాటి రామగోపాలం) విలువైన వ్యాసాలతో ఆమె స్మృతి సంచికను 2006లో ప్రచురించారు. శారదా అశోకవర్ధన్, ఇంద్రగంటి జానకీబాల వంటి ప్రముఖ రచయిత్రులు భానుమతి జీవిత విశేషాల గురించి పుస్తకాలు రాశారు.

భానుమతి మాట పెళుసు, కానీ మనసు నవనీతం. ఈ పురుషాధిక్య సమాజంలో స్త్రీ శక్తి స్వరూపిణి. ఆత్మవిశ్వాసంతో మహిళలు ఉన్నతంగా ఎదగగలరని ఆమె నిరూపించారు. 'నాకు లభించిన సంగీత సాహిత్యాలు దేవీ ప్రసాదాలు. నిజాన్ని నిష్ఠురంగా మాట్లాడే నన్ను కొంతమంది గర్విష్ఠిగా భావిస్తే అందుకు నేను బాధ్యురాలిని కాను' అనేవారు. సినీరంగంలో ఎన్నో విజయాలు సాధించినా, తాను సగటు మధ్యతరగతి గృహిణిగానే ఉండడానికి ఇష్టపడేవారు. ప్రతిరోజూ దేవీపూజతో, ఆధ్యాత్మిక చింతనతో సంగీత సాహిత్య గోష్ఠులతో గడిపేవారు. సినీ రంగంలో ఎవరితోనూ అతిగా సాన్నిహిత్యం పెంచుకునేవారు కాదు. తనకు తాను గిరి గీసుకుని 'తామరాకు మీద నీటి బొట్టు' (ఈ పేరుతో ఆమె నిర్మించిన టీవీ సీరియల్ 2001లో ప్రసారం అయింది)లా భానుమతి జీవించారు. 'అత్తగారి కథలు'ను కూడా తాను అత్తగా, గీతాంజలి కోడలుగా సీరియల్ నిర్మించారామె.


భానుమతిని అనేక అవార్డులు, రివార్డులు వరించాయి. 'పద్మశ్రీ' (1966), 'పద్మభూషణ్' (2000) వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులతో పాటు 'అత్తగారి కథలు'కు 'ఆంధ్ర సాహిత్య అకాడమి' పురస్కారం, ఆవిడ ఆత్మకథ 'నాలో నేను'కు కేంద్ర ప్రభుత్వం పురస్కారం లభించాయి. ఇవేగాక తమిళనాడు ప్రభుత్వం నుంచి 'కలైమామణి', అన్నాదురై చేతుల మీదుగా 'నటనకు వ్యాకరణం' అనే బిరుదు పొందారు. వీటితో పాటు రాజాలక్ష్మి అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డు, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం (2004) ఆమెను వరించాయి. ఎం.జి.ఆర్. ఆమెను కొంతకాలం తమిళనాడు ప్రభుత్వ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు.

పలు సందర్భాల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్, పీవీ రాజమన్నార్, బెజవాడ గోపాలరెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, ఖాసా సుబ్బారావు, మాలతీచందూర్ దంపతులు, వాసిరెడ్డి సీతాదేవి వంటి ప్రముఖులు భానుమతి విలక్షణతను, పాండిత్యాన్ని ప్రశంసించారు. శివాజీ గణేశన్, శోభన్‌బాబు, జానకి, కృష్ణకుమారి, మనోరమ వంటి తారలు ఆమెను ఎంతగానో అభిమానించేవారు. తెలుగు సినీ ప్రపంచంలో ఒక విశిష్ట వ్యక్తిగా జీవించిన భానుమతి మధుమేహం సంబంధిత ఆరోగ్య సమస్యలతో 2005 డిసెంబర్ 24న కన్నుమూశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీఆర్ వంటి వారిని తెలుగు ప్రజలు ఎలా మరువలేరో, అలాగే భానుమతి అభినయ కౌశలాన్ని, గాన మాధుర్యాన్ని, బహుముఖ ప్రజ్ఞనూ చిరకాలం జ్ఞాపకం చేసుకుంటారు.

■ డా. పి.దక్షిణామూర్తి


(నేడు భానుమతి శతజయంతి)

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA

ఆదివారం 7 సెప్టెంబరు 2025



వేతనాలు రాక.. పూట గడవక..

అవస్థల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

- మోడల్ స్కూల్లో ఏడు నెలలుగా రాని వేతనాలు
- పంచాయతీరాజ్‌లో 5 నెలలుగా పెండింగ్
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెల తరబడి ఎదురుచూపులు
- అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఇదే పరిస్థితి
- బడ్జెట్ కేటాయింపుల్లో సర్కారు నిర్లక్ష్యం
- నిధులు వచ్చినా జీతాలు చెల్లించని ఏజెన్సీలు
- ఏజెన్సీలను రెన్యూవల్ చేయడంలో కలెక్టర్ల జాప్యం
- ఉమ్మడి జిల్లాలో 24వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

హనుమకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ (పొరుగు సేవలు) ఉద్యోగులు ప్రతీ నెల వేతనాల కోసం వేయి కళ్లతో ఎదురుచూడాల్సి వస్తోంది. ఏ నెల కూడా వారికి సక్రమంగా జీతాలు అందడం లేదు. ఏడెనిమిది నెలలైనా వేతనలు రాక నానా అవస్థలు పడుతున్నారు. ఏడాదైనా వేతనాలు రాని సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 24వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు.

ఆదర్శ పాఠశాలల్లో..

ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఒక్కో పాఠశాలలో నలుగురు పొరుగు సేవల సిబ్బంది పని చేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్, ఫిజికల్ డైరెక్టర్, అటెండర్, వాచ్‌మెన్ వీరిలో ఉన్నారు. వీరికి ఇచ్చే వేతనమే తక్కువ. అది కూడా నెలనెలా అందడం లేదు. ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో నూతన ఏజెన్సీకి అప్పగించడమో, నిధుల కొరతతో ఒకటీ రెండు నెలలు ఆలస్యం కావడం సహజమే. ఈ ఏడాది ఏడు నెలలైనా ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమ కాలేదు. ఏడు నెలలుగా జీతాలు రాక ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. విధులు బహిష్కరిస్తామంటూ ఇప్పటికే పాఠశాలల నిర్వాహకులకు వినతి పత్రాలు అందజేసి గత సోమవారం గైర్హాజరయ్యారు. ఒక్కో పాఠశాలలో 700 మంది విద్యార్థులు ఉండగా వీరి సమ్మెతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. పాఠశాల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడనున్నది. వీరికి వేతనాలు చెల్లించడంలో జాప్యానికి కారణం ఏజెన్సీలను సకాలంలో రెన్యూవల్ చేయకపోవడమేనని తెలుస్తోంది.

ఎస్సీ గురుకులాల్లో..

ఎస్సీ సంక్షేమ గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బంది పరిస్థితి ఇలాగే ఉంది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ సంక్షేమ గురుకులాల్లో పొరుగు సేవల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. ప్రస్తుతం నాలుగు నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయి. గెస్ట్ ఫ్యాకల్టీకి మూడు నెలల నుంచి వేతనాలు రాలేదు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి మూడు నాలుగుల నెలలుగా వేతనాలు లేవు. ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. అయిదారు నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉంటే ప్రతీసారి అందులో ఒకటీ రెండు నెలలయే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. వేతనాల అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆస్పత్రుల ఎదుట నిరసన ప్రదర్శనలు జరిపిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

సాట్‌లోనూ..

సొసైటీ ఫర్ ఆడిట్ అకౌంటబులిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ (సాట్)లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వీరికి నాలుగైదు నెలలుగా జీతాలు అందడం లేదు. ప్రతీసారి ఇదే తంతు అని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా పరిస్థితిలో మార్పురాలేదని వాపోతున్నారు.

పంచాయతీరాజ్‌లో..

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు అందడం లేదు. గ్రామ పంచాయతీల్లో ఓపీఎస్ (అవుట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రెటరీలు)గా పని చేస్తున్న వారికి అయిదారు నెలలుగా వేతనాలు అందడం లేదు. వివిధ జిల్లాల్లో పంచాయతీ కార్యదర్శులు పోస్టులు ఖాళీగా ఉన్నచోట్ల 2020-21 నుంచి ఓపీఎస్‌లను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నెలకు రూ.18వేల జీతంతో నియమించారు. ఏ జిల్లాకు ఆ జిల్లా ఓ ఏజెన్సీద్వారా వీరి నియామకాలు చేపట్టారు. అయితే కొన్నిచోట్ల ప్రతీనెలా వేతనాలు చెల్లించే పరిస్థితులు ఉండడం లేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు 300 మంది ఓపీఎస్‌లు ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అది అమలుకు నోచుకోవడం లేదు. ఏ ఏడాదికి ఆ ఏడాది ఓపీఎస్‌ల కాంట్రాక్టు రెన్యూవల్ చేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

రెగ్యులర్ ఉద్యోగుల రాకతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా (మిగతా 6వ పేజీలో)



చిన్న వడ్డెపల్లి చెరువు వద్ద నిమజ్జనం కోసం శనివారం నిరీక్షిస్తున్న వినాయక విగ్రహాలు

ప్రశాంతంగా నిమజ్జనోత్సవం

- రెండో రోజూ కొనసాగిన వేడుక
- తరలివచ్చిన భారీ విగ్రహాలు
- చిన్నవడ్డెపల్లి, ఉర్సు, బెస్తం చెరువుల వద్ద బయటపడిన అధికారుల వైఫల్యం
- మొదటి రోజు అర్ధరాత్రి వరకే కనిపించిన యంత్రాంగం
- మొరాయించిన క్రేన్లు.. లోతు లేక నీటమునగని విగ్రహాలు

7

గణపతి ఊరేగింపులో రౌడీషీటర్ వీరంగం

- వాహనానికి అడ్డంగా కారు నిలిపి దౌర్జన్యం
- ప్రశ్నించిన ఉత్సవ కమిటీ సభ్యులపై విచక్షణ రహితంగా దాడి
- కరీమాబాద్‌లో అర్ధరాత్రి ఘటన.. స్థానికుల ఆందోళన
- గతంలోనూ పలు దాడుల్లో నిందితుడు
- రౌడీయిజాన్ని ఉపేక్షిస్తున్న పోలీసు యంత్రాంగం



బాధితుడు సతీష్



గణపతి శోభాయాత్రలో ఉత్సవ కమిటీ నిర్వాహకులతో గొడవపడుతున్న రౌడీషీటర్ సురేశ్ (బ్లూ షర్టులో ఉన్న వ్యక్తి)

వరంగల్ క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ సబ్ డివిజన్‌లోని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యాయత్నంతో పాటు పలు దాడుల్లో నిందితుడిగా ఉన్న తీవ్ర నేరస్వభావం కలిగిన వంచనగిరి సురేశ్ అలియాస్ కోతి సురేశ్ శుక్రవారం అర్ధరాత్రి హల్‌చల్ చేసి పలువురు యువకులను గాయపరిచాడు. విశ్వసనీయమైన సమాచారం మేరకు.. కరీమాబాద్‌లోని రామస్వామి గుడి వీధిలో శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో శ్రీ నవయువ చైతన్య గజానన మండలి ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఊరేగింపు చేస్తున్నారు. అదే సమయంలో ఐదుగురు యువకులతో (మిగతా 6వ పేజీలో)

దేవాలయాల అభివృద్ధికి కృషి

- మొదటి విడతలో రూ.5 కోట్లతో పనులు
- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- 'తూర్పు'లో ఆరు ఆలయాల్లో శంకుస్థాపనలు



కాశీ విశ్వేశ్వరాలయంలో శంకుస్థాపన నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కలెక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణితో కలిసి మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. రూ.5 కోట్లతో ఆరు దేవాలయాల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ముందుగా దేశాయిపేటలోని రంగనాథస్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కోటి దీపాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మట్టెవాడలోని భోగేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులకు రూ.50 లక్షలతో శంకుస్థాపన చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీకాశీ విశ్వేశ్వర దేవాలయం (ఆకారపు వారి గుడి) షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు రూ.50లక్షలతో శంకస్థాపన చేశారు.

గోవిందరాజుల గుట్ట ప్రాంతంలోని ఆంజనేయస్వామి ఆలయంలో రూ.50 లక్షలతో చేపట్టిన పనులను ప్రారంభించారు. కాశిబుగ్గలోని శ్రీకాశీ విశ్వేశ్వర, రంగనాథ స్వామి దేవాలయాల అభివృద్ధి కోసం రూ.2 కోట్ల 50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అబ్బనికుంటలోని శ్రీమహేశ్వరి అమ్మ వారి దేవాలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. మొదటి విడతలో భాగంగా ఆరు దేవాలయాలకు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కొన్ని దేవాలయాలు ఆర్కియాలజీ డిపార్టుమెంట్‌తో ముడిపడి ఉన్నందున కేంద్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, త్వరలో అన్నిఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కేంద్రం నుంచి కూడా నిధుల విడుదలకు కృషి చేస్తామని, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పురాతన దేవాలయాలను అభివృద్ధి చేస్తామని అన్నారు.

కాశిబుగ్గ శివాలయంలో అభిషేకం..

కాశిబుగ్గలోని శివాలయంలో కలెక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి మంత్రి కొండా సురేఖ శివుడికి అభిషేకం నిర్వహించారు. ఆలయంలో పురాతన బావిని పరిశీలించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ సత్యశారద, మేయర్ సుధారాణి, ఏఎస్పీ శుభం, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, సహాయ కమిషనర్ సునిత, కార్పొరేటర్లు తేజస్వీ శిరీష్, కావేటి కవిత, చింతాకుల అనిల్‌కుమార్, ఓని స్వర్ణ లత భాస్కర్, సోమిశెట్టి ప్రవీణ్‌కుమార్, నాయకులు గోపాలరాజ్, నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్, డీఈలు, ఏఈలు, దేవాదాయ శాఖ ఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల ముసాయిదా జాబితా రెడీ

- మండలాల వారీగా విడుదల చేసిన అధికారులు
- హనుమకొండ జిల్లాలో మొత్తం ఓటర్లు 3,70,871
- పురుషులు 1,80,666, మహిళలు 1,90,201, ఇతరులు 4

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో హనుమకొండ జిల్లాలో మండలాల వారిగా ఓటర్ల ముసాయిదా జాబితాను జిల్లా పరిషత్ అధికారులు విడుదల చేశారు. హనుమకొండ జిల్లాలో మొత్తం ఓటర్లు3,70,891 ఉండగా, పురుషులు 1,80,666, మహిళలు 1,90,201, ఇతరులు నలుగురు ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు. మండలాల వారిగా.. ఆత్మకూరు మండలంలో ఓటర్లు 28,416, భీమదేవరపల్లి మండలంలో 41,898, దామెర మండలంలో 21,883, ధర్మసాగర్ మండలంలో 38,413, ఎల్కతుర్తి మండలంలో 32,491, హసన్‌పర్తి మండలంలో 23,730, ఐనవోలు మండలంలో 34,489, కమలాపూర్ మండలంలో 56,345 (అత్యధిక ఓటర్లు), నడికూడ మండలంలో 27,485, పరకాల మండలంలో 15,102 (తక్కువ ఓటర్లు), శాయంపేట మండలంలో 34,038, వేలేరు మండలంలో 16,581 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం మండలాలు 12కాగా, ఎంపీటీసీ స్థానాలు 129, మొత్తం పోలింగ్ స్టేషన్లు 631 ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా, మొత్తం ఓటర్లలో 1,799 ఓటర్లు తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో కొత్తగా ఓటరు నమోదు అవకాశం ఇస్తే జిల్లాలోని కొత్తగా ఎవరైనా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

10న తుది జాబితా విడుదల

హనుమకొండ జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం ఓటర్ల తుది జాబితా, పోలింగ్‌స్టేషన్ల జాబితాను ఈ నెల 10న విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం శనివారం తెలిపింది. పోలింగ్ స్టేషన్ల ప్రాథమిక జాబితా శనివారం విడుదల చేయగా అన్ని రాజకీయ పార్టీలతో జిల్లా, మండల స్థాయిలో 8న సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 9న అభ్యంతరాలను పరిష్కరించి తుది ఓటర్ల జాబితా 10న విడుదల చేయనున్నట్లు తెలిపారు.

నేడు చంద్రగ్రహణం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాల మూసివేత

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భాద్రపద శుక్ల పౌర్ణమి ఆదివారం రోజున రాహుగ్రస్థ సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించనుంది. ఇది మన దేశంతోపాటు మరో 14 దేశాల్లో కనిపిస్తుంది. గ్రహణం ఆదివారం రాత్రి 9.56 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి 1.26 గంటలకు ముగుస్తుంది. మొత్తం గ్రహణ కాలం 3.30 గంటలు. ఈ గ్రహణం శతబిశ పూర్వాభద్ర నక్షత్రంలో సంభవిస్తున్నందున శతబిశ పూర్వ భాద్ర నక్షత్ర జాతకులు, కుంభరాశి వారు ఈ గ్రహణం చూడరాదని పండితులు తెలిపారు. వృద్ధులు, పిల్లలు మినహా మిగతావారు ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల లోపు భోజనాలు చేయాలని, గ్రహణం సమయంలో ఎలాంటి ఆహారం, ద్రవ పదార్థాలు తీసుకోకూడదని పండితులు తెలిపారు. గ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు భద్రకాళి ఆలయం మూసివేస్తామని, తిరిగి సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయం శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం 7 గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతిస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పద్ధతి కొనసాగుతుందని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి పట్టాభిరామారావు

తల్లిదండ్రులను విస్మరిస్తే కఠిన చర్యలు

- వృద్ధాప్యంలో వారి బాధ్యత సంతానానిదే..
- జిల్లా జడ్జి కె.పట్టాభిరామారావు
- జడ్పీ ఆవరణలో ఉచిత లీగల్ ఎయిడ్ సర్వీస్ క్లినిక్ ప్రారంభం

బాలసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ హనుమకొండ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డేకేర్ సెంటర్‌లో ఉచిత లీగల్ ఎయిడ్ సర్వీస్ క్లినిక్‌ను జిల్లా జడ్జి పట్టాభిమారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టాభిరామారావు మాట్లాడుతూ.. వయోవృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ఇబ్బందులు ఎదురైనప్పుడు వారికి ఉచిత సలహాలు, లాయర్‌ను పెట్టుకోలేని స్థితిలో ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యలు వచ్చినప్పుడు వారు ట్రిబ్యునల్ బెంచ్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. తల్లిదండ్రుల బాధ్యత కచ్చితంగా పిల్లలదేనని, బాధ్యతను విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ అనితారెడ్డి మాట్లాడుతూ.. వయోవృద్ధుల చట్టం, లీగల్ ఎయిడ్ క్లినిక్ ట్రిబ్యునల్ బెంచ్ పట్ల సరైన అవగాహన లేదని, గ్రామస్థాయి నుంచి నగరస్థాయి సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పించాలన్నారు. లీగల్ సెల్ అథారిటీ జడ్జి క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ.. అవసరార్థులకు ఉచిత న్యాయ సదుపాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, హనుమకొండ జిల్లా జడ్జి, జూనియర్ జడ్జిలు తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టును చూపుతున్న భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు

సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని..

- కిడ్నాప్ చేసి యువకుడి దారుణ హత్య
- ఆరుగురు నిందితుల అరెస్టు
- భూపాలపల్లిలో బాసిత్ హత్య కేసులో వీడిన మిస్టరీ

6

వడ్డెపల్లి చెరువుకు కొత్త అందాలు

- పూడికతీతకు సిద్ధమవుతున్న ప్రణాళిక
- భద్రకాళి చెరువు తరహాలో అభివృద్ధి
- త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- రూ.30 కోట్ల నిధుల కోసం ప్రయత్నాలు
- ఇప్పటికే పూర్తికావస్తున్న బండ్ సుందరీకరణ పనులు



వడ్డెపల్లి చెరువు

హనుమకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు పూడికతీత తరహాలోనే నగరం నడిబొడ్డున ఉన్న వడ్డెపల్లి చెరువులో కూడా పూడికతీత పనులు త్వరలోనే చేపట్టనున్నారు. ఈ మేరకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు తెలుస్తోంది. కుడా నగరాభివృద్ధికి చేపడుతున్న పనుల పరంపరలో వడ్డెపల్లి చెరువు అభివృద్ధిని కూడా చేర్చినట్టు తెలుస్తోంది. తన నియోజకవర్గ పరిధిలో ఉన్న వడ్డెపల్లి చెరువును అభివృద్ధి చేసే విషయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా ఆసక్తితో ఉన్నారు. ఇందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి ఇప్పించేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు.

బండ్ అభివృద్ధితో పాటు..

భద్రకాళి బండ్‌ను అభివృద్ధి చేసినట్టే ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన వడ్డెపల్లిచెరువు బండ్‌ను రూ.17 కోట్ల వ్యయంతో సుందరీకరిస్తున్నారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. 60 శాతం పనులు పూర్తయ్యాయి. గత బీఆర్ఎస్ హయాంలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అయిదేళ్లుగా ఈ పనులు సాగుతూనే ఉన్నాయి. అయితే చెరువు బండ్ సుందరీకరణే లక్ష్యంగా పనులు (మిగతా 6వ పేజీలో)

గణపతి ఊరేగింపులో
రౌడీషీటర్ వీరంగం

(5వ పేజీ తరువాయి)

కలిసి కారులో వచ్చిన రౌడీషీటర్ సురేష్.. ఊరేగింపు వాహనం ముందుకు వెళ్లనీయకుండా కారు అడ్డుగా పెట్టాడు. దీంతో పక్కకు జరగాలని ఉత్సవ కమిటీ సభ్యుడైన తోట సతీష్ అడగడంతో కారులో ఉన్న సురేష్ అనుచరుడు సతీష్‌ను దూషిస్తూ ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలోనే కారులో నుంచి దిగిన సురేశ్.. తీవ్ర పదజాలంతో దూషిస్తూ ఇటుకపెల్లతో సతీష్ తలపై బలంగా మూడు సార్లు బాదాడు. దీంతో బాధితుడు కిందపడిపోయాడు. ఇదే సమయంలో కారులో ఉన్న మిగతా యువకులు, రౌడీషీటర్ కలిసి ఉత్సవ కమిటీ సభ్యులైన మహేశ్, నరేశ్‌లను పిడిగుద్దులు గుద్దారు. అర్ధగంట సేపు చొక్కాలు విప్పి గట్టిగా అరుస్తూ నానా హంగామాచేసి అక్కడనుంచి వెళ్లిపోయారు. కాగా, తీవ్ర రక్తస్రావంతో ఉన్న సతీష్‌తో పాటు గాయాలపాలైన మహేశ్, నరేశ్‌లను మిగతా ఉత్సవ కమిటీ సభ్యులు తీసుకొని ఫిర్యాదు చేసేందుకు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అధికారులు ఎవరూ లేరు. ముందుగా ఆస్పత్రికి తీసుకెళ్లండని విధుల్లో ఉన్న కానిస్టేబుల్ చెప్పడంతో ఎంజీఎంకు వెళ్లారు. శనివారం ఆస్పత్రి నుంచి బాధిత యువకులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా సీఐ రాలేదని పంపించినట్లుగా సమాచారం. కాగా, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బాధితుల దగ్గరికి రౌడీషీటర్ సురేష్.. తన మనుషులను పంపించి రాజీకి రావాలని బెదిరింపులకు గురిచేస్తున్నట్లుగా సమాచారం.

రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంటుందని చెప్పే పోలీసులు.. ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారు. ఫలితంగా రౌడీలు రాజ్యమేలుతున్నారు. తీవ్ర నేరస్వభావం గల రౌడీషీటర్ వంచనరి సురేశ్ ఆగడాలు పేట్రేగిపోతున్నాయి. గత జూలైలో జరిగిన బీరన్న బోనాల సందర్భంగా ఓ యువకుడి ఇంట్లోకి చొరబడి తన అనుచరులతో దాడిచేశాడు. పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తిరిగి బయటికి వచ్చి ఎప్పటిలాగే వ్యవహరిస్తున్నాడు. ఇదేకాకుండా జూలైలో రంగశాయిపేటలో గ్యాంగ్‌వార్ కారణంగా ఇద్దరు యువకులపై 11 మంది యువకులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఓ ప్రజాప్రతినిధి అనుచరుడైన రౌడీషీటర్ సెటిల్‌మెంట్ కోసం ఫోన్‌లో అవతలి వ్యక్తిని నానా దుర్భషలాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది తెలిసిందే. ఐపీఎస్ ఆఫీసర్ వచ్చినప్పటికీ శాంతి భద్రతల్లో ఇంకా ఎలాంటి మార్పురాలేదని, రౌడీషీటర్లు ఎప్పటిలాగే వారి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రౌడీషీటర్లు అధికంగా ఉన్న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని స్థానిక ప్రజలు పోలీస్ శాఖను విజ్ఞప్తి చేస్తున్నారు.

డిజిటల్ ప్రపంచంలో మహిళల వెనుకబాటు

వరంగల్ ఎంపీ కడియం కావ్య
గోవాల సదస్సులో పవర్ పాయింట్ ప్రజంటేషన్


సదస్సులో పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య తరగతి ఆదాయం కలిగిన దేశాల్లో మహిళలు డిజిటల్ ప్రపంచంలో పురుషుల కన్నా వెనుకబడి ఉన్నారని, ఇది వారి ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా ఉందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం గోవాలో 'ఫ్రిడిక్ ఎబర్ట్ స్టిఫ్టంగ్ ఇండియా' సంస్థ నిర్వహించిన సదస్సులో కావ్య పాల్గొన్నారు. మహిళలు డిజిటల్ ప్రపంచంలో ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళాశక్తి అభివృద్ధికి అవసరమైన చర్యలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. చిన్న, మధ్య తరగతి ఆదాయం కలిగిన దేశాల్లో మహిళలు పురుషులకన్నా 8 శాతం తక్కువగా మొబైల్ ఫోన్లు కలిగి ఉన్నారన్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగంలో 13 శాతం వ్యత్యాసం ఉన్నదని తెలిపారు. 405 మిలియన్ల మంది మహిళలు ఇంకా డిజిటల్ ప్రపంచానికి చేరుకోలేదని, ఇది మహిళాభివృద్ధికి పెద్ద ఆటంకమవుతున్నదని అన్నారు. దేశంలో 75శాతం మహిళలు మాత్రమే మొబైల్ ఫోన్ కలిగి ఉండగా స్మార్ట్ ఫోన్ వినియోగం కేవలం 35 శాతం మాత్రమే ఉందని వెల్లడించారు. ఈ డిజిటల్ గ్యాప్ వల్ల మహిళల ఆర్థిక స్వావలంబన, విద్య, ఆరోగ్య సేవలు పొందడంలో సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. డిజిటల్‌లో మహిళల అసమానతలు తగ్గించేందుకు తక్కువ ధరకే మొబైల్ పరికరాలు అందించడం, డిజిటల్ విద్య, మౌలిక సదుపాయలు పెంపొందించడం అత్యవసరమని అన్నారు. ఈ సదస్సులో మహిళ నాయకులు తమిళనాడు ఎంపీ ఆర్.సుధ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో పాటు పలువురు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య, రాజులు

కేయూ డిగ్రీ తెలుగు మొదటి, రెండో సెమిస్టర్ సిలబస్ ఆమోదం

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 2025-26 డిగ్రీ కోర్సుల మొదటి ఏడాది మొదటి, రెండో సెమిస్టర్ తెలుగు సబ్జెక్టు నూతన సిలబస్‌కు ఆమోదం తెలిపినట్లు కేయూ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ మామిడి లింగయ్య, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ చిర్రా రాజులు శనివారం తెలిపారు. శనివారం కేయూ తెలుగు విభాగంలో డిగ్రీ మొదటి, రెండో సెమిస్టర్ సిలబస్‌పై తెలుగు అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి పంపిన సిలబస్‌ను యథావిధిగా అందరు సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో కేడీసీ తెలుగు అధ్యాపకుడు సీతారాములు, ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎంవీ రమణ, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ హరీశ్‌లు పాల్గొన్నారు. మొదటి ఏడాది నూతన సిలబస్‌ను కేయూ స్టాండింగ్ కమిటీకి పంపినట్లు పేర్కొన్నారు.

రేపు ఐటీఐలో అప్రెంటిస్ షిప్ మేళా

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళాలో భాగంగా ఈ నెల 8న ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ మంగనూరి చందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రముఖ కంపెనీలు మేళాలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెషినిస్ట్, వెల్డర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, కోపా ట్రేడ్‌లకు అప్రెంటిష్‌కు ఎంపికైన విద్యార్థులకు స్టైఫండ్ నెలకు రూ.12 వేల నుంచి రూ.15వేల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సోమవారం అర్హత పత్రాలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో కోరారు.

వడ్డెపల్లి చెరువుకు కొత్త అందాలు

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయి. చెరువు అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. బండ్ పనులు పూర్తయిన తర్వాత ఇది నగరంలోని మరో పర్యాటక ప్రాంతంగా మారుతుంది.

కాకతీయుల నాటి చెరువు

భద్రకాళి చెరువులాగేనే వడ్డెపల్లి చెరువుకు కూడా విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఈ చెరువు కూడా కాకతీయుల కాలంలో నిర్మించినదే. సాగునీరుతో పాటు తాగునీటి అవసరాలు తీర్చేందుకు వీలుగా దీనిని నిర్మించారు. 12-14 శతాబ్దపు మధ్య కాలంలో నిర్మించిన ఈ చెరువు విస్తీర్ణం మొత్తం 600 ఎకరాలు. అప్పట్లో ఈ చెరువు కింద 6వేల ఎకరాల ఆయకట్టు సాగయ్యేది. 1993 వరకు ఇది సాగునీటి చెరువుగా రైతులకు ఎంతో ఉపయోగపడింది. నగరంలోని మంచినీటి ఎద్దడిని నివారించేందుకు, ధర్మసాగర్ రిజర్వాయర్, భద్రకాళి చెరువుతో పాటు దీనిని మంచినీటి రిజర్వాయర్‌గా మార్చారు. దేవాదుల ప్రాజెక్టు అందుబాటులో వచ్చిన తర్వాత ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా మాత్రమే నగర ప్రజలకు అవసరమైన తాగునీరు సరఫరా అవుతుండడంతో భద్రకాళితో పాటు వడ్డెపల్లి చెరువులు ప్రస్తుతం వేసవి జలాశయాలుగా వాడుకోవడం లేదు. వడ్డెపల్లి చెరువు చేపల పెంపకానికి అనువైనది కావడంతో ఇది మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తోంది. నగరంలోని బతుకమ్మలను నిమజ్జనం చేసే చెరువుల్లో ఇది ఒకటి. ఈ చెరువు కట్టపొడవు 2.4 కి.మీ. ప్రస్తుతం వాకర్స్‌కు ఇది ఎంతో ఉపయోగపడుతోంది. వడ్డెపల్లి చెరువు నీటి నిలువ సామర్థ్యం 101 ఎంజీఎఫ్‌టీ. దీని డెడ్ స్టోరేజీ మినహాయిస్తే 81 ఎంసీఎఫ్‌టీల నీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుంది.

పూడుకుపోయిన చెరువు

మొదట్లో ఈ చెరువు నీటి నిలువ సామర్థ్యం 150 ఎంసీఎఫ్‌టీలు ఉండేది. శతాబ్దకాలంలో చెరువులోకి పెద్దఎత్తున మట్టి చేరి పూడుకుపోయింది. 1993లో దీనిని వేసవి జలాశయంగా మార్చిన క్రమంలో శుద్ధి చేశారు. చెరువులోతు పెంచడానికి అప్పుడు కొంత మేరకు పూడిక తీశారు. ఆ తర్వాత కాలంలో ఈ చెరువు గురించి పెద్దగా పట్టించుకోలేదు. చెరువులో మట్టిపేరుకుపోవడం వల్ల చెరువు నీటి నిలువ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది. పూడిక తీస్తే చెరువులో నీటి సామర్థ్యం పెరుగుతుంది. చెరువు అభివృద్ధి చెందుతుంది. సుందరీకరణ పనుల వల్ల పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుంది. చెరువు బండ్‌ను అభివృద్ధి చేస్తున్నందువల్ల దీనితో సమాంతరంగా చెరువును కూడా అభివృద్ధి చేయాలని కుడా భావిస్తోంది. నగరంలోని దామెర చెరువును కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

ఈ చెరువును వాటర్ స్పోర్ట్స్‌కు అనువుగా తీర్చిదిద్దనున్నది. దీనితోపాటు వడ్డెపల్లిని కూడా అభివృద్ధి చేస్తే నగరంలో ఇది మరొక పర్యాటక ప్రాంతంగా మారుతుందని కుడా అధికారులు భావిస్తున్నారు. ప్రతిపాదనలు ఆమోదం పొందితే భద్రకాళి చెరువు లాగానే వచ్చే సంవత్సరం చెరువులోని నీటిని ఖాళీ చేసి వేసవిలో మూడు నాలుగునెలల పాటు పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తారు.

వేతనాలు రాక.. పూట గడవక..

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగ నియామకలు చేపడుతోంది. ఇప్పటి వరకు 58వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి 25 విభాగాల్లో నియామకాలు చేపట్టింది. ఈ నియామకాల్లో ఉపాధ్యాయులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు వంటి హోదాలు ఉన్నాయి. అయితే కొత్తగా నియమించిన రెగ్యులర్ ఉద్యోగులు రావడంతో పొరుగు సేవల ఉద్యోగులు ఎవరిని ఎలా నిర్వహించాలో ప్రశ్నార్థకంగా మారింది. తమ విషయంలో కఠినంగా వ్యవహరించొద్దని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతుండగా రెగ్యులర్ ఉద్యోగులు వచ్చాక వారెందుకని ప్రభుత్వం ఆలోచిస్తోంది. గ్రూప్-4 ద్వారా ఎంపికైన 8143 మంది జూనియర్ అసిస్టెంట్ల స్థానంలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించనున్నారు. ఇప్పటికే ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల పరిధిలో జూనియర్ అసిస్టెంట్లను భారీగా నియమించారు. దీంతో ఈ రెండు శాఖల్లో 150 మందిని తొలగించారు. పురపాలక శాఖ, రిజిస్ట్రేషన్ శాఖల్లోనూ సర్దుబాటు చేశారు. నిర్దిష్టమైన వేతన స్కేల్ లేని ఉద్యోగులందరినీ గౌరవ వేతనం కేటగిరీలో చూపుతారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు, మున్సిపల్, పంచాయతీల్లో పని చేసే కార్మికులు వీరిలో కొందరు. ఈ ఉద్యోగాలన్నీ గాలిలో దీపాలే. రెగ్యులర్ ఉద్యోగులు వస్తే వీరంతా ఇంటిబాట పట్టాల్సిందే.

ఏజెన్సీల అవకతవకలు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియామకం చేసిన అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ సంస్థలు అవకతవకలకు పాల్పడుతున్నాయి. పొరుగు సేవల ఏజెన్సీలు కార్మికులు, సిబ్బంది పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కోట్లాది రూపాయలను స్వాహా చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో పలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల చేతివాటం రోజు రోజుకూ ఎక్కువవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో కార్మికులకు ఉద్యోగ భద్రత కరువవుతోందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య పేషెంట్ కేర్, సెక్యూరిటీ తదితర సిబ్బంది అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్నారు. ఆరేడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వీరు పలుమార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేదు. వేతనాలు రాక, పూడగడవని దయనీయ స్థితిని ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకునా ఏజెన్సీలే సొంతంగా జీతాలు చెల్లించాల్సి ఉంటుందని, నిధులు వచ్చాక సరి చూసుకోవాలనే నిబంధనలున్నాయని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. 2023 నుంచి పనిచేస్తున్నా వారి వేతనాలకు సంబంధించి పే స్లిప్పులు ఇవ్వడం లేదు.

నిధులువచ్చినా వేతనాలివ్వని ఏజెన్సీలు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రతీరోజు విధులు నిర్వర్తిస్తున్నారు. థర్డ్ పార్టీ ద్వారా నియమితులైన వీరు వేతనం కోసం తమను నియమించిన ఏజెన్సీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బతుకులీడ్వాల్సి వస్తోంది. వీరి వేతనాలను ప్రభుత్వం ఏజెన్సీ ఖాతాల్లో జమచేస్తే వారు కమిషన్ మినహాయించుకొని ఉద్యోగులకు వేతనాలను చెల్లిస్తారు. ప్రభుత్వం వేతనాలు మంజూరు చేసినా ఏజెన్సీ నుంచి వీరికి అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వమే బడ్జెట్ లేదన్న సాకుతో వేతనాలు ఇవ్వక తిప్పించుకుంటోంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు వెలువరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 5 నెలలు అవుతున్నా నాలుగు శాఖల సిబ్బంది మినహా మిగతా వారి సర్వీసును క్రమబద్ధీకరించలేదు. వేలాది మంది విధులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తాము విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఉద్యోగంలో ఉన్నామా? లేదా అనే అయోమయానికి గురవుతున్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని..

● కిడ్నాప్ చేసి యువకుడి దారుణ హత్య ● ఆరుగురు నిందితుల అరెస్టు ● భూపాలపల్లిలో బాసిత్ హత్య కేసులో వీడిన మిస్టరీ


నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారం అడవుల్లో శుక్రవారం వెలుగు చూసిన యువకుడి హత్య కేసును భూపాలపల్లి పోలీసులు ఛేదించారు. ఆరుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. తమకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడనే కోపంతో ఆ యువకుడిని కిడ్నాప్ చేసి కత్తితో పొడిచి హత్య చేశారని, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించారని గుర్తించారు. భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు తన చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎం.డి.బాసిత్ (20)తో శాంతినగర్ కాలనీకి చెందిన రడపాక భాస్కర్ అలియాస్ బబ్లూ, బుస్స ప్రశాంత్ అలియాస్ సోను, గాజుల కుషాల్ అనే యువకులకు గొడవలు ఉన్నాయి. రెండు నెలల క్రితం బస్టాండ్ ఎదురుగా వీరు ఓ విషయంలో వాగ్వాదం చేసుకున్నారు. ఆ సమయంలో బాసిత్ అసభ్యకరంగా మాట్లాడాడని ఆ యువకులు అతడిని చితకబాదారు. దీంతో బాసిత్ వారిపై కక్ష పెట్టుకుని సోషల్ మీడియాలో హేట్ మేసేజ్‌లు పెట్టడం మొదలెట్టాడు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో అసభ్యకర పదజాలంతో వారికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడమేకాకుండా నేరుగా మేసేజ్ రూపంలో రెచ్చగొట్టే విధంగా వారికి పంపేవాడు. దీంతో కోపోద్రిక్తులైన ముగ్గురు బాసిత్‌ను అంతమొందించాలని పథకం రచించారు. తమ మరో ముగ్గురు స్నేహితులు పందిళ్ల శ్రవణ్, బరిగల ప్రణయ్, చొప్పరి నవీన్‌తో కలిసి మర్డర్‌కు ప్లాన్ చేశారు. ఈ నెల 4న తన మిత్రుడు అరుణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బాసిత్ వస్తుండగా ఆరుగురు కారులో వచ్చి అతడిని ఆపి కొట్టారు. ఆపై కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లోకి తీసుకెళ్లి విచక్షణ రహితంగా కొట్టి చేతులు వెనక్కి కట్టేసి కత్తితో పొడిచారు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ని పోసి నిప్పటించి పరారయ్యారు. ఈ నేపథ్యంలో ఈనెల 5న మృతదేహాన్ని తాడ్వాయి పోలీసులు గుర్తించారు. అప్పటికే కిడ్నాప్ కేసు భూపాలపల్లిలో నమోదై ఉన్న నేపథ్యంలో అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో మృతుడితో కిడ్నాప్ రోజు ఉన్న అతడి స్నేహితుడు చెప్పిన వివరాలు, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన భూపాలపల్లి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరాన్ని వారు అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు.

అరెస్టు అయిన వారిలో భూపాలపల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన రడపాక భాస్కర్ అలియాస్ బబ్లూ, బుస్స ప్రశాంత్ అలియాస్ సోను, గాజుల కుషాల్, టీటూ క్వార్టర్స్‌కు చెందిన పందిళ్ల శ్రవణ్ అలియాస్ పవన్, యాదవకాలనీకి చెందిన బరిగల ప్రణయ్, సుభాష్‌కాలనీకి చెందిన చొప్పరి నవీన్ ఉన్నారని డీఎస్పీ వివరించారు. విలేకరుల సమావేశంలో సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సాంబమూర్తి, రమేష్‌లు పాల్గొన్నారు. మృతుడు బాసిత్ ఏపనీ చేయకుండా తిరిగే వాడని, అతడిపై పలు గంజాయి, చైన్‌స్నాచింగ్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

వచ్చే వారంలో నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీట్లలో తెలంగాణ స్థానిక విద్యార్థులకు ఎలాంటి నష్టం కలిగినా తమ ప్రభుత్వం ఊరుకోదని, నీట్ కౌన్సెలింగ్ వచ్చే వారంలో ప్రారంభం అవుతుందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఇటీవల సుప్రీంకోర్టులో జీవో 33 అనుకూలంగా తీర్పు వెలువడిన నేపథ్యంలో నీట్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణచారి, కార్యదర్శి పొడిశెట్టి రమేశ్‌కుమార్, నియాజ్, అశోక్, మహిపాల్‌రెడ్డి, రాజేందర్, నరసింహ తదితరులు శనివారం ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జీవో 33 అమలుకు అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో రాష్ట్రంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.


ఆరోగ్యశాఖ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీట్ పేరెంట్స్ అసోసియేషన్ కార్యవర్గం

నేడు కాళోజీ కళాక్షేత్రంలో కాకతీయ వైభవం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి కాకతీయ వైభవం పేరిట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, భిన్నరంగ కళాకారులకు కాకతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు వంగాల శాంతికృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు వేయికిపైగా కార్యక్రమాల ద్వారా సుమారు లక్ష మంది కళాకారులను సత్కరింపజేసిన క్రమంలో ఈసారి 1,112 కార్యక్రమంగా కాళోజీ కళాక్షేత్రంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యోగా సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగా డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని హ్యాపీ లివింగ్ అకాడమీ డైరెక్టర్, ప్రముఖ యోగాచార్యులు ఆంజనేయులు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కాకతీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా సర్టిఫికెట్లు పొందవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు 95534 89862 / 99126 40919నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్సార్‌యూకు ఆల్ ఇండియా 91వ ర్యాంకు

● ఎన్ఐఆర్ఎఫ్ కేటగిరిలో కైవసం
● ఎస్సార్‌యూ చాన్స్‌లర్ వరదారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ వరదారెడ్డి

హసన్‌పర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం మరోసారి తన ప్రతిభను చాటుకుందని ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్‌యూలో శనివారం ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వరదారెడ్డి వివరాలను వెల్లడించారు. ఇటీవల విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ 2025ను విడుదల చేశారని తెలిపారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ (ఎంఓఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2025లో ఇంజనీరింగ్ కేటగిరిలో 91వ ర్యాంకు, యూనివర్సిటీ కేటగిరిలో 101- 150 బ్యాండ్లో స్థానం సంపాదించడం గర్వకారణమన్నారు. తెలంగాణలోని ప్రైవేటు సంస్థలలో ఇంజనీరింగ్ కేటగిరిలో టాప్ 100లో స్థానం పొందిన ఏకైక సంస్థ ఎస్సార్‌యూ మాత్రమేనని అన్నారు. వరుసగా నాలుగో సంవత్సరం ఈ ప్రతిష్ఠాత్మక ర్యాంకు దక్కించుకోవడంలో విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం, విద్యార్థుల కృషి మరువలేనిదన్నారు.

వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్‌లో టాప్ 100లో చోటు దక్కించుకోవడం ద్వారా విద్యా నాణ్యత, పరిశోధన ఆవిష్కరణలపై ఎస్సార్ విశ్వవిద్యాలయం పట్టును మరోసారి రుజువు చేసుకుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల మధ్య ఎస్సార్ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇన్నోవేషన్, క్రియేటివిటీ, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ విలువలను పాఠ్యాంశంలో భాగంగా చేసుకోవడంతో పాటు అధ్యాపక బృందం, సమర్థవంతమైన పరిశోధన ఫలితంగా 5000 ప్లస్, పరిశోధన పత్రాలు, 1000 ప్లస్ పేటెంట్లు, 50 ప్లస్ పేటెంట్లు పొందినట్లు తెలిపారు. 50 ప్లస్ పరిశోధన ప్రాజెక్టుల ద్వారా రూ.15 కోట్ల నిధులు అలాగే మైక్రోసాఫ్ట్ నుంచి 51 ఎల్‌పీఏ వంటి అత్యుత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలు సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, వివిధ స్కూల్స్ డీన్స్, వివిధ విభాగాల హెడ్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనోత్సవం

● రెండో రోజు కూడా కొనసాగిన వేడుక ● తరలివచ్చిన భారీ విగ్రహాలు ● చిన్నవడ్డెపల్లి, ఉర్సు, బెస్తం చెరువుల వద్ద అధికారుల వైఫల్యం
● మొదటి రోజు అర్ధరాత్రి వరకే కనిపించిన వైనం మొరాయించిన క్రేన్లు.. లోతు లేక నీటమునగని విగ్రహాలు


ఉర్సు చెరువు వద్ద ఒడ్డున్నే నిమజ్జనాలు చేసిన గణపతి విగ్రహాలు


చిన్నవడ్డెపల్లికి ట్రాక్టర్లపై పెద్ద ఎత్తున నిమజ్జనానికి తరలివస్తున్న వినాయక విగ్రహాలు


చిన్న వడ్డెపల్లి చెరువుకు తరలుతున్న భారీ విగ్రహం

పోచమ్మమైదాన్(వరంగల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిసాయి. శుక్రవారం ఉదయం ప్రారంభమైన నిమజ్జన వేడుకలు శనివారం సాయంత్రం వరకు కొనసాగాయి. గణేష్ ఉత్సవ నిర్వాహకులు చాల ఆలస్యంగా రోడ్ల పైకి వచ్చారు. దీంతో అర్ధరాత్రి వరకు నిమజ్జన వేడుకలు నిమ్మదిగా సాగాయి. ఇదిలావుండగా, వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువులో అర్ధరాత్రి 1 గంట వరకు సుమారుగా 800లోపు మాత్రమే విగ్రహాల నిమజ్జనం జరిగింది. కాగా అర్ధరాత్రి రెండు గంటల తరువాత అధికశాతం విగ్రహాలు నిమజ్జనానికి బయలు దేరి వచ్చాయి. దీంతో రెండవ రోజు సాయంత్రం వరకు వినాయక నిమజ్జనం నిర్విరామంగా కొనసాగింది. శనివారం ఉదయం వేళలో నిమజ్జనానికి వచ్చిన విగ్రహాల వాహనాలు సుమారు మూడు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. దీంతో పోలీసులు వాహనాలను క్రమపద్ధతిలో చెరువు వద్దకు చేరవేశారు.

చిన్నవడ్డెపల్లి చెరువులో రెండు రోజులు జరిగిన కార్యక్రమంలో చిన్న విగ్రహాలు 500, మీడియం సైజు విగ్రహాలు 400, భారీ విగ్రహాలు 700 వరకు నిమజ్జనమైయ్యాయని, మొత్తంగా సుమారు 1600 విగ్రహాల నిమజ్జనం జరిగినట్లు అధికారులు తెలిపారు. అధిక శాతం విగ్రహాలు ఆలస్యంగా బయలు దేరడం, కొన్ని మండపాల నిర్వాహకులు ఉదయం బయలుదేరడంతో రెండవ రోజు సాయంత్రం వరకు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటల తరువాత క్రేన్ ఆపరేటర్లు అందుబాటులో లేకపోవడంతో పలువురు మండపాల నిర్వాహకులు నేరుగా విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. కాగా సాయంత్రం వేళలో భారీ విగ్రహాలు నిమజ్జనానికి రావడంతో మళ్లీ క్రేన్‌లతో నిమజ్జనం చేశారు.

కొరవడిన పర్యవేక్షణ....

వినాయక నిమజ్జన వేడుకలలో అర్ధరాత్రి దాటిన తరువాత పూర్తి స్థాయిలో అధికారుల పర్యావేక్షణ కొనసాగలేదు. అధికారులు కనబడకపోవడంతో సిబ్బంది చేతుల మీదుగానే నిమజ్జన ప్రక్రియ కొనసాగినట్లు పలువురు తెలిపారు. తెల్లవారుజాము నుంచి అధిక శాతం విగ్రహాలు నిమజ్జనానికి రావడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. కేవలం పోలీసు సిబ్బంది మాత్రమే విధుల్లో ఉండటంతో నిమజ్జనం చేసే క్రేన్‌ల వద్ద విగ్రహాల వాహనాలు భారీగా మోహరించాయి.


నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న గణపతి

చేతులెత్తేసిన సిబ్బంది...

కరీమాబాద్(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు గుట్ట చెరువు వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన గణపతి నిమజ్జనాల్లో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు సుమారు 600పైగా విగ్రహాల వరకు సాఫీగా సాగిన నిమజ్జనాలు ఆ తరువాత గతి తప్పాయి. నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసిన మూడు క్రేన్‌లు మొరాయించడంతో విగ్రహాలను చెరువులోకి తరలించడం కష్టతరం కావడంతో సిబ్బంది చెరువులోకి తెప్పలు వెళ్లడం కష్టమని విగ్రహాలను ఒడ్డున ఉన్న ఫ్లాట్‌ఫాం దగ్గరే నిమజ్జనం చేశారు. దీంతో విగ్రహాలు సగం వరకే నీటిలో మునిగిపోయాయి. ఆ తరువాత వచ్చే విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేసేందుకు వీలు లేకపోవడంతో భక్తులకు, సిబ్బందికి మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక్కో గణపతి విగ్రహం నిమజ్జనం చేసేందుకు గ్రేటర్ సిబ్బంది రూ.500 డిమాండ్ చేసినట్లుతెలిసింది. నిమజ్జనాల ఏర్పాట్లలో జీడబ్ల్యూఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు వచ్చాయి. నిమజ్జనాలు గతి తప్పిన విషయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం కూడా నిమజ్జనాలకు గణపతి విగ్రహాలు తరలివచ్చాయి. కాని చెరువు ప్రాంతంలో కేవలం ఒకే ఒక్క క్రేన్ అందుబాటులో ఉండగా, సిబ్బంది ఎవరూ కనిపించలేదు.

బెస్తం చెరువు వద్ద అదే పరిస్థితి...

శంభునిపేట (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేట నాయుడు పెట్రోల్ పంప్ సమీపంలోని బెస్తం చెరువులో నిమజ్జన ఏర్పాట్లు చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. నిమజ్జనం కోసం నాలుగు రోజుల క్రితం చెరువులో నామమత్రంగా పూడిక తీసారు. సుమారు 250 విగ్రహాలు నిమజ్జనం చేసే చెరువులో ఆ స్థాయిలో పనులు చేయలేకపోయారు. దీంతో లోతు లేక విగ్రహాలు నీట మునగలేదు. ఈ క్రమంలో గణనాథులను క్రేన్ నుంచి దింపి తెప్పలలో 30 మీటర్ల దూరం వరకు లోతున్న ప్రాంతానికి తీసుకెళ్ళి నిమజ్జనం చేయాల్సి వచ్చింది. దీంతో చెరువు వద్ద నుండి ఖమ్మం రోడ్ వరకు విగ్రహాలు గంటల కొద్దీ బారులు తీరాయి. కొన్ని పెద్ద విగ్రహాలను చెరువు పక్కనే నిమజ్జనం చేయగా అవి మునగకపోవటంతో ఆయా మండళ్ల బాధ్యులు ఇరిగేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మామునూరు ఎస్ఐ శ్రీకాంత్ సముదాయించి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూశారు.

ఘనంగా ఆంధ్రజ్యోతి గణపతి నిమజ్జన వేడుక


ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆంధ్రజ్యోతి బృందం

మడికొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు ఘనంగా పూజలందుకున్న విఘ్న వినాయకుడిని ఆంధ్రజ్యోతి సిబ్బంది శుక్రవారం రాత్రి ఘనంగా సాగనంపారు. మడికొండలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వినాయక నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది 18వ సారి కావడం విశేషం. శుక్రవారం రాత్రి స్వామి వారికి ఉద్వాసన పూజను భక్తిపాటలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌మేనేజర్ వివిధ విభాగాల ఇన్‌చార్జిలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. సంస్థ పురోభివృద్ధితో పాటు, సిబ్బంది సంక్షేమం కాంక్షిస్తూ వినాయక నవరాత్రులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉత్సాహంగా సాగిన వేలం పాటలో లడ్డూను ప్రొడక్షన్ విభాగం రీజనల్ మేనేజర్ బి.అజయ్‌కుమార్ దక్కించుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించి శనివారం తెల్లవారుజామున మడికొండ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి, యాడ్స్ మేనేజర్ రమేశ్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి షరీఫ్, అకౌంటెంట్ ఎస్.వెంకటేశ్, స్టోర్స్ రవి, ప్రొడక్షన్ నుంచి విజయ్, షెడ్యూలింగ్ కాయల వేణయ్య, హెచ్‌ఆర్ రాజేందర్, సబ్ ఎడిటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శివనగర్‌లో లడ్డూ వేలం పాట

రూ.1.36 లక్షలు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): వరంగల్ శివనగర్‌కు చెందిన మెరుగు అశోక్ రూ.1,36,500కు వేలంలో వినాయక లడ్డూ దక్కించుకున్నారు. 34వ డివిజన్ శివనగర్‌లో రాక్‌స్టార్ ఏర్పాటు చేసిన లడ్డూకు శుక్రవారం రాత్రి వేలం పాట నిర్వహించగా అశోక్ అత్యధిక పాటపాడి కైవసం చేసుకున్నారు. ఆయనకు వాస్తు వేదాంతి సుమన్‌శర్మ లడ్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాక్‌స్టార్ యూ త్ సభ్యులు అంకతి అఖిల్, నలివేల మ హేష్, పిన్నిరెడ్డి ప్రణీత్‌రెడ్డి, గుండెపు శివ, ఏకాంబరం మనస్వి త్, ముప్పార పాకిల్, నిఖిల్, గూడురు రాజేష్, సంతోష్, సాత్విక్, అరవింద్, కిట్టు, స్థానిక పెద్దలు దిడ్డి రాజేందర్, కోటి నారాయణ, అచ్చ రవి, బేతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వేలంపాటలో లడ్డును పొందిన మెరుగు అశోక్



నిమజ్జనాన్ని తిలకిస్తున్న భక్తులు, ఫైర్ ఇంజన్‌తో గణపతిపై నీళ్లు చిమ్ముతున్న దృశ్యం

భారీ గణనాథుడికి జన నీరాజనం

ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేసిన నిర్వాహకులు

5గంటల పాటు కొనసాగిన వేడుకలు

మట్టెవాడ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్లంబజార్ ప్రాంతంలో ప్రతిష్ఠించిన 45 అడుగుల ఎత్తైన భారీ మట్టి వినాయకుడిని శనివారం ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. ఫైర్‌ఇంజన్ ట్యాంకర్, మున్సిపల్ వాటర్ ట్యాంకు నీళ్లను విగ్రహంపై చిమ్మి నిమజ్జనం చేశారు. దీనికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది. దీంతో క్రమక్రమంగా మట్టి కరిగిపోయింది. నిమజ్జనాన్ని చూసేందుకు భక్తులు తరలివచ్చారు.

-రూ.3.26 లక్షల పలికిన లడ్డూ వేలం..

వరంగల్ ఎల్లంబజార్‌లో ఆకుతోట సంజు ప్రతిష్ఠించిన 45 అడుగుల ఎత్తైన భారీ గణనాధుని వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను హంటర్‌రోడ్డుకు చెందిన బత్తిని సమత రమేశ్ దంపతులు దక్కించుకున్నారు. వేలం పాటలో పాల్గొని రూ. 3.26 లక్షలకు లడ్డూను గెలుచుకున్నారు.

మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన నిమజ్జనం ప్రక్రియ సుమారు 5గంటలకు పైగా సాగింది. 200 లీటర్ల పాలు, 20 వేల లీటర్ల నీళ్ళు, 50కిలోల పసుపు, 50 కిలోల కుంకుమ, 30కిలోల పెరుగు, 80 కేజీల గులాబీ పూలతో నిమజ్జనం చేపట్టారు. వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్‌రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నవీన్‌ల ఆధ్వర్యంలో ఫైర్‌సిబ్బంది ట్యాంకర్ పైపుల సహాయంతో విగ్రహంపైకి నీళ్ళను చల్లి నిమజ్జనం చేశారు. నిమజ్జనం చేసిన మట్టిని భక్తులకు అందచేస్తామని నిర్వాహకుడు సంజు తెలిపారు.

10వేల పైచిలుకు విగ్రహాల నిమజ్జనం

● 36 గంటల పాటు శ్రమించిన బల్దియా సిబ్బంది
● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని 22 చెరువుల వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు 10వేలకు పైచిలుకు వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నగరంలో చాలాచోట్ల ఆలస్యంగా శోభయాత్రలు నిర్వహించడం వల్ల చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. అదనంగా సిబ్బందిని పిలిపించి ఆలస్యంగా వచ్చిన విగ్రహాలను నిమజ్జనం చేశామన్నారు. కిందటేడు 6,500 విగ్రహాలతో పోల్చుకుంటే.. ఈ యేడు విగ్రహాల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అన్ని విభాగాలు చెరువుల వద్ద విస్తృత సేవలందించడం వల్ల నిమజ్జన కార్యక్రమం విజయవంతమైందని వెల్లడించారు. 36గంటల పాటు సిబ్బంది శ్రమకోర్చి సేవలందించారని కమిషనర్ ప్రశంసించారు. సిబ్బంది సేవలను గుర్తించి వారికి తగిన అవకాశాలు ఇస్తామని కమిషనర్ తెలిపారు.

నేడు కాళేశ్వర ఆలయం బంద్

మహదేవపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని మూసివేయనున్నారు. ఉదయం 12 గంటలకు ద్వార బంధనం చేసి తిరిగి సోమవారం సంప్రోక్షణాది పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో మహేష్ తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు భక్తులకు దర్శనానికి అనుమతించడం జరుగుతుందన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 4.51లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.70మీటర్లు ఎత్తులో ప్రవహిస్తుంది.

మా సార్‌ను ఎక్కడికి పంపొద్దు..

● ప్రిన్సిపాల్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి ● మధ్యాహ్నం వరకు విద్యార్థినుల బైఠాయింపు
● కలెక్టర్ హామీతో శాంతించిన విద్యార్థినులు ● స్టేషన్‌ఘన్‌పూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమను తండ్రిలా, ఆదరిస్తూ, ఐదేళ్లుగా కంటికిరెప్పలా చూసుకుంటున్న ప్రిన్సిపాల్ ధరావత్ రాజును డిప్యూటేషన్‌పై పంపిస్తే పురుగుల మందు తాగుతామని, సార్ లేకుంటే మేం చదువుకోం టీసీలు ఇవ్వండి అంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన శనివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటు చేసుకుంది. ఇటీవల పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న ఓ టీచర్ విద్యార్థినులతో పాలు కాయించడం, అంట్లు తోమించడంతో పాటు, ప్రిన్సిపాల్ గదిలో విద్యార్థులను మోకాళ్ల పైన నిలబెట్టిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపైన అధికారులు విచారణ జరిపి ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌కు నివేదిక పంపించారు. నివేదిక మేరకు పీవో ప్రిన్సిపాల్ రాజును డిప్యూటేషన్‌పై అరెపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు పంపించారు. దీంతో ప్రిన్సిపాల్ రాజు ఘన్‌పూర్ ఆశ్రమ పాఠశాలకు వచ్చి డిప్యూటేషన్‌పై వెళ్తున్నట్టు ఉపాధ్యాయ బృందానికి తెలిపి వెళ్లిపోయారు. తర్వాత విషయం తెలుసుకున్న విద్యార్థులు కన్నీరుపెట్టుకున్నారు. ఈ క్రమంలోనే గేటు ఎదుట బైఠాయించారు. విద్యార్థులు రోడ్డు పైకి వెళ్లే ప్రయత్నం చేయగా సిబ్బంది గేటుకు తాళం వేశారు. దీంతో పాఠశాల ఆవరణలోనే గేటు వద్ద బైఠాయించి, మధ్యాహ్నం భోజనం టైం వరకు సార్‌ను పంపించొద్దు అంటూ నినాదాలు చేశారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేవారని, సార్ వెళ్లితే తాము ఇక్కడ చదువమని, టీసీలు ఇస్తే వెళ్లిపోతామని విద్యార్థులు వెల్లడించారు. డిప్యూటేషన్ రద్దు చేయకుంటే పురుగుల మందు తాగుతామంటూ హెచ్చరించారు.

కలెక్టర్ హామీతో..

విషయం తెలుసుకున్న ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ వేణు, ఎస్సై వినయ్‌కుమార్‌లు పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. నెల రోజుల్లో సార్‌ను తీసుకువచ్చేలా చూస్తామని పేర్కొన్నా వినలేదు. దీంతో ఆర్డీవో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి ప్రిన్సిపాల్ డిప్యూటేషన్ తమ పరిధిలో లేదని, పీవోతో మాట్లాడి నెల రోజుల వ్యవధిలో తీసుకువచ్చేలా కృషి చేస్తామని విద్యార్థులకు తెలియపరుచాలని ఆర్డీవోకు తెలిపారు. దీంతో విద్యార్థులు శాంతించి, హాస్టల్‌కు వెళ్లి భోజనం చేశారు.


విద్యార్థినులకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్న అధికారులు

సర్కారు ఆఫీసుల్లో సౌర వెలుగులు

● ప్రతీ ఆఫీసు భవనంపై సోలార్ ప్యానెల్స్
● ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సైతం..
● ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో సోలార్ పంపుసెట్లు
● కరెంట్ బిల్లులు తగ్గించే దిశగా చర్యలు
● ప్రభుత్వ కార్యాలయాలపై కొనసాగుతున్న సర్వే
● నివేదికలు అందగానే సౌర పలకల బిగింపు

హనుమకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ జల, థర్మల్ విద్యుత్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి సౌర విద్యుత్తును అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీ భవనం నుంచి సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే విషయమై ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్లు పంపాల్సిన వివరాలతో ఒక ప్రశ్నావళిని రూపొందించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఉన్న ఖాళీ భూముల వివరాలను సైతం ప్రభుత్వం సేకరిస్తోంది. వీటిలో కూడా సౌర వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు.

అన్ని ప్రభుత్వ భవనాలపై..

విద్యుత్పత్తిలో ఎదురవుతున్న సమస్యలు, ఆర్థిక నష్టాలు, డిస్కంలకు బిల్లుల చెల్లింపులు భారమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయలను అన్వేషిస్తోంది. ప్రైవేటుగా భవనాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాయితీలను కల్పిస్తున్నది తెలిసిందే. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దిశగానే అడుగులు వేస్తోంది. దాదాపు ఇలాంటి పథకాన్నే అమలు చేయాలని నిర్ణయించింది. అయితే ఇది పూర్తిగా ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమైన కార్యక్రమం. ప్రతీ ప్రభుత్వ కార్యాలయం భవనంపై సౌరపలకలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని సొంత భవనాలు కలిగిన అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ కార్యాయాల భవనాలపై వీటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నది. దీంతో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) అధికారుల పర్యవేక్షణలో సర్వే జరుగుతోంది. మండలాల్లో ఎంపీడీవోలు, ఎన్‌పీడీసీఎల్ ఏఈలు, మున్సిపాలిటీల పరిధిలో ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్లు, డిప్యూటీ కమిషనర్లు సర్వే జరుపుతున్నారు. వాస్తవానికి ఈ సర్వే గత నెల 18వ తేదీ నాటికే పూర్తి కావలసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురుస్తుండడంతో సర్వే చేయడంలో జాప్యం జరుగుతోంది. రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి కావచ్చునని తెలుస్తోంది.



సమగ్రంగా సర్వే

పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్ డిగ్రీ కళాశాలల భవనాలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, ఆస్పత్రులు, సాగునీటి ప్రాజెక్టు కార్యాలయాలు, కలెక్టరేట్ భవన సముదాయాలతో సహా ప్రతీ ప్రభుత్వ కార్యాలయంపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. ఎన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి? వాటి రూఫ్‌టాప్‌పై ఎన్ని కిలోవాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు, అందుకు ఎంత సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయవచ్చు? ఆ కార్యాలయానికి నెలకు ఎన్ని యూనిట్లు విద్యుత్ అవసరమవుతున్నది? ఎన్ని కిలోవాట్ల లోడు పడుతున్నది? తదితర వివరాలను సర్వే సందర్భంగా సేకరిస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత నివేదికలను రెడ్కోకు అందజేస్తారు. రెడ్కో అధికారులు ఈ నివేదికలను పరిశీలించి ఎన్ని సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలి? ఎంత సౌరశక్తిని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంటుంది..? తదితర గణాంకాలతో ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు ఆమోదించి బడ్జెట్ కేటాయిస్తే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారు. డిసెంబర్ నెలాఖరునాటికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం.

అవసరాన్ని బట్టి ప్లాంట్లు

తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న కార్యాలయాలకు ఎల్‌టీ సర్వీస్ కింద, విద్యుత్ వినియోగం ఎక్కువగా వినియోగించే భవన సముదాయాలకు హెచ్‌టీ సర్వీస్ కింద సోలార్ ప్లాంట్లను బిగిస్తారు. ఉదాహరణకు ఒక గ్రామ పంచాయతీ కార్యాలయానికి నెలకు రూ.2వేల కరెంట్ బిల్లు వస్తుంది అనుకుంటే అందుకు ఎల్టీ సర్వీసు కింద 3-5 కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. కలెక్టరేట్ సముదాయ భవనం, పెద్దాస్పత్రుల వంటి విశాలమైన భవనాలకు హెచ్‌టీ సర్వీసు కింద 100 కిలోవాట్లకు పైగా సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను బిగిస్తారు.

సౌరగిరి జల వికాస పథకం

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పంపిణీ చేసిన సుమారు 50వేల ఎకరాల్లో ఇందిర సౌరగిరి జల వికాస పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నారు. మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వీటిని పంపిణీ చేయనున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల కింద ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 130 ప్రభుత్వ పాఠశాలల భవనాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. మారుమూల పల్లె ప్రాంతాల్లోని కొన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సోలార్ హీటర్లను కూడా బిగించారు.

విద్యుత్ ఖర్చు ఆదా కోసమే..

ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లులు ప్రతీ నెల తడిసి మోపెడవుతున్నాయి. డిస్కమ్‌లకు ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఈ బకాయిలు రూ.600కోట్ల వరకు ఉన్నాయి. కార్యాలయాల్లో సౌరవిద్యుత్ అందుబాటులోకి వస్తే బకాయిల భారం చాలా వరకు తగ్గుతుంది. ప్రభుత్వానికి ఈ డబ్బు ఆదా అవుతుంది.

ప్రభుత్వ కార్యాలయాల సర్వే జరుగుతున్నది..

గంగుల మహేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్, టీజీ రెడ్కో

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే జరుగుతోంది. ఎల్‌టీ, హెచ్‌టీ సర్వీసులు ఎన్ని ఉన్నాయి. ఎన్ని కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు అవసరమో ప్రతిపాదనలు సమర్పించి ప్రభుత్వానికి అందజేస్తాం. బడ్జెట్ కేటాయింపు జరగ్గానే టెండర్ల పిలికి పనులు చేపడతాం.

10న మార్వాడీల గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా సమావేశం

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్‌లో మార్వాడీల గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకించాలని నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశం పోస్టర్‌ను శనివారం కేయూలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోషియేషన్, స్వేరో స్టూడెంట్ యూనియన్ నేతలు ఉప్పుల శివ, ఎల్తూరి సాయికుమార్‌లు మాట్లాడారు. మార్వాడీలు తెలంగాణ అస్తిత్వాన్ని కించపరుస్తున్నారని, ఆర్థిక వనరులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్వాడీలు వ్యవహరించే తీరు సరికాదని విమర్శించారు. 10న రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శంకర్, బాలు, శశిధర్, సంపత్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే పేదలకు న్యాయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని మల్లారెడ్డిపల్లి, సిద్దాపూర్ గ్రామాలను శనివారం ఆకస్మికంగా సందర్శించి ఆయా గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను, పీఏసీఎస్ భవనాలను, రేషన్ షాపులను, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. మల్లారెడ్డిపల్లిలోని పాత పంచాయతీ భవనాన్ని పరిశీలించి దాని స్థానంలో మరో ప్రభుత్వ స్థలంలో కొత్త పంచాయతీ భవనాన్ని, ప్రాథమిక సహకార సంఘం నిర్మాణం కోసం గ్రామస్తులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. రేషన్‌షాపుల వద్ద లబ్ధిదారులకు సకాలంలో సన్నబియ్యం అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ చానల్ వేర్వేరుగా అమర్చి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామస్తుల అవసరాలను, అభిప్రాయాలను తెలుసుకొని ప్రతీ ఒక్కరికి ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అభివృద్ధి పథంలో మల్లారెడ్డిపల్లి గ్రామం ఒక మోడల్ గ్రామంగా కృషి చేస్తానని అన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ యుగందర్, పీఆర్ డీఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.


పీఆర్ డీఈ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాగరాజు

పోలీస్ కంట్రోల్ రూమ్

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్


కంట్రోల్ రూం సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సీపీ శనివారం సందర్శించి అత్యవసర కాల్స్ స్వీకరణ, స్పందించే విధానం, డయల్ 100 కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే ప్రతీ కాల్ అత్యంత జాగ్రత్తగా తీసుకొని తక్షణమే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్ధరాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహించే సమయంలో అధికారులను, సిబ్బందిని సమన్వయం చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతో విధులు నిర్వర్తించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు మరింత సేవ చేయడమే పోలీసుల లక్ష్యమన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా కంట్రోల్ రూమ్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నకిలీ దంత వైద్యులపై చర్య తీసుకోవాలి


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ పాలాల మనోరంజన్‌రెడ్డి, డాక్టర్ వేణుయాదవ్

వడ్డేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్ పట్టణ ప్రాంతాల్లో అర్హతలేని నకిలీ డెంటల్ డాక్టర్లపై చట్టపరంగా చర్య తీసుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పాలాల మనోరంజన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణు యాదవ్‌లు డీఎంహెచ్‌వోలను కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన కొందరు అర్హతలేని దంతవైద్యులు సోషల్ మీడియాలో అభూత కల్పనలతో కూడిన ప్రకటనలను ఇస్తూ సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని నమ్మబలికి నకిలీ దంత వైద్యులు ప్రజలను తప్పుదోవ పట్టించి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఐడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి.రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్లు జితేందర్, రమేష్‌బాబు, కార్తీక్, నవీన్, అభిలాష్, కిరణ్, శ్యాంసుందర్‌రెడ్డి, సాయిచరణ్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై బీజేపీ నేతల హర్షం

బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి క్షీరాభిషేకం


ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

రాంనగర్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): దీపావళి కానుకగా జీఎస్టీలో పలు సంస్కరణలు తీసుకరావడంపై శనివారం హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆదాయపు పన్ను తగ్గింపు, జీఎస్టీ తగ్గింపు వంటి ఆర్థిక సంస్కరణలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు చేశాయన్నారు. ప్రపంచంలోనే 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. త్వరలోనే 3 ఆర్థిక స్థానానికి చేరుకుంటుందన్నారు. ప్రజలు స్వదేశీ వస్తువుల వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు. ఈనెల 22 నుంచే జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి కాళీప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ చందర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీ మోర్చా నాయకుడు నాను నాయక్, నాయకులు నర్మెట్ట శ్రీనివాస్, శ్రీరాం రెడ్డి, ముత్యాల శ్రీనువాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రత్నలక్ష్మీ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంతోనే రైతులకు మేలు

హసన్‌పర్తి, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకంతోనే రైతులకు మేలు జరుగుతుందని ఏడీఏ ఆదిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ముచ్చర్ల శివారులో రైతు ఇనుగాల విష్ణువర్ధన్‌రెడ్డి పంట క్షేత్రంలో నానో యూరియా డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పెంబర్తి, ముచ్చర్ల, హసన్‌పర్తికి చెందిన 100 మంది రైతులకు డ్రోన్‌తో నానో యూరియా స్ప్రే విధానాన్ని వివరించారు. ఇఫ్‌కో కంపెనీ డ్రోన్‌తో తక్కువ ఖర్చుతో నానో యూరియా పిచికారి డెమో చేసి చూపించారు. ఈ సందర్భంగా ఏడీఏ ఆదిరెడ్డి మాట్లాడుతూ.. వరి పొట్ట దశలో నానో యూరియా పిచికారి చేసుకొని మంచి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. యూరియా వాడడం వల్ల ఎక్కువ నత్రజని లాస్ అవుతుందని ప్రతీ ఒక్క రైతు నానో యూరియా పిచికారి చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి అడ్లూరి అనురాధ, ఏఈవోలు జె.భాస్కర్, బీశైలజ, కల్పన, అనూష, సుమన్, రైతులు పాల్గొన్నారు.

పొట్లపల్లికి నమిలిగొండ స్మారక పురస్కారం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, రచయిత, ప్రసారిక సాహిత్య పత్రిక సంపాదకుడిగా పని చేసి మృతి చెందిన నమిలిగొండ బాలకిషన్‌రావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావుకు అందజేయనున్నారు. నమిలిగొండ స్మారక తొలి పురస్కారం పొట్లపల్లికి అందజేయడంతోపాటు పురస్కారం కింద రూ.5116 నగదు, జ్ఞాపిక , ప్రశంసాపత్రం అందజేయనున్నారు. ఇక నుంచి యేటా ఓ సాహితీ ప్రముఖుడిని ఎంపిక చేసి అవార్డును ప్రదానం చేయనున్నారు. నమిలిగొండ బాలకిషన్‌రావు (నబారా) ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పాంచల్‌రాయ్ ఈ మేరకు ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు.

ఘనంగా వినియోగదారుల ప్రతినిధుల దినం

హనుమకొండ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల ప్రతినిధుల దినం సందర్భంగా హనుమకొండ వడ్డెపెల్లిలోని వినియోగదారుల కార్యాలయంలో వినియోగదారుల రక్షణ చట్టం-2019-స్వదేశీ వినియోగంపై చైతన్య సదస్సు జరిగింది. వినియోగదారుల మండలి జాతీయ న్యాయ సలహాదారుడు రంగరాజు ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో భారత వినియోగదారల సమాఖ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్ కుమార్, సభ్యులు కె.రాజుకుమార్, జె.వీరేందర్, ఎం.రాజబాబు పాల్గొన్నారు. వినియోగదారుల సేవలో పాలుపంచుకుంటున్న డాక్టర్లు, లాయర్లు, ఆడిటర్లు వినియోగదారుల ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సదస్సు సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

అధ్యాపకుడు రాజ్‌కుమార్‌కు సత్కారం



త్యాగరాజ గానసభలో సత్కారం అందుకుంటున్న రాజ్‌కుమార్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, సినీ, రంగస్థల నటుడు, ప్రస్తుతం మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరశాస్త్రం అధ్యాపకుడిగా పనిచేస్తున్న సుంకనపల్లి రాజ్‌కుమార్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా జేసీఐ శుక్రవారం ఘనంగా సత్కరించింది. హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో పోస్టల్ శాఖ ఉన్నతాధికారి వెంకటేశ్వర్‌రావు, ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్, తదితర అనేక మంది ప్రముఖుల సమక్షంలో రాజ్‌కుమార్ చేస్తున్న సేవలను ప్రస్తుతిస్తూ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఘనంగా సత్కరించింది. 2007లో వరంగల్‌లోని జూనియర్ కళాశాలలో పనిచేసిన ఆయన.. ప్రస్తుతం మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు.

గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలి

మడికొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మడికొండలోని పూర్తిగా శిథిలమైపోయిన గ్రంథాలయాన్ని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సామాజిక కార్యకర్తలు ప్రకాష్, సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం వారు గ్రంథాలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. స్థానిక పెద్దలను కలిసి గ్రంథాలయ విరాలను అడిగి తెలుసుకున్నారు. లోటు పాట్లను అడిగి తెలుసుకున్నారు. తౌటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు, కె.కొమురయ్య, ఎ.రవి, బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు

సందడిగా ప్రభుత్వ ఉద్యోగుల పోటీలు

హాజరైన 50 మంది ఉద్యోగులు


షాట్‌పుట్ క్రీడలో పాల్గొన్న క్రీడాకారిణి

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఒక్కరోజుపాటు జేఎన్ఎస్‌లో పలు క్రీడాంశాల్లో పోటీలను ఘనంగా నిర్వహించారు. శనివారం జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. డీవైఎస్ఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఒక్కరోజుపాటు జేఎన్ఎస్‌లో సివిల్ సర్వీసెస్ పేరిట హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, క్యారం, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, ఖోఖో, లాన్ టెన్నిస్, టేబుల్‌టెన్నిస్, విభాగాల్లో స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 9, 10 తేదీల్లో హైదరాబాద్ జింఖానా గ్రౌండులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తారని అశోక్‌కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, బత్తిని జీవన్‌గౌడ్, ఎండి.అఫ్జల్, రమేశ్, నవీన్, దేవిక తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 99ని రద్దు చేయాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణతో మాల సమాజానికి విఘాతం కల్పిస్తున్న జీవో నంబర్ 99ని వెంటనే రద్దు చేయాలని జాతీయ మాల మహానాడు వరంగల్ పశ్చిమ ఇన్‌చార్జి పనికల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జాతీయ మాల మహానాడు జిల్లా ప్రతినిధులు గరిగె అనిల్, కడారి కుమారస్వామి, అంకేశ్వరపు రామన్నలు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సందర్భంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 99తో మాల కులస్తులు విద్యా, ఉద్యోగరంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. జీవోనంబర్ 99 తీసుకురావడానికి మూలకారకులైన ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడిలో భాగంగా ఈ నెల 8న బాలసముద్రంలోని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ మాల మహానాడు జిల్లా నాయకులు దండ్రె శ్రీనివాస్, మద్దెల సురేందర్, కాటిక ప్రవీణ్, యాడాల జగపతి, ఉసిల్ల దయాకర్, బొల్లం రాంకుమార్, ఉసిల్ల ఉదయ్, కూనమల్ల అనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

హసన్‌పర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ హసన్‌పర్తి జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయురాలు ఈసుమాదేవి అధ్యక్షతన గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎ.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. అనంతరం విద్యార్థులు, ఏఏపీసీ, వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు, తల్లిదండ్రులు ఎంఈవోతో పాటు ఉపాధ్యాయులను శాలువతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. అలాగే మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సమాజానికి, విద్యార్థులకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతుల పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

లంబాడీలపై దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

9న అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ సభ


ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లంబాడీలపై కోయ, గొండు తెగలకు చెందిన కొంత మంది స్వార్థ రాజకీయ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని, ప్రభుత్వం, ప్రతిపక్షాల వైఖరిని స్పష్టం చేయాలని లంబాడీ రాష్ట్ర జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రతినిధులు జైసింగ్ రాథోడ్, జాటోత్ కిషన్ నాయక్, వాంకుడోత్ వీరన్న నాయక్ మాట్లాడారు. ఎస్టీ రిజర్వేషన్లను కాపాడుకునేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా ఈ నెల 9న ఉదయం 11 గంటలకు బాలసముద్రంలోని రాణునాయక్ విగ్రహం నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించి సభను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో లంబాడీ జేఏసీ నేతలు పోరిక జవహర్‌లాల్, బానోత్ విద్యాసాగర్, వీఎస్ నాయక్, సమ్మయ్య రాథోడ్, బానోత్ వెంకన్న నాయక్, గుగులోత్ వీరమ్మ, వసంత్, గోపిసింగ్, అజ్మీరా వెంకట్‌నాయక్, భూక్యా శ్రావణ్, రామచంద్ర నాయక్ పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: రాష్ట్రంలో లంబాడీలు ఎస్టీలు కారని చేస్తున్న అసత్య ఆరోపణలను నిరసిస్తూ ఈనెల 9న హనుమకొండలో నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ మార్చ్‌కు తరలిరావాలని లంబాడీ రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ సమన్వయకర్తలు గుగులోత్ రాజునాయక్, అంగోత్ వినోద్‌లోక్ నాయక్‌లు పిలుపునిచ్చారు. శనివారం కేయూ గెస్ట్‌హౌస్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో రాజునాయక్, వినోద్‌లోక్ నాయక్‌లు మాట్లాడారు. సమావేశంలో జేఏసీ స్టీరింగ్ కమిటీ బాధ్యులు చందు, రవీందర్, రాజు, భిక్షపతి, రమేశ్, శ్రీరామ్, మురళి, మోహన్ పాల్గొన్నారు.

నేడు మెట్టుగుట్టపై ఆలయాల మూసివేత

మడికొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మడికొండ మెట్టుగుట్ట క్షేత్రంలోని మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలను మూసివేయనునన్నట్లు శనివారం దేవాదాయ శాఖ కార్యాలయం ప్రకటించింది. ఆదివారం రాత్రి 9:56 నిమిషములకు సంపూర్ణ చంద్రగ్రహణం సంభవిస్తున్నందున ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు పూజాదికములన్నీ నిర్వహించి ఆలయాలు మూసి వేయనున్నట్లు తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం దేవాలయాల శుద్ధి, సంప్రోక్షణ అనంతరం ఉదయం 9 గంటల నుంచి యథావిధిగా స్వామి వారల దర్శనములు, అభిషేకములు, అర్చనలు, నిత్య కైంకర్యములు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యాలయం తెలిపింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, చోటీ మజీద్, సుబేదారి ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, కేయూ సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌పుర మెయిన్‌రోడ్డు, కేయూ జంక్షన్‌లో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు.

నేడు పద్మశాలి పరపతి సంఘాల సమావేశం

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా, పట్టణ పద్మశాలి పరపతి సంఘాల సమావేశాన్ని ఆదివారం హనుమకొండ సుబేదారిలోని పద్మశాలి పరపతి సంఘం భవనంలో నిర్వహించనున్నట్లు మార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడు వైద్యం రాజగోపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం సమావేశానికి సంబంధించిన గోడ పత్రికలు ఆవిష్కరించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రముఖ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి హాజరవుతున్నారని, పరపతి సంఘాల నాయకులు హాజరుకావాలనిరాజగోపాల్ తెలిపారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

హసన్‌పర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలైన ఘటన శనివారం గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి పాత మార్కెట్ వీధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. హసన్‌పర్తికి చెందిన పప్పుల వీరలక్ష్మీ బంధువు పోచమ్మ చుట్టపు చూపుగా హసన్‌పర్తికి వచ్చింది. పోచమ్మ నడుచుకుంటూ వెళ్తుండగా గుంపులు.. గుంపులుగా ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో పోచమ్మకు పలు చోట్ల తీవ్ర గాయాలు కాగా స్థానికులు దాడి చేస్తున్న కోతులను బెదిరించడంతో పోచమ్మ ప్రాణాపాయం నుంచి బయటపడింది. అనంతరం స్థానికులు గాయపడిన పోచమ్మకు ప్రాథమిక చికిత్స అందించి ఆస్పత్రికి తరలించారు.

పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేద విద్యార్థులకు వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ గురుపూజోత్సవం సందర్భంగా చేయూతను అందించింది. ఈ మేరకు కేయూ కో ఎడ్యుకేషన్, మహిళ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 5గురు విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందచేశారు. వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు మర్రి రేణుక, వి.అర్చన, వ్యవస్థాపక సభ్యురాలు నేరేళ్ల శోభావతి, మాజీ కోశాధికారి పద్మశర్మల చేతుల మీదుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్ డబ్బులను అందచేసి అభినందించారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న వారిలో పులి విజ్ఞ, సోమ శివాణి, నైడ్ల అఖిల, ఎస్.శ్రావణి, గట్టు అభిజ్ఞలున్నారు. స్కాలర్‌షిప్‌లను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందిచారు.

నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే భవన నిర్మాణ అనుమతులు


న్యూ శాయంపేటలో ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

● నగరంలోని పలు చోట్ల క్షేత్రస్థాయి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మిస్తున్న భవనాలు నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే అనుమతులు జారీ చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శనివారం వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పరిశీలించారు. అక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం బాలసముద్రం, వడ్డెపల్లి, సుబేదారి, న్యూశాయంపేట ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి అక్కడి కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకునే వారు వాస్తవ సమాచారాన్ని, సూచించిన ధ్రువపత్రాలను జతచేయాలన్నారు. అధికారులు దర్యాప్తు చేసు సమయంలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు రజిత, ఇర్షాద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

10 వేల పైచిలుకు విగ్రహాల నిమజ్జనం

వరంగల్ నగరంలోని 22 చెరువుల వద్ద 10వేలకు పై చిలుకు వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంకా నగరంలో చాలా చోట్ల ఆలస్యంగా శోభయాత్రలు నిర్వహించడం వల్ల చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద కొంత సమయం ఇబ్బంది ఏర్పడిందని, అదనంగా సిబ్బందిని పిలిపించి ఆలస్యంగా వచ్చిన విగ్రహాలను నిమజ్జనం అయ్యాయని తెలిపారు. కిందటేడు 6,500 విగ్రహాలతో పోల్చుకుంటే ఈ యేడు విగ్రహాల సంఖ్య పెరిగిందన్నారు. 36 గంటల పాటు సిబ్బంది శ్రమకోర్చి సేవలందించారని కమిషనర్ తెలిపారు. సిబ్బంది సేవలను గుర్తిస్తామన్నారు.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
సైయారా	హిందీ చిత్రం	సెప్టెంబర్ 12
అమెజాన్ ప్రైమ్		
ది గర్ల్‌ఫ్రెండ్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 10
కూలీ	తమిళ చిత్రం	సెప్టెంబర్ 11
డూ యూ వన్నా పార్ట్‌నర్	హిందీ సిరీస్	సెప్టెంబర్ 12
జియో హాట్‌స్టార్		
బిగ్‌బాస్ 9	తెలుగు రియాలిటీ షో	సెప్టెంబర్ 07
రాంబో ఇన్ లవ్	తెలుగు సిరీస్	సెప్టెంబర్ 12

ఆరోగ్యానికి అరటి పువ్వు!



అరటికాయ ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలుసు. అయితే అరటి పువ్వుతోనూ ఆరోగ్య ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం..

- అరటి పువ్వులో కాల్షియం, పొటాషియం, ఐరన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి.
- పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.
- ఫైబర్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది.
- ఐరన్ రక్తహీనతను దూరం చేస్తుంది.
- అరటి పువ్వు తినడం వలన రక్తంలో చక్కర స్థాయులు కూడా నియంత్రణలో ఉంటాయి.

కాంబినేషన్లతో... కథ వెనుకబడింది!







సినీ రంగంలో ఎత్తుపల్లాలు సర్వసామాన్యం. వాటిని తట్టుకొని నిలబడిన వారే ఈ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలుగుతారు. అలాంటి ప్రయత్నం చేస్తున్న నిర్మాతే **అనిల్ సుంకర**. 'ఏ-టీవీ' ద్వారా వినోద రంగంలోకి అడుగుపెట్టిన అనిల్.. ఆ తర్వాత '14 రీల్స్' పతాకంపై అనేక విజయవంతమైన సినిమాలను నిర్మించారు. 'భోళాశంకర్' పరాజయంతో కొంత కాలం సినీ నిర్మాణానికి దూరంగా ఉన్నారు. మళ్లీ ఒక వినూత్నమైన రియాలిటీ షోతో, కొత్త చిత్రాలతో సెకండ్ ఇన్నింగ్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'తో తన అనుభవాలు పంచుకున్నారు.

మూడేళ్ల తర్వాత మళ్లీ రియాల్టీ షో ద్వారా సినీ నిర్మాణంలోకి ప్రవేశిస్తున్నారు కదా... ఎలా అనిపిస్తోంది?

బయట వాళ్లు ఏదేదో అనుకోవచ్చు. కానీ నేను ఇండస్ట్రీకి దూరంగా జరగలేదు. నాకు సినీ నిర్మాణంతో పాటు అనేక ఇతర వ్యాపారాలు ఉన్నాయి. సినీ నిర్మాణం అనేది వాటిలో పది శాతం మాత్రమే! అయితే గత మూడేళ్లగా అన్నీ మందకొడిగా సాగాయి. దీనితో ఒడుదొడుకులు ఏర్పడ్డాయి. కానీ నేను 25 ఏళ్ల నుంచి వ్యాపారాలు చేస్తున్నాను. ఇలాంటి ఒడుదొడుకులు సహజమే!

> **నాకు నచ్చిన కంటెంట్‌ను నమ్మి ఇకపై సినిమాలు తీస్తా. ఇతరుల అభిప్రాయాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కానీ కంటెంట్‌ను మనం పూర్తిగా నమ్మాలి. ఇతరులు అభిప్రాయాల మీదనే ఆధారపడకూడదనేది నా అభిప్రాయం. అంతేకాదు... ప్రేక్షకుల అభిరుచులు మారిపోతున్నాయి. దానికి తగ్గట్టుగా మనం కూడా మారాలి. ప్రేక్షకుల అభిరుచికి తగినట్లు మన కంటెంట్ ఉంటేనే విజయం సాధిస్తాం.**

'భోళాశంకర్' మీరు అనుకున్నట్లు విజయం సాధించలేదు కదా! ఆ సమయంలో మీరు ఎలా ఫీలయ్యారు?

'కర్ణుడి చావుకు కారణాలు కోటి' అంటారు.. అలా 'భోళాశంకర్' పరాజయానికి అనేక కారణాలు ఉన్నాయి. నా ఉద్దేశంలో ఈ సినిమా కొవిడ్‌కు ముందు విడుదలయితే మంచి విజయాన్ని సాధించేది. ఇది అజిత్ నటించిన ఒక తమిళ్ సినిమా. తమిళ్‌లో అది పెద్ద హిట్. అజిత్ సినీ జీవితంలో అతి ఎక్కువ కలెక్షన్లు సంపాదించింది. అందుకే ఈ సినిమాను ఎంపిక చేసుకున్నాం. కానీ కొవిడ్ వల్ల ఆ తమిళ సినిమాను ఓటీటీలలో అందరూ చూసేశారు. దానివల్ల కొంత ఆసక్తి తగ్గింది. ఇలా చెప్పుకుంటూపోతే అనేక కారణాలున్నాయి..

ఆ సినిమా పరాజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవిని కలిసారా? మీ సహనిర్మాతల రియాక్షన్ ఏమిటి?

సినిమా విడుదలకు ఒక రోజు ముందు చిరంజీవి గారితో మాట్లాడాను. "మీరు బాగా అలసిపోయారు. ఒక నాలుగైదు రోజులు విశ్రాంతి తీసుకోండి. అప్పుడు అన్నీ చూసుకుందాం" అన్నారు. సినిమా పరాజయం తర్వాత కూడా ఆయన ఇచ్చిన మద్దతు మరచిపోలేనిది. నా దగ్గర నుంచి ఒక్క పైసా కూడా తీసుకోలేదు. ఇక సహ నిర్మాతల విషయానికి వస్తే అందరూ నాకు మద్దతుగా నిలిచారు. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే- మేమందరం ఒకరికొకరు అండగా ఉంటాం. 'భోళాశంకర్' విడుదలకు ముందు రోజు ఇండస్ట్రీలో అనేకమంది నిర్మాతలు మా ఆఫీసుకు వచ్చారు. అలాగే నేను కూడా ఏదైనా సినిమా విడుదల ఉంటే వాళ్ల ఆఫీసుకు వెళ్తా. ఎందుకంటే- ఒక సినిమా హిట్ అయితే ఒక పాజిటివ్ వైబ్ వస్తుంది. మిగిలిన వాళ్ల సినిమాలు హిట్ అవుతాయి. ఇక... సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తూ ఉంటాయి. వాటిలో నిజం ఉండదు.

సినిమాతో కాకుండా రియాలిటీ షోతో మళ్లీ జర్నీ ఎందుకు మొదలుపెడుతున్నారు?

ఈ రియాలిటీ షోను కొవిడ్‌కు ముందు నుంచి డిజైన్ చేస్తున్నాము. ఇప్పుడు మంచి సమయం అనిపించింది. అంతకన్నా వేరే కారణం లేదు. ఈ షోను ప్రారంభిస్తున్నామని చెప్పగానే అనూహ్యమైన స్పందన వచ్చింది. అంత స్పందన వస్తుందని నేను అనుకోలేదు.

చిత్ర నిర్మాణానికి దూరంగా ఉన్నా... మీరు పరిశ్రమను గమనిస్తూనే ఉన్నారు కదా! ఈ మూడేళ్లలో ఏదైనా మార్పు వచ్చిందా?

ప్రతి ఏడాది పరిశ్రమ మారుతూనే ఉంటుంది. ఇది చాలా సహజం. ఇప్పుడు వీఎఫ్‌ఎక్స్‌లు ప్రవేశించాయి. కొత్త ప్రపంచాల నేపథ్యంలో సినిమాలు వస్తున్నాయి. భిన్నమైన కథలు సినిమాలు తీయాలనుకొనేవారికి ఇదొక మంచి సమయం.

> **ఓటీటీ వల్ల మంచే జరిగింది. అనేక భాషల్లో సినిమాలను చూసే అవకాశం ప్రేక్షకులకు లభించింది. దీని వల్ల వారి అభిరుచులు మారాయి. దానికి తగ్గట్టుగా పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కోణం నుంచి చూస్తే ఓటీటీ మంచి మార్పే తీసుకు వచ్చింది.**

మీరు మంచి సమయం అంటున్నారు.. కానీ భారీ సినిమాలు దెబ్బతింటున్నాయి. ప్రేక్షకులు థియేటర్లకు రావటం లేదని అనేకమంది చెబుతున్నారు...

దీన్ని మనం రెండు కోణాల నుంచి చూడాలి. ఒకటి- తెలుగు సినిమా పరిశ్రమ ప్రారంభం అయిన దగ్గర నుంచి సినిమాల సక్సెస్ రేట్ ఐదు నుంచి పదిశాతం మాత్రమే! అంటే వంద సినిమాలు విడుదలయితే- వాటిలో విజయం సాధించేవి పది సినిమాలు మాత్రమే! మిగిలినవన్నీ యావరేజ్‌గా వెళ్తాయి. ఇక రెండో కోణం నుంచి చూస్తే భారీ బడ్జెట్ సినిమాలు పరాజయం చెందటానికి అనేక కారణాలున్నాయి. 'బాహుబలి' విజయం తర్వాత అనేకమంది నిర్మాతలకు అనేక కొత్త మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. ఓటీటీల ద్వారా అదనపు ఆదాయం లభించటం మొదలైంది. ఇలాంటి అంశాల వల్ల సినిమా బడ్జెట్లు పెరిగిపోయాయి. ఒకప్పుడు దర్శకుడు కథను ఎంపిక చేసుకొని - ఆ తర్వాత నటీనటులను ఎంపిక చేసుకొనేవాడు. నిర్మాత డబ్బులు పెట్టేవాడు. కానీ ఒక దశలో హీరో, దర్శకుడి కాంబినేషన్ కుదిరితే చాలనుకున్నాం. కథ వెనకబడిపోయింది. నేను ఎవరినీ విమర్శించటం లేదు. ఇలా చేసిన వారిలో నేను కూడా ఉన్నాను. ఎప్పుడైతే కథ సరిగ్గా కుదరదో అప్పుడు ప్రేక్షకుడు దాన్ని ఆదరించడు. చాలా సినిమాలకు జరిగింది ఇదే!

ఒక సినిమా పరాజయానికి ఇదే కారణమా?

ఇదే కాదు. ఇంకా అనేక కారణాలుంటాయి. ఉదాహరణకు సినీ నిర్మాణంలో జరిగే వృథా. అది రకరకాలుగా ఉంటుంది. దానివల్ల బడ్జెట్ విపరీతంగా పెరిగిపోతుంది. కాస్ట్ రికవరీ కాదు. మీకు ఒక ఉదాహరణ చెబుతాను. నేను తీసిన ఒక సినిమాలో క్లైమాక్స్‌లో ఒక ఊరేగింపు సీను ఉంటుంది. దాన్ని నాలుగు రోజులు తీయాలన్నారు. రోజుకు 30 లక్షల బడ్జెట్ ఇచ్చారు. మొదటి రోజు షూటింగ్ పూర్తయింది. రెండో రోజు షూటింగ్‌కు వెళ్లాను. అక్కడ చాలామంది ఖాళీగా కూర్చుని ఉన్నారు. 'వీళ్లందరు ఖాళీగా ఎందుకున్నారు?" అని అడిగితే వాళ్ల షూటింగ్ కాలేదన్నారు. ఇక్కడ సమస్య ఏమిటంటే- వీళ్లందరికీ మొదటి రోజు నుంచి లెక్కపెట్టి వేతనాలు ఇవ్వాలి. ఇలాంటి వృథా వల్ల నిర్మాతకు తడిసి మోపెడు అవుతోంది. వాటిని తగ్గించుకుంటే నిర్మాణ వ్యయం నియంత్రణలోకి వస్తుంది.

అది సాధ్యమవుతుందా? కార్మికులకు వేతనాలు పెంచటానికి నిర్మాతలు అంగీకరించారు కదా...

ఈ మధ్య నిర్మాతలలో కూడా అవగాహన బాగా పెరిగింది. ఈ ఖర్చులన్నీ నియంత్రణలోకి వస్తాయనే నమ్మకం నాకుంది. అంతేకాకుండా ఏఐ వల్ల సమీప భవిష్యత్తులో అనేక మార్పులు వస్తాయి. ఉదాహరణకు ఏఐ పూర్తిగా అభివృద్ధి చెందితే సెట్స్ వల్ల అయ్యే అదనపు ఖర్చులు ఉండవు. ఇలాంటి మార్పులు చాలా వస్తాయి.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అందానికి మొక్కజొన్న

మొక్కజొన్నను చాలామంది ఇష్టంగా తింటారు. దానితో వంటలూ చేస్తారు. అయితే మొక్కజొన్న అందాన్ని పెంచడంతో సహాయపడుతుందని తెలుసా..? ఆ వివరాలు తెలుసుకుందాం...



- మొక్కజొన్నలో విటమిన్ ఎ, సి, డి ఉంటాయి. ఇవి చర్మం మీది నల్లటి మచ్చలను తగ్గిస్తాయి.
- విటమిన్ ఇ చర్మం పొడిబారే సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
- కాపర్, జింక్, పాస్ఫరస్, మెగ్నీషియం వంటి ఖనిజాలు ముడతలు, మచ్చలను మాయం చేస్తాయి.
- విటమిన్ ఇ పొడిబారకుండా సహాయపడుతుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గిస్తాయి.
- మొక్కజొన్నలోని కొన్ని రకాల అమైనో ఆమ్లాలు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మం కాంతివంతంగా మారేలా చేస్తాయి.

ఇలా వాడాలి:

- మొక్కజొన్న పిండిలో కొంచెం తేనె, పాలు కలిపి పేస్టులా చేయాలి. దీనిని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని పదిహేను నిమిషాల తరువాత కడిగేయాలి. దీని వలన చర్మం మృదువుగా మారుతుంది.
- మొక్కజొన్న పిండిలో పసుపు, పెరుగు వేసి కలిపి మెత్తని మిశ్రమంగా చేసుకుని ముఖానికి రాసుకుని 20 నిమిషాల తరువాత కడిగేసుకోవాలి. ఇలా చేయడం వలన చర్మం మీది మచ్చలు పోయి, ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.
- ఒక గిన్నె మొక్కజొన్న పిండి, తేనె, కొంచెం నిమ్మరసం, నీరు కలిపి పేస్టులా చేసుకోవాలి. దీనిని ముఖానికి, మెడకు రాసి సున్నితంగా రుద్దాలి. దీని వలన చర్మం మీద మృతకణాలు తొలగిపోతాయి.
- మొక్కజొన్న పిండిలో కీరదోస గుజ్జును కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి. అరగంట తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్ చర్మం తేమను కోల్పోకుండా సహాయపడుతుంది.

సెలబ్ టాక్

సీరియల్ క్వీన్

పదిహేడేళ్లకే కెరీర్ ప్రారంభమైంది. బుల్లితెర మీదుగా ప్రయాణిస్తూ... వెండితెరపై అలరిస్తూ... భారత వినోద పరిశ్రమలో తిరుగులేని ఒక బ్రాండ్‌గా ఎదిగింది. యాభై ఏళ్ల జీవిత గమనం... ముప్పై ఏళ్లుగా పరిశ్రమతోనే కలిసి ప్రయాణం. 'బాలాజీ టెలీఫిలిమ్స్ లిమిటెడ్' అధినేత... ధారావాహికలకు వినూత్న హంగులు అద్దిన పారిశ్రామికవేత్త... ఏక్తా కపూర్ జైత్రయాత్ర ఇది.

'మహిళలకు ఓదార్పు బహుమతులు (కన్సొలేషన్ ప్రైజెస్) అక్కర్లేదు. కావల్సింది సమాన వేదిక, సమాన స్థాయి, సమాన అవకాశాలు. అవి అందిన రోజు వారి ఎదుగుదలను ఎవరూ ఆపలేరు'... ఇది ఏక్తా కపూర్ మాట. సగటు సినీ వారసులకు భిన్నం ఆమె. నిన్నటి తరం హీరో జితేంద్ర, శోభా కపూర్ కుమార్తెగా వెండితెరపై ఒదిగిపోవాలని ఆమె కలలు కనలేదు. ఒకరిపై ఆధారపడకుండా... స్వశక్తితో ఎదగాలని పరితపించారు.

"వెనక్కి తిరిగి చూసుకొంటే... కొంత అల్లకల్లోలం, కొన్ని కొత్త మలుపులు, మరికొన్ని అద్భుత సందర్భాలతో కూడిన సుదీర్ఘ ప్రయాణం ఇది. కెరీర్‌ను నిర్మించుకొనే క్రమంలో ఈ మూడు దశాబ్దాల్లో... విభిన్న దశల్లో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. అన్నిటినీ తట్టుకొని నిలబడటమే నా విజయ రహస్యం అని భావిస్తున్నా" అంటున్న ఏక్తా డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే తన కెరీర్‌కు పునాదులు వేసుకున్నారు. నిర్మాత, దర్శకుడు కైలాష్ సురేంద్రనాథ్ వద్ద ఇంటర్న్‌షిప్ చేశారు. 1994లో 'బాలాజీ టెలీఫిలిమ్స్' నెలకొల్పాక తండ్రి నుంచి ఆర్థిక సాయం తీసుకొని నిర్మాతగా మారి, హిందీ ధారావాహికలు తీశారు. మొదటి ఆరు పైలెట్ ప్రాజెక్టులు విజయవంతం కాలేదు. వాటిని ప్రసారం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆర్థికంగా నష్టపోయారు. అయితే మరుసటి ఏడాది చేపట్టిన 'మానో యా న మానో' సీరియల్, 'ధున్ ధమాకే' మ్యూజిక్ షోలు దూరదర్శన్, ఇతర చానల్‌లో ప్రసారమయ్యాయి. అదే సంవత్సరం వచ్చిన 'హమ్ పాంచ్'తో తొలిసారి విజయం రుచి చూశారు ఏక్తా. విద్యాబాలన్ తదితరులు అందులో నటించారు. 1995లో మొదలైన ఆ సీరియల్ నాలుగేళ్ల కొనసాగింది. ఇక అక్కడి నుంచి వరుస ప్రాజెక్టులతో దూసుకుపోయారు ఆమె. ఎంతగా అంటే... ఒకానొక సమయంలో దేశంలోని చానల్స్‌లో ప్రసారమయ్యే 50 షోస్‌లో 38 'బాలాజీ టెలీఫిలిమ్స్' నిర్మించినవే.



ఒడుదొడుకులు దాటి...

సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం, అంతుపట్టని వ్యూహాలతో అడుగులు వేయడం ఏక్తా నైజం. అదే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. కానీ ఆ దూకుడే తరువాత వరుస పరాజయాలకు కూడా కారణమైంది. షూటింగ్‌లో అవసరానికి మించి ఖర్చు, ఆఖరి నిమిషంలో కంటెంట్‌లో కట్‌లతో బడ్జెట్ అమాంతం పెరిగిపోయేది. మారుతున్న ప్రేక్షకుల అభిరుచిని అంచనా వేయడంలో విఫలమవడం, ఏకపక్ష నిర్ణయాలవల్ల నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ఆమె తీరుతో బడా టీవీ చానల్స్‌తో సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయినా ఏక్తా డీలా పడిపోలేదు.

'కె' సెంటిమెంటు...

కెరీర్‌లో ఎదురుదెబ్బల ఫలితం కావచ్చు... ఉన్నట్టుండి ఏక్తా ఆధ్యాత్మికత వైపు మళ్లారు. 'కె' అనే అక్షరం ఆమెకు సెంటిమెంట్‌గా మారింది. 'క్యోం కీ సాస్...' హిట్ తరువాత ఆ సెంటిమెంటు మరింత బలపడింది. 'కహానీ ఘర్ ఘర్ కీ, కభీ సౌతన్ కభీ సహేలీ, కోహి అప్నా సా, కసౌటీ జిందగీ కే'... ఇలా 'కె' అక్షరంతో మొదలయ్యే పేర్లతో వరుస ధారావాహికలు వచ్చాయి. 2001లో 'బెస్ట్ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు కూడా ఆమెకు దక్కింది. 'బాలాజీ మోషన్ పిక్చర్స్' పేరిట సినీ నిర్మాణం కూడా మొదలుపెట్టారు. 2008లో 'బాలాజీ టెలిఫిలిమ్స్' నిర్మించిన ఎనిమిది హిందీ షోస్ వివిధ చానల్స్‌లో ప్రసారమయ్యాయి. ఇతర తెలుగు, తమిళం తదితర భాషల్లో కూడా డబ్బింగ్ అయ్యాయి. అయితే తరువాతి కాలంలో అనూహ్యంగా సంస్థ రూ.14 కోట్లు నష్టపోయింది. ఓ బడా చానల్‌తో ఒప్పందం రద్దయింది. అదేసమయంలో టీవీ పరిశ్రమ సమ్మెతో పరిస్థితి మరింత దిగజారింది. అప్పటివరకు ఆమె పడిన శ్రమ వృథా అయింది.

అమ్మేయాలంటూ సలహాలు...

'బాలాజీ టెలీఫిలిమ్స్ లిమిటెడ్'గా ఎదిగిన కంపెనీ ఒక్కసారిగా నష్టాల్లోకి వెళ్లిపోవడంతో ఏక్తాపై రకరకాల వ్యాఖ్యలు. స్టాక్ ఎనలిస్టులు అయితే సంస్థను అమ్మేయమని ఉచిత సలహాలు ఇచ్చారు. అంతటి గందరగోళ పరిస్థితుల్లో కూడా తడబడలేదు ఆమె. దాన్ని ఒక సవాలుగా స్వీకరించి ధైర్యంగా ముందుకు సాగారు. లోపాలను సరిదిద్దుకొంటూ మళ్లీ సంస్థ నిర్మాణాన్ని మొదలుపెట్టారు. మరోవైపు బాలీవుడ్‌లోనూ 'ది డర్టీ పిక్చర్, వీర్ ది వెడ్డింగ్, లైలా మజ్నూ, క్రూ' తదితర హిట్ సినిమాలతో తనదైన ముద్ర వేశారు. 2017లో అంటే భారత్‌లో 'నెట్‌ఫ్లిక్స్' ప్రారంభమైన ఏడాదికి 'ఆల్ట్ బాలాజీ' పేరుతో వీడియో ఆన్ డిమాండ్ ప్లాట్‌ఫామ్ నెలకొల్పారు ఏక్తా. ఇది మంచి లాభాలు ఆర్జించి పెట్టింది. అయితే కంటెంట్ అభ్యంతరకరంగా ఉందంటూ పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఏక్తా, ఆమె తల్లి శోభ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మాత్రం సంస్థను విజయ పథంలో నడిపిస్తున్నారు. వినోద రంగంలో ఆమె చేసిన సేవలకు గానూ 2020లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు.

> **బిడ్డకు తల్లి... కానీ...**
>
> ప్రత్యర్థులకు అందనంత ఎత్తుకు సంస్థను తీసుకువెళ్లిన ఏక్తా వ్యక్తిగత జీవితం కూడా అనూహ్యంగానే ఉంటుంది. వైవాహిక బంధంపై ఆసక్తి లేని ఆమె 2019లో సరోగసీ ద్వారా మగ బిడ్డకు జన్మనిచ్చారు. అప్పుడే కాదు, సంస్థను నడిపే క్రమంలో, తన ఆహార్యం, ఆకారం విషయంలోనూ ఎన్నో విమర్శలు, అవహేళనలు ఎదుర్కొన్నారు. "నా రూపంపైనే కాదు, నేను ధరించే వస్త్రాల గురించి, ఆఖరికి నా కేశాల గురించి కూడా వెటకారంగా, చులకనగా మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఇలాంటివి వినీ వినీ నా చర్మం మొద్దుబారిపోయింది. కానీ వీళ్లందరికీ నేను సాధించిన అపురూప విజయాలు కనిపించవు" అంటారు ఏక్తా.




వింటేజ్ హంగులతో ఇల్లు అందంగా...

ఇంటిని పాతకాలపు వస్తువులు, ఫర్నిచర్‌తో అలంకరించుకుంటూ వింటేజ్ హంగులద్దే ట్రెండ్ క్రమంగా పెరుగుతోంది. ఇలా వింటేజ్ లుక్‌తో ఇంటిని సరికొత్తగా ఎలా తీర్చిదిద్దుకోవాలో తెలుసుకుందాం...



- ఒకప్పుడు అందరూ తమ ఇంట్లో.. ముఖ్యంగా ముందుగది, పడకగదుల్లోని గోడలకు ఫొటో ఫ్రేములు ఏర్పాటు చేసుకునేవారు. అలాగే ఇప్పుడు కూడా అప్పటి కాలానికి సంబంధించిన బ్యాండ్, మ్యూజిక్ పోస్టర్లు; వింటేజ్ కార్లు, బైకుల పోస్టర్లు లాంటివి సేకరించి గోడలకు అంటించుకోవచ్చు. ప్రస్తుతం ఇలాంటి ఎన్నో రకాల పోస్టర్లు అందుబాటులో ఉన్నాయి. కుటుంబ సభ్యులతో కలిసి తీయించుకున్న పాత ఫొటోను అందంగా ఫ్రేమ్ కట్టించి హాల్లో పెట్టుకున్నా చక్కని వింటేజ్ లుక్ వస్తుంది.
- ఇంటి గోడలను ఖరీదైన వాల్ పెయింటింగ్స్‌తో నింపే బదులు ఒకప్పుడు ఎంతో ఆదరణ పొందిన రెట్రో ప్రింట్స్, నేచర్ థీమ్ వాల్ పేపర్లు, యానిమల్ ప్రింటెడ్ పేపర్లను తెచ్చి అంటిస్తే గత జ్ఞాపకాలను తాజాగా గుర్తు చేసుకోవచ్చు.
- ఒకప్పుడు మనం విరివిగా ఉపయోగించిన రాగి, ఇత్తడి వస్తువులను ఇంటి అలంకరణలో భాగం చేయవచ్చు. రెండు చెవుల గంగాళం ఇంట్లో ఉంటే దాన్ని శుభ్రం చేసి నిండా నీళ్లు నింపి అందులో రంగురంగుల పూలు పేర్చి హాల్లో ఎదురుగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది ఇంటికి అందమైన వింటేజ్ శోభను అందిస్తుంది. రాగి లేదా ఇత్తడి గ్లాసులను ఫ్లవర్ వాజ్‌లుగా మార్చి ఇంట్లో అక్కడక్కడా పెట్టవచ్చు. ఇలాంటి లోహపు వస్తువులు ఎన్నో ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్నాయి కూడా. పాత గ్రామ్‌ఫోన్, రేడియో, టీవీ లాంటి వాటిని ఒక టేబుల్‌మీద అందంగా అమర్చినా ఇంటికి చక్కని కళ వస్తుంది.
- కాటన్, లినెన్, జ్యూట్, చేనేత వస్త్రాలతో రూపొందించిన కర్టెన్లు, సోఫా కవర్లు, దిండు కవర్లు, దుప్పట్లు లాంటివి ఉపయోగిస్తే ఇంటికి పాతకాలపు అందం వచ్చేస్తుంది. పెద్ద పెద్ద పూలు, ప్రింటు అప్పటి ప్రత్యేకతలు.
- చెక్కతో రూపొందించిన బీరువాలు, కుర్చీలు, టేబుల్స్, టీపాయ్, బుట్ట ఉయ్యాల, చిన్న నిచ్చెన లాంటివి పాతకాలపు ఇంటి అందాలు. వీటితోపాటు విండ్ చైమ్స్, షాండ్లియర్స్, గోడ గడియారాలను అందంగా అలంకరించుకుంటే వింటేజ్ హోమ్ కళ ముందు నిలుస్తుంది.



స్నేహితుడిపై పగతోనే ముంబైలో
మానవబాంబులని బెదిరింపు

» పోలీసులకు మెసేజ్ పంపిన వ్యక్తి అరెస్టు



నొయిడా, సెప్టెంబరు 6: ముంబైలో తీవ్ర కలకలం రేపిన.. మానవ బాంబులతో వరుస పేలుళ్ల బెదిరింపులకు సంబంధించి అశ్విన్ కుమార్ సుప్ర(50) అనే వ్యక్తిని ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాలో పోలీసులు అరెస్టు చేశారు. వృత్తిరిత్యా జ్యోతిష్యుడైన అశ్విన్ కుమార్ తన స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకునేందుకు అతడి పేరు మీద ముంబై పోలీసులకు బాంబు బెదిరింపు మెసేజ్ పంపినట్టు పోలీసులు గుర్తించారు. లష్కరే జిహాదికి చెందిన 14 మంది ముంబైలోకి ప్రవేశించారని, 400కిలోల ఆర్డీఎక్స్‌ను 34 వాహనాల్లో అమర్చామని వినాయక నిమజ్జనోత్సవం రోజున వాటిని పేలుస్తామంటూ ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్ హెల్ప్‌లైన్‌కు శుక్రవారం ఓ బెదిరింపు మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమై దర్యాప్తు చేపట్టిన ముంబై పోలీసు యంత్రాంగం ఆ సందేశాన్ని పంపిన అశ్విన్ కుమార్‌ను నొయిడా పోలీసుల సాయంతో అరెస్టు చేసింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దాని ప్రకారం.. బిహార్‌కు చెందిన ఫిరోజ్ అనే స్నేహితుడు పెట్టిన కేసులో అదే రాష్ట్రానికి చెందిన అశ్విన్ కుమార్ 2023లో మూడు నెలలు జైలులో గడిపాడు. అప్పట్నించి ఫిరోజ్‌పై అశ్విన్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఫిరోజ్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు అతడి పేరు మీద ముంబై పోలీసులకు బెదిరింపు మెసేజ్ పెట్టాడు. అశ్విన్ కుమార్ నుంచి ఏడు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, ఆరు మెమురీ కార్డులు, రెండు డిజిటల్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మారణాయుధాలతో గంజాయి రవాణా

» ఎస్కార్ట్ వాహనాలతో పకడ్బందీగా దందా
» తెలంగాణ మీదుగా మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌కు
» తనిఖీ బృందాలపై దాడులకు వెనుకాడని ముఠాలు
» రోడ్డు మార్గాల్లో సోదాలు పెరగడంతో రైళ్లపై దృష్టి
» ఈ ఏడాది ఇప్పటిదాకా 880 కేసులు.. 1,625మంది అరెస్టు

ఒడిసాలో గంజాయి కొని కేరళకు బయలుదేరిన ముఠా.. ఎస్కార్ట్‌గా ఓ కారును ఏర్పాటు చేసుకుంది. వెనుకాలే సరుకు రవాణా వాహనంలో గంజాయిని తరలిస్తుండగా.. పాల్వంచ వద్ద ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పట్టుకుంది. ఆ వాహనంలో 106 కిలోల గంజాయితో పాటు ఒక పిస్తోలు, 5 రివాల్వర్లు, 40 బుల్లెట్స్ లభించాయి. 15 రోజుల క్రితం ఈ ఘటన జరగ్గా.. ఎక్సైజ్ అధికారులే ఉలిక్కిపడ్డారు. నిందితులపై వందపైగా కేసులున్నా గంజాయి స్మగ్లింగ్‌ను ఆపలేదని, తనిఖీ బృందాలపై దాడులకు సైతం ఆ ముఠా వెనుకాడడం లేదని తెలిసింది.

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కోసం ఆయా ముఠాలు.. రోజు రోజుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఇప్పటిదాకా కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువుల్లో చాటుమాటుగా రవాణా సాగించిన అక్రమార్కులు.. ఇప్పుడు ఎస్కార్ట్ వాహనాలను ఉపయోగిస్తూ దర్జాగా దందా కొనసాగిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మారణాయుధాలను వెంట తెచ్చుకుంటూ.. తనిఖీ బృందాలపై దాడులకు సైతం తెగబడుతున్నారు. రోడ్డు మార్గాల్లో విస్తృతంగా సోదాలు జరుగుతుండడంతో రైళ్ల ద్వారా రవాణాకు మొగ్గు చూపుతున్నారు. గంజాయి, సింథటిక్ డ్రగ్స్ రవాణాను అడ్డుకోవడానికి తెలంగాణ ఎక్సైజ్, టీజీ న్యాబ్, ఈగల్ బృందాలు నిరంతరం కృషి చేస్తున్నా.. అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. గంజాయి సాగులో మొదటి స్థానంలో ఏపీ, ఆ తర్వాతి స్థానంలో ఒడిసా ఉన్నట్లు డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) గణాంకాలు చెబుతున్నాయి. ఎకరాకు రూ.50వేల చొప్పున ఇచ్చి ఏజెన్సీ ప్రాంత గిరిజనులతో గంజాయి సాగు చేయిస్తున్న అక్రమార్కులు.. ఆ గంజాయిని గోవా, మహారాష్ట్ర, చెన్నై, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు రవాణా చేయడం ద్వారా రూ.10 లక్షల పైగా సంపాదిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ విభాగాలు పేర్కొంటున్నాయి.

ఎస్కార్ట్ వాహనాలను వినియోగించడమే కాదు.. తాజాగా గంజాయి రవాణాకు మారణాయుధాలను వినియోగిస్తున్న సంగతి బట్టబయలు కావడంతో ఎక్సైజ్, పోలీసు శాఖలు ఆందోళన చెందుతున్నాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు చేపట్టిన తనిఖీల్లో 428 కిలోల గంజాయి, 419 కిలోల హషీష్ ఆయిల్, 26 గ్రాముల ఏడీఎం, 19 గ్రాముల కొకైన్, 134 గెల్ ఎస్‌డీ బ్లాస్ట్స్, కిలో గంజాయి చాక్లెట్స్, 106 గంజాయి మొక్కలు, 1.5కిలోల అల్ప్రాజోలం పట్టుకున్నారు. ఈ మేరకు 98 కేసులు నమోదు చేసి 156 మందిని అరెస్ట్ చేశారు. 48 వాహనాలను సీజ్ చేశారు. పట్టుకున్న డ్రగ్స్, గంజాయి విలువ రూ.3కోట్లపైనే ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారుల అంచనా. 2025 జనవరి నుంచి చూస్తే 880 కేసులు నమోదు చేసి.. 1625 మందిని అరెస్ట్ చేశారు. 3681 కిలోల గంజాయి, 66.22 కిలోల గంజాయి చాక్లెట్లు, 44 గ్రాముల కొకైన్, 105 గ్రాముల హషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదవుతూ..కఠిన శిక్షలు పడుతున్నా గంజాయి రవాణా మాత్రం ఆగడంలేదు.

రూటు మార్చి.. ఏమార్చి..

రోడ్డు మార్గాల ద్వారా గంజాయి రవాణాను నిరోధించడానికి వివిధ రాష్ట్రాల పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు సంయుక్త ఆపరేషన్లు చేపడుతుండడంతో స్మగ్లర్లు రైళ్లపై దృష్టి పెట్టారు. ఒడిసా నుంచి ఏపీ, తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు వెళ్లే రైళ్లను గంజాయి రవాణాకు ఎంచుకుంటున్నారు. వీటిలో ప్రధానంగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్, ఎల్‌టీటీ, విశాఖ-మహబూబ్‌నగర్, నవజీవన్, దేవగిరి, గోదావరి, విశాఖ ఎక్స్‌ప్రెస్, నాగావళి, హైదరాబాద్ డెక్కన్ రైళ్ల ద్వారా ఈ ఏడాదే కోట్ల రూపాయల విలువైన గంజాయిని రవాణా చేసినట్లు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రైల్వే పోలీసులు, ఈగల్ బృందాలు జరిపిన దాడుల్లో ఏడాది కాలంలో 2,327కిలోల గంజాయి పట్టుబడింది. మొత్తం 116 కేసులు నమోదు చేసి, 147మందిని అరెస్టు చేశారు. అయితే, గంజాయి స్మగ్లర్లు నేరుగా రంగంలో దిగకుండా నిరుద్యోగ యువత, చిరువ్యాపారులను కొరియర్లుగా వాడుకుంటున్నారు. 10-15కిలోల గంజాయి పార్సిళ్లను గమ్యస్థానానికి చేరిస్తే.. రూ.10వేల చొప్పున అందజేస్తున్నారు. కుటుంబం మొత్తానికి ఏసీ కోచ్‌ల్లో టికెట్లు బుక్ చేసి మరీ.. గంజాయిని తరలిస్తున్నట్లు ఈగల్ బృందాల సోదాల్లో బయటపడింది. ఈ క్రమంలో ఎక్కడా సూత్రధారుల పేర్లు బయటపడకుండా పక్కా నెట్‌వర్క్‌తో దందా సాగిస్తున్నట్లు వెల్లడైంది. ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల నిరంతర నిఘాతో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం తెలిపారు.

సైమా విజేతలు

● సత్తా చాటిన 'పుష్ప 2'.. 'కల్కి'


అశ్వనీదత్, కమల్ హాసన్


రష్మికకు అవార్డు అందిస్తున్న సుమలత


భాగ్యశ్రీ బోర్సేకు అవార్డు అందిస్తున్న ఖుష్బూ

దుబాయ్ వేదికగా 13వ 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ (సైమా) వేడుక ఘనంగా జరిగింది. తొలి రోజు తెలుగు, కన్నడ చిత్రాలకు అవార్డులు అందజేసి విజేతలను ప్రకటించారు. ఉత్తమ చిత్రంగా 'కల్కి 2898 ఏడీ' ఎంపికైంది. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా రష్మిక అవార్డులను అందుకున్నారు. ఉత్తమ దర్శకుడిగా సుకుమార్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఉత్తమ సహాయ నటుడిగా అమితాబ్ బచ్చన్, ఉత్తమ ప్రతినాయకుడిగా కమల్ హాసన్ అవార్డులను కైవసం చేసుకున్నారు. ఉత్తమ నటుడిగా తేజ సజ్జా, ఉత్తమ నటిగా మీనాక్షీ చౌదరి, ఉత్తమ దర్శకుడిగా ప్రశాంత్ వర్మ క్రిటిక్స్ విభాగంలో పురస్కారాలు దక్కించుకున్నారు. నిర్మాత అశ్వనీదత్‌ను ప్రైడ్ ఆఫ్ తెలుగు సినిమా అవార్డు వరించింది. ఉత్తమ నూతన నిర్మాతగా నిహారిక, ఉత్తమ నూతన నటిగా భాగ్యశ్రీ బోర్సే అవార్డు అందుకున్నారు. 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ చిత్రాలు' అత్యధిక అవార్డులతో సత్తా చాటాయి.


అల్లు అర్జున్, రాక్‌లైన్ వెంకటేశ్


సతీమణి తబితతో సుకుమార్


నిహారిక, సుమలత, మీనాక్షీ చౌదరి



యాక్షన్ అడ్వెంచర్‌గా తీర్చిదిద్దాం

కార్తీక్ ఘట్టమనేని



'చిన్నప్పటి నుంచి వింటున్న పురాణ, ఇతిహాస గాథలే 'మిరాయ్' సినిమాకు స్ఫూర్తి. మన మూలాలున్న కథ కాబట్టి ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ తెరకెక్కించిన చిత్రమిది. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కార్తీక్ మీడియాతో ముచ్చటించారు.

● మన సాంస్కృతిక మూలాలను స్పృశిస్తూ సాగే ఓ సూపర్ హీరో గాథగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. మానవాళి మనుగడకు వచ్చే ముప్పునకు పరిష్కారం పురాణేతిహాసాల్లో ఉంటుందనే లైన్ చుట్టూ అల్లుకున్న కథ ఇది. యాక్షన్ అడ్వెంచర్‌గా తీర్చిదిద్దాం. నటీనటులందరినీ రియల్ లొకేషన్లకు తీసుకెళ్లి చిత్రీకరణ చేశాం. దేశ విదేశాల్లోని ఎడారులు, అడవులు, మంచుపర్వతాల్లో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి చిత్రీకరణ చేశాం. ఇందులో చైనీస్ చిత్రాల తరహాలో ఫాస్ట్ యాక్షన్‌ను ట్రై చేశాం.

● తేజ ఈ సినిమా కోసం థాయ్‌లాండ్‌లో యుద్ధ విద్యల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అలాగే మనోజ్‌కు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం ఉండడంతో ప్రతినాయక పాత్రకు ఆయన్ను తీసుకున్నాం.

హాలీవుడ్ సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది

సాహు గారపాటి



'కిష్కింధపురి' లాంటి హారర్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రాలేదు. ప్రేక్షకులు కచ్చితంగా థ్రిల్ అవుతారు. వారిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే అంశాలు చాలా ఉన్నాయి. హాలీవుడ్ సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది' అని నిర్మాత సాహు గారపాటి అన్నారు. ఈ నెల 12న విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

● చాలా ఇంట్రస్టింగ్ హారర్ బ్యాక్‌డ్రాప్ ఉన్న కథ ఇది. ఇప్పటివరకూ హారర్ జానర్‌లో చాలా కథలు వచ్చాయి. కానీ ఇది సరికొత్తగా ఉంటుంది. ఒక రేడియో నుంచి వచ్చే వాయిస్, దాని చుట్టూ ఉండే హారర్ ఎలిమెంట్స్ ఆధారంగా దర్శకుడు అద్భుతంగా మలిచారు. ద్వితీయార్థంలో సినిమా సీరియస్ హారర్ ఫిల్మ్‌గా టర్న్ అవుతుంది.

● సాయి శ్రీనివాస్‌కు ఇది తొలి హారర్ చిత్రం. తన నటనతో కథకు పూర్తి న్యాయం చేశారు. కౌశిక్ కథను అద్భుతంగా చెబుతాడు. మోడరన్ ఫిల్మ్ మేకింగ్ స్టయిల్‌తో సినిమాని తీశారు. అనుపమా పరమేశ్వరన్‌కు చాలాకాలంగా ఓ హారర్ సినిమా చేయాలనుంది. ఈ కథ వినగానే ఓకే చెప్పారు. బాలకృష్ణగారు, అనిల్ రావిపూడి కలయికలో ఓ సినిమా చేయాలనుకుంటున్నాం.

దర్శకుడి సృజనాత్మకతను అర్థం చేసుకోవాలి

డీవోపీ జగదీష్



'చిత్ర దర్శకుడితో డీవోపీ బాగా కనెక్ట్ అవ్వాలి. ఆయన సృజనాత్మకతను అర్థం చేసుకోవాలి. అప్పుడే సినిమా అద్భుతంగా తెరకెక్కుతుంది' అని అన్నారు కెమెరామెన్ జగదీష్ చీకటి. ఆయన డీవోపీగా వ్యవహరించిన 'అర్జున్ చక్రవర్తి' సినిమా ఇటీవలె విడుదలై విజయవంతంగా థియేటర్లలో నడుస్తోంది. ఈ సందర్భంగా జగదీష్ చిత్ర విశేషాలను మీడియాకు వివరించారు. 'మన దేశంలో కూడా గొప్ప సాంకేతిక నిపుణులు ఉన్నారు. హాలీవుడ్ స్థాయికి దీటుగా మనం సినిమాలు తీస్తున్నాం. 'అర్జున్ చక్రవర్తి' కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. సౌండ్ అయినా, సినిమాటోగ్రఫీ అయినా దర్శకుడి విజన్‌కు తగ్గట్టుగా ఉండాలి' అని అన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నవ్వుల విందు



కథానాయకుడిగా తన పంథా మార్చిన అల్లరి నరేశ్ కొన్నాళ్లుగా సీరియస్ కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఆయన తనదైన శైలిలో ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమవుతున్నారు. అల్లరి నరేశ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం (నరేశ్ 65 - వర్కింగ్ టైటిల్) శనివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బేనర్స్‌పై రాజేశ్ దండ, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. చంద్రమోహన్ దర్శకుడు. ముహూర్తపు షాట్‌కు హీరో నాగచైతన్య క్లాప్ ఇచ్చారు. దర్శకుడు బాబీ కెమెరా స్విచ్చాన్ చేశారు. వీఐ ఆనంద్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కథ ఆద్యంతం హాస్యంతో నవ్విస్తుంది, అల్లరి నరేశ్ సరికొత్త పాత్రలో అలరిస్తారు అని దర్శకుడు చెప్పారు. వెన్నెల కిశోర్, నరేశ్ వీకే, శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: రాంరెడ్డి



ఘనవిజయం సాధించాలి

వీవీ వినాయక్

రవిప్రకాశ్, శివకుమార్, చరిష్మా శ్రీకర్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'విద్రోహి'. వీఎస్‌వీ దర్శకత్వంలో విజ్జన వెంకటసుబ్రహ్మణ్యం నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి పాటను దర్శకుడు వీవీ వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మంచి కథతో తెరకెక్కుతున్న చిత్రమిది. సినిమా ఘనవిజయం సాధించాలి' అని కోరారు. 'ఇప్పటి వరకూ రాని సరికొత్త పాయింట్‌తో రూపొందుతోన్న క్రైమ్ థ్రిల్లర్ ఇది' అని వీఎస్‌వీ చెప్పారు.

స్పోర్ట్స్

వరంగల్ ● ఆదివారం 7 సెప్టెంబరు 2025

డబ్రోస్కీ జోడీకి డబుల్స్ కిరీటం

యూఎస్ ఓపెన్ మహిళల డబుల్స్‌లో మూడో సీడ్ ఎరిన్ రౌటిఫ్ (న్యూజిలాండ్)-గాబ్రియెలా డబ్రోస్కీ (కెనడా) జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో గాబ్రియెలా ద్వయం 6-4, 6-4తో టాప్ సీడ్ జంట టేలర్ టౌన్‌సెండ్ (యూఎస్ఏ)-కాటెరీనా సినియకోవా (చెక్)కు షాకిచ్చి ట్రోఫీని అందుకుంది.



నిరుడు క్యాన్సర్‌తో పోరాడి.. నేడు విజేతగా నిలిచి..

ఏడాది క్రితం క్యాన్సర్ బారిన పడి ఎంతో వేదనను అనుభవించిన కెనడా టెన్నిస్ స్టార్ గాబ్రియెలా డబ్రోస్కీ (33).. ఇప్పుడు యూఎస్ ఓపెన్‌లో డబుల్స్ ట్రోఫీని ముద్దాడి చిరునవ్వులు చిందించింది. 2024, ఏప్రిల్‌లో డబ్రోస్కీ రొమ్ము క్యాన్సర్ బారిన పడింది. రెండు సర్జరీలు, రేడియేషన్ చికిత్స చేయించుకొన్న ఆమె మూడు నెలలపాటు ఆట నుంచి విరామం తీసుకొంది. కానీ, పోరాటపటిమ గల డబ్రోస్కీ.. అతి తక్కువ వ్యవధిలోనే క్యాన్సర్ నుంచి కోలుకొంది. రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ రాకెట్ పట్టింది. నిరుడు ఆగస్టులో పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడిన డబ్రోస్కీ.. ఫెలిక్స్ అలియాసిమితో జతకట్టి మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం గెలిచింది. ఆ తర్వాత కివీస్ క్రీడాకారిణి ఎరిన్ రౌటిఫ్‌తో కలిసి రియాద్‌లో జరిగిన డబ్ల్యూటీఏ ఫైనల్స్, సిన్సినాటీతోపాటు పలు టోర్నీల్లో టైటిళ్లు సాధించింది. అదే జోష్‌తో తాజాగా యూఎస్ ఓపెన్ బరిలోకి దిగి విజేతగా నిలిచింది. ఇది కేవలం గెలుపు కాదు.. వ్యక్తిగతంగా, క్రీడాకారిణిగా తనకిది పునర్జన్మ అని డబ్రోస్కీ చెప్పుకొచ్చింది. అంతేకాదు.. 'నేను అనుభవించిన బాధ చాలా మందికి తెలియదు. టెన్నిస్ కోర్టులో ఎందుకు అంతగా నవ్వుతున్నావని అందరూ అడుగుతున్నారు. అది ఎందుకో నాకు మాత్రమే తెలుసు' అని బాధను సంతోషాన్ని కలగలిపి చెప్పిన డబ్రోస్కీ.. తన గాథతో నేటితరం ప్లేయర్లకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.



ఇక్కడా ఆ ఇద్దరే!

సెమీస్‌లో జొకోవిచ్‌కు ఝలక్

పురుషుల సింగిల్స్ ఫైనల్ నేడు

రాత్రి 11.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..

వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో అల్కారజ్ x సినర్

న్యూయార్క్: ఈ ఏడాది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ తుది పోరులోనూ నువ్వా.. నేనా? అని తేల్చుకునేందుకు వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్, నెంబర్ టూ కార్లోస్ అల్కారజ్ సిద్ధమయ్యారు. ఈ ఏడాది ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ ఫైనల్లో తలపడిన ఈ ఇద్దరు.. చెరో టోర్నీ నెగ్గారు. తాజాగా యూఎస్ ఓపెన్ టైటిల్ ఫైట్‌లోనూ ఢీకొంటున్నారు. తద్వారా ఒకే సీజన్‌లో మూడు వరుస గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్స్‌లో తలపడుతున్న ఆటగాళ్లుగా సినర్-అల్కారజ్ రికార్డులకెక్కారు. ఆదివారం జరిగే అంతిమ పోరులో విజేత ఎవరో తేలనుంది. డిఫెండింగ్ చాంపియన్ సినర్‌కిది వరుసగా ఐదో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కావడం విశేషం. ఇక.. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ కోసం ఎన్నాళ్లుగానో వేచి చూస్తున్న 38 ఏళ్ల నొవాక్ జొకోవిచ్‌కు మరోసారి భంగపాటే ఎదురైంది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో స్పెయిన్ సంచలనం అల్కారజ్ 6-4, 7-6(4), 6-2తో వరుస సెట్లలో మాజీ చాంపియన్ జొకోవిచ్‌ను ఓడించాడు. మరో సెమీఫైనల్లో ఫెలిక్స్ అలియాసిమి (కెనడా)ని ఓడించేందుకు ఇటలీ స్టార్ సినర్ నాలుగు సెట్ల పాటు కష్టపడ్డాడు. కొద్దిసేపు మెడికల్ టైమ్ అవుట్ తీసుకున్న సినర్ చివరకు 6-1, 3-6, 6-3, 6-4తో గట్టెక్కి వరుసగా రెండోసారి ఇక్కడ ఫైనల్ చేరాడు. కెరీర్‌లో 300వ విజయం అందుకున్న సినర్‌కు ఇది వరుసగా ఐదో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కావడం విశేషం. నిరుడు యూఎస్ ఓపెన్ నెగ్గిన సినర్.. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ విజేతగా నిలిచాడు. ఆ వెంటనే ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరినా, అల్కారజ్ టైటిల్ ఎగరేసుకుపోయాడు. అనంతరం వింబుల్డన్‌లోనూ తుదిపోరుకు దూసుకెళ్లిన సినర్.. అల్కారజ్‌ను ఓడించి చాంపియన్‌గా అవతరించాడు.



పోరాటం ఆపను..

ఈ సీజన్‌లో జొకోవిచ్ నాలుగు గ్రాండ్‌స్లామ్స్‌లోనూ సెమీస్‌కు చేరినా.. అతడి పోరు అక్కడితోనే ఆగిపోయింది. ఇందులో రెండుసార్లు సినర్ (ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్), ఓసారి అల్కారజ్ (యూఎస్ ఓపెన్) చేతిలో ఓడిన జొకోవిచ్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జ్వెరెవ్‌తో సెమీస్‌లో గాయంతో మ్యాచ్ మధ్యలోనే వైదొలిగాడు. ఇలా.. 25వ స్లామ్‌ను ఖాతాలో చేర్చుకోవాలన్న జొకో భగీరథ ప్రయత్నాలకు ఈ యువతరం స్టార్లు అడ్డుపడుతున్నారు. అయినా కూడా గ్రాండ్‌స్లామ్స్‌లో తన పోరాటాన్ని ఆపేది లేదని అంటున్నాడు జొకో. తాను ఇప్పట్లో రిటైర్ అయ్యే అవకాశం లేదని, వచ్చే ఏడాది కూడా అన్ని మేజర్ టోర్నీల్లో ఆడాలనుకుంటున్నట్టు జొకో స్పష్టం చేశాడు.

ఆసియా కప్ హాకీ

ఫైనల్లో భారత్

నేడు కొరియాతో అమీతుమీ



రాత్రి 7.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

రాజ్‌గిర్: పురుషుల ఆసియాకప్ హాకీ టోర్నీలో భారత జట్టు ఫైనల్‌కు చేరింది. శనివారం చైనాతో జరిగిన సూపర్-4 ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఏకంగా 7-0 తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున అభిషేక్ (46, 50వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో విజృంభించగా.. శీలానంద్ (4), దిల్‌ప్రీత్ సింగ్ (7), మన్‌దీప్ సింగ్ (18), రాజ్‌కుమార్ పాల్ (37), సుఖ్‌జీత్ సింగ్ (39) తలో గోల్ చేశారు. ఈ గెలుపుతో భారత జట్టు సూపర్ 4 లీగ్ టేబుల్‌లో ఏడు పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఇక నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియాతో భారత్ ఆదివారం జరిగే తుది పోరులో అమీతుమీ తేల్చుకోనుంది. అంతకుముందు కొరియా 4-3తో మలేసియాను ఓడించింది. కాగా, టోర్నీలో విజేతగా నిలిచిన జట్టు వచ్చే ఏడాది జరిగే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తుంది. ఇక, చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న మహిళల ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత్ రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌ను నిలువరించింది. శనివారం జపాన్‌తో జరిగిన పోరును భారత్ 2-2తో డ్రాగా ముగించింది. తొలి మ్యాచ్‌లో భారత్ 11-0తో థాయ్‌లాండ్‌ను ఓడించిన సంగతి తెలిసిందే.

మిక్స్‌డ్ ఫైనల్లో జ్యోతి

● ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌ను భారత క్రీడాకారులు ఘనంగా ప్రారంభించారు. కాంపౌండ్ కేటగిరిలో రెండు విభాగాల్లో ఫైనల్స్‌కు దూసుకెళ్లి రెండు పతకాలు ఖాయం చేశారు. కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ/రిషబ్ యాదవ్ ద్వయం.. వరుసగా జర్మనీ, ఎల్ సాల్వడార్, చైనీస్ తైపీ జట్లను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఆదివారం జరిగే స్వర్ణ పతక పోరులో నెదర్లాండ్స్‌తో జ్యోతి జోడీ తలపడనుంది. ఇక.. రిషబ్, అమన్ సైనీ, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో ఫైనల్ చేరింది. తొలుత ఆస్ట్రేలియాను, ఆ తర్వాత అమెరికాను చిత్తుచేసిన భారత త్రయం.. సెమీస్‌లో టర్కీని ఓడించింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఫ్రాన్స్‌తో భారత్ తలపడనుంది.

నిఖత్ ముందంజ

లవ్లీనా ఇంటికి

ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. స్టార్ బాక్సర్లలో రెండుసార్లు చాంపియన్ నిఖత్ జరీన్ ముందంజ వేయగా, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్ ఇంటిబాట పట్టింది. 51 కిలోల విభాగం తొలి రౌండ్లో నిఖత్ 5-0తో జెన్నిఫర్ లజానో (అమెరికా)ను చిత్తుచేసి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. 75 కిలోల ప్రీక్వార్టర్స్‌లో టాప్ సీడ్ లవ్లీనా 0-5తో బుర్సా ఇసిల్డార్ (టర్కీ) చేతిలో ఓటమిపాలైంది. నరేందర్ (90+ కిలోలు) 4-1తో క్రిస్టోఫర్ (ఐర్లాండ్)పై విజయం సాధించి ప్రీక్వార్టర్స్ చేరాడు.

బుల్స్ బోణీ

ప్రొ కబడ్డీ లీగ్‌లో పైరేట్స్ చిత్తు



విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో బెంగళూరు బుల్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. వరుసగా మూడు ఓటముల అనంతరం తొలి విజయాన్ని నమోదు చేసింది. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38-30తో పట్నా పైరేట్స్‌ను చిత్తుచేసింది. బుల్స్ రైడర్ అలిరెజా మీర్జాయిన్ అద్భుతంగా రాణించి సూపర్ 10 సాధించగా.. మరో రైడర్ ఆశిష్ మాలిక్ 8 పాయింట్లు రాబట్టి బుల్స్ విజయంలో కీలక పాత్ర పోషించారు. పైరేట్స్‌లో అయాన్ సూపర్ 10 సాధించినా ఫలితం లేకపోయింది. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 37-28తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది.

భారత్ 'ఎ' కెప్టెన్‌గా శ్రేయాస్



- నితీశ్ కుమార్‌కు చోటు
- ఆసీస్ 'ఎ'తో రెండు అనధికార టెస్టులు

న్యూఢిల్లీ: ఆసియాకప్ టీ20 టోర్నీలో చోటు దక్కించుకోలేకపోయిన శ్రేయాస్ అయ్యర్‌ను సెలెక్టర్లు కరుణించారు. అతడిని భారత్ 'ఎ' జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. శనివారం 15 మందితో కూడిన ఈ జట్టును ప్రకటించారు. ఆస్ట్రేలియా 'ఎ' జట్టు వచ్చే వారం భారత పర్యటనకు రానుంది. సెప్టెంబరు 16 నుంచి 26 వరకు లఖ్‌నవూలో భారత్ 'ఎ', ఆసీస్ 'ఎ' జట్ల మధ్య రెండు అనధికారిక నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లు జరుగుతాయి. శ్రేయాస్ గతేడాది ఫిబ్రవరిలో చివరి టెస్టు ఆడాడు. ఆసీస్ 'ఎ'పై ప్రభావం చూపగలిగితే అక్టోబరులో వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు ఎంపికయ్యే చాన్సుంది. ప్రస్తుతం శ్రేయాస్ వెస్ట్ జోన్ తరఫున దులీప్ ట్రోఫీ సెమీస్‌లో ఆడుతున్నాడు. అలాగే గాయం నుంచి కోలుకున్న ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి కూడా 'ఎ' జట్టులో చోటు దక్కింది. ఇంగ్లండ్ పర్యటనలో అతను గాయపడిన విషయం తెలిసిందే. మరోవైపు రెండో టెస్టు కోసం కేఎల్ రాహుల్, సిరాజ్ జట్టులో చేరనున్నారు. అటు కరుణ్, సర్ఫరాజ్, శార్దూల్‌లకు సెలెక్టర్లు చోటివ్వకపోవడం గమనార్హం. ఈ రెండు టెస్టుల తర్వాత కాన్పూర్‌లో ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు జరుగుతాయి.

భారత్ 'ఎ' జట్టు: శ్రేయాస్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఎన్.జగదీశన్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (కీపర్), దేవ్‌దత్, హర్ష్ దూబే, ఆయుష్ బదోని, నితీశ్ కుమార్, తనుష్ కోటియన్, ప్రసిద్ధ్ క్రిష్ణ, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, మనవ్, యష్ ఠాకూర్. రాహుల్, సిరాజ్ (రెండో టెస్టుకు).

28న బీసీసీఐ కొత్త చీఫ్ ఎన్నిక!

న్యూఢిల్లీ: కొత్త అధ్యక్షుడు, ఐపీఎల్ చైర్మన్‌ను ఎన్నుకోవడమే ప్రధాన అజెండాగా బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) ఈనెల 28న ముంబైలో జరగనుంది. ఏజీఎంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సహా కీలక ఆఫీసు బేరర్ల పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు అనుబంధ సంఘాలకు బోర్డు కార్యదర్శి దేవాజిత్ సైకియా సమాచారం అందించాడు. తనకు 70 ఏళ్లు నిండడంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష పదవి నుంచి రోజర్ బిన్నీ ఇటీవల తప్పుకొన్న సంగతి తెలిసిందే.

పన్ను రేటులో తేడా ఉన్నప్పుడు టైమ్ ఆఫ్ సప్లయ్ నిర్ధారణ ఎలా?

ఇదీ GST



రాంబాబు గొండాల

ఇటీవలి 56వ జీఎస్‌టీ కౌన్సిల్ మీటింగ్‌లో జీఎస్‌టీకి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇంత భారీ సంస్కరణలు చోటు చేసుకోవటం ఇదే తొలిసారి. ఈ నెల 22 నుంచి అమల్లోకి వచ్చే జీఎస్‌టీ తగ్గింపులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే పలు సూచనలు చేసింది. తగ్గించిన పన్ను ప్రయోజనాలు కచ్చితంగా వినియోగదారులకు చేరాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే నేరుగా వినియోగదారులకు అమ్మే వస్తువులకు అంటే బీ2సీ (బిజినెస్ టు కన్స్యూమర్) సరఫరాలో పెద్ద సమస్య లేకపోవచ్చు. ఎందుకంటే, ఈ నెల 22 నుంచి అమ్ముడయ్యే ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి తగ్గించిన ధరనే తీసుకోవచ్చు. కానీ బీ2బీ (బిజినెస్ టు బిజినెస్) సరఫరాలలో కొంత సమస్య ఉంటుంది. కారణం ఒక్కొక్కసారి అడ్వాన్స్ ముందే రావచ్చు. అలాగే ఇన్వాయిస్ కూడా ముందే ఇవ్వవచ్చు లేదా సరఫరా జరిగిన తర్వాత పేమెంట్ అందవచ్చు. మరి అలాంటప్పుడు పైకం ముట్టిన తేదీ, ఇన్వాయిస్ తేదీ లేదా వాస్తవ సరఫరా జరిగిన తేదీ, దేని ప్రాతిపదికన పన్ను శాతం తీసుకోవాలి. ఇంకా చెప్పాలంటే సర్వీస్‌లకు సంబంధించి ఈ సమస్య కొంత అధికం. ఎందుకంటే సర్వీస్‌లకు సంబంధించి ఇన్వాయిస్ గరిష్ఠంగా నెల రోజుల వరకు ఇవ్వవచ్చు. ఉదాహరణకు ఏదేనీ సర్వీస్ సెప్టెంబరు 20న అందిస్తే అంటే పాత రేటు ఉన్న సమయంలో అందిస్తే, ఇన్వాయిస్ నెలలోపు అంటే కొత్త రేటు అమల్లోకి వచ్చిన తర్వాత ఇచ్చే సౌలభ్యం సర్వీస్ అందించే వ్యక్తికి ఉంటుంది. ఒక్కొక్కసారి పేమెంట్ ముందు తీసుకుని, సర్వీస్ తర్వాత ఇవ్వవచ్చు. దీన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

ఒక వ్యక్తి ఒక హోటల్‌లో సెప్టెంబరు 25న రూమ్ కావాలని సెప్టెంబరు 1న ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాడు. రూమ్ రెంట్ రూ.5,000 కూడా అప్పుడే చెల్లించారు. అలాగే ఆ రోజు అమల్లో ఉన్న 12 శాతం ప్రకారం రూ.600 జీఎస్‌టీ కింద చెల్లించటం జరిగింది. కానీ, నిజానికి ఆ వ్యక్తి రూమ్‌ను వాడుకునే నాటికి పన్ను శాతం 12 నుంచి 5 శాతానికి తగ్గటం జరిగింది. మరి సదరు హోటల్ యాజమాన్యం ఎంత పన్ను చెల్లించాలి?

ఒక సరఫరాకు సంబంధించిన పన్ను ఎప్పుడు చెల్లించాలనేది జీఎస్‌టీ చట్టంలోని 'టైమ్ ఆఫ్ సప్లయ్' ప్రకారం ఉంటుంది. ఏదేనీ ఒక సరఫరాకు సంబంధించి పన్ను రేటులో తేడా ఉన్నప్పుడు ఏ రేటును పరిగణనలోకి తీసుకోవాలనేది కూడా ఈ టైమ్ ఆఫ్ సప్లయ్ ప్రకారం తెలుసుకోవచ్చు. దీని ప్రకారం వాస్తవ సరఫరా జరిగిన తేదీ, ఇన్వాయిస్ జారీ చేసిన తేదీ లేదా సంబంధిత మొత్తం ముట్టిన తేదీ...ఈ మూడింటిలో కనీసం రెండు ఏ పీరియడ్‌లో జరిగితే ఆ పీరియడ్‌లో ఏ రేటు అమల్లో ఉందో దానినే పరిగణనలోని తీసుకోవాలి. పైన చెప్పిన ఉదాహరణలో సరఫరా సెప్టెంబరు 25న..అంటే కొత్త పన్ను రేటు అమల్లోకి వచ్చిన తర్వాత జరుగుతుంది. అలాగే పేమెంట్ పాత పన్ను రేటు ఉన్న సమయంలో అంటే సెప్టెంబరు 22 కంటే ముందు జరిగింది. కాబట్టి ఇప్పుడు ఇన్వాయిస్ తేదీ అనేది కీలకం. ఒకవేళ ఇన్వాయిస్ కూడా సెప్టెంబరు 22 తర్వాతే ఇచ్చి ఉంటే అప్పుడు సరఫరా, ఇన్వాయిస్ రెండు కొత్త రేటు అమల్లోకి వచ్చిన తర్వాత జరిగాయి కాబట్టి అప్పుడు కొత్త రేటు అంటే 5 శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఎక్కువ వసూలు చేసిన మొత్తాన్ని హోటల్ యాజమాన్యం సదరు అతిథికి కచ్చితంగా వెనక్కు ఇచ్చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇన్వాయిస్ కూడా పేమెంట్ అందిన తేదీన అంటే సెప్టెంబరు 1నే ఇచ్చి ఉంటే.. అప్పుడు పేమెంట్, ఇన్వాయిస్, సరఫరా ఈ మూడింటిలో రెండు పాత రేటు అమల్లో ఉన్న సమయంలో ఉన్నాయి కాబట్టి రూమ్ వాడుకున్నది సెప్టెంబరు 25నే అయినప్పటికీ సంబంధిత పన్ను రేటు ప్రకారం అంటే 12 శాతం చెల్లించాలి. ఒక్కొక్కసారి సరఫరా పాత రేటు ఉన్న సమయంలో జరిగి.. అంటే సెప్టెంబరు 22 కంటే ముందు జరిగి ఇన్వాయిస్ లేదా పేమెంట్ తర్వాత రావచ్చు. అప్పుడు కూడా ఇదే పద్ధతి అంటే ఈ మూడింటిలో కనీసం రెండు ఏ పక్కన ఉన్నాయో చూసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

సంపాదించేటప్పుడే రిటైర్మెంట్ తర్వాత అవసరాల కోసం ప్లాన్ చేసుకోవాలి. ప్రణాళికాబద్ధంగా పెట్టుబడులతోనే మలి దశ జీవితానికి ఆర్థిక భరోసా. లేదంటే ఇబ్బందులు తప్పవు. రిటైర్మెంట్ ఆర్థిక భద్రతను ఎలా ప్లాన్ చేసుకోవచ్చనే వివరాలు మీకోసం..

రిటైర్మెంట్ పొదుపులో పొరపాట్లు వద్దు

జాగ్రత్త వహిస్తేనే మలిదశ జీవితానికి ఆర్థిక భరోసా



రెక్కాడేటప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలి. ఇందుకోసం నెలనెలా కొద్ది మొత్తంలోనైనా పొదుపు చేయాలి. తర్వాత ఆ సొమ్ముతో మన లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులుగా పెట్టాలి. ఇళ్లు, పొలాలతో పాటు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమానుగుత పెట్టుబడులు (సిప్) లేదా ఇతర పెట్టుబడి సాధనాల్లో మదుపు చేయాలి. ఇందుకు ముందుచూపుతో పాటు క్రమశిక్షణ కూడా అవసరం. ఈ విషయంలో చాలా మంది కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. అవేంటంటే..

అవాస్తవ లక్ష్యాలు

తెలివైన రిటైర్మెంట్‌కు వాస్తవిక లక్ష్యాలే పునాది. చాలీచాలని జీతాలతో భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంటే అవి కలలుగానే మిగిలిపోతాయి తప్ప ఆచరణకు నోచుకోవు. కాబట్టి మన ఆదాయం, ఖర్చులను దృష్టిపెట్టుకుని పెట్టుబడులు ప్లాన్ చేసుకోవాలి.

ద్రవ్యోల్బణం

రిటైర్మెంట్ కోసం పొదుపు చేసే వారిలో చాలా మంది ద్రవ్యోల్బణం ప్రభావాన్ని సరిగా పట్టించుకోరు. ద్రవ్యోల్బణం పొదుపు విలువను ఏటేటా తగ్గించేస్తుంది. ఈ రోజు రూ.లక్ష ఉన్న పొదుపు విలువ, రిటైర్మెంట్ నాటికి బాగా తగ్గిపోతుంది. మంచి కంపెనీల షేర్లు, మంచి రాబడులు పంచుతున్న ఈక్విటీ పథకాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడం ద్వారా ద్రవ్యోల్బణం సెగ నుంచి తప్పించుకోవచ్చు.

అత్యవసర నిధి

ఏ సమయంలో ఎలాంటి ఆపద లేదా అవసరం వస్తుందో ఎవరూ చెప్పలేరు. అందుకే, అత్యవసర, ఆకస్మిక ఖర్చుల కోసం ప్రత్యేక నిధి తప్పనిసరి. కానీ, చాలా మంది ఇందుకోసం ప్రత్యేకంగా ప్లాన్ చేసుకోరు. దీర్ఘకాలిక పెట్టుబడి నుంచే ఈ ఖర్చులు భరిస్తారు. దాంతో రిటైర్మెంట్ పెట్టుబడులకు గండి పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి వ్యక్తి కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తాన్ని అత్యవసర నిధిగా పక్కన పెట్టుకోవాలి.

ఈపీఎఫ్ విత్‌డ్రాయల్స్

కొత్త ఇంటి కొనుగోలు, పిల్లల పెళ్లిళ్లు లేదా అత్యవసర వైద్య ఖర్చుల కోసం చాలా మంది తమ ఈపీఎఫ్ నుంచి కొంత మొత్తాన్ని మధ్యలోనే వెనక్కి తీసుకుంటూ ఉంటారు. ఇది ఏ మాత్రం మంచిది కాదు. ఈపీఎఫ్ పొదుపును రిటైర్మెంట్ తర్వాత ఏర్పడే అవసరాలు తీర్చే దీర్ఘకాలిక పెట్టుబడిగా చూడాలే తప్ప, స్వల్పకాలిక అవసరాలు తీర్చే పెట్టుబడిగా చూడకూడదు.

పీపీఎఫ్‌పై ఉపేక్ష

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) పెట్టుబడులు, రాబడులకు పూర్తి పన్ను మినహాయింపు ఉంటుంది. పైగా ఈ పెట్టుబడి మొత్తాల చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అయితే వడ్డీ రేట్లు తక్కువనే కారణంతో చాలామంది దీన్ని పెద్దగా పట్టించుకోరు. ఉద్యోగం లేదా సంపాదన ప్రారంభమైన వెంటనే పీపీఎఫ్‌లో కొద్ది స్థాయిలోనైనా పెట్టుబడులు ప్రారంభిస్తే, రిటైర్ అయ్యే నాటికి ఎలాంటి పన్నుల భారం లేకుండా పెద్ద మొత్తంలో చేతికొస్తుంది. 15 సంవత్సరాల కాలపరిమితి ఉండే ఈ పథకంలో ఒక్కో వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.500 కనీస స్థాయి నుంచి రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

ఆరోగ్య బీమా

ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు పెద్దలు. సంపాదించేటప్పుడు వచ్చే ఆరోగ్య సమస్యల కంటే ఈ రోజుల్లో రిటైర్మెంట్ తర్వాత వచ్చే అనారోగ్య సమస్యలే జేబుకు ఎక్కువగా చిల్లు పెడతాయి. ఆర్జిస్తున్న సమయంలోనే వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడం మంచిది. కంపెనీ హెల్త్ పాలసీ ఉంది కదా అని నిర్లక్ష్యం చేస్తే.. రిటైర్మెంట్ తర్వాత వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. కాబట్టి ఎంత తక్కువ వయసులో వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ తీసుకుంటే అంత తక్కువ ప్రీమియం పడుతుంది.

బిజినెస్ ప్లస్

టర్మ్ పాలసీలపై నిర్లక్ష్యం వద్దు

ఒకవేళ మీకేదైనా జరిగితే, మీపై ఆర్థికంగా ఆధారపడిన కుటుంబసభ్యులు రోడ్డున పడాల్సిందే. ఆదాయానికి తగ్గట్టు కవరేజీ ఉండేలా టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం ద్వారా ఈ పరిస్థితి నుంచి బయట పడవచ్చు. ఈ పాలసీ కవరేజీ మీ వార్షిక ఆదాయానికి కనీసం 10 నుంచి 15 రెట్లు ఉండేలా చూసుకోవాలి. అప్పులు, పిల్లల బాధ్యతలు తీరిన తర్వాత అవసరమనుకుంటే టర్మ్ పాలసీ కవరేజీ మార్చుకోవచ్చు.


సాగదీయ వద్దు

రిటైర్మెంట్ పెట్టుబడులను సంపాదన ప్రారంభించిన వెంటనే ఆరంభించాలి. ఎంత త్వరగా ప్రారంభిస్తే మీ పెట్టుబడుల విలువ అంత త్వరగా పెరుగుతుంది. ఉదాహరణకు పాతికేళ్ల వయసున్న వ్యక్తి నెలకు రూ.15,000తో ఈక్విటీ పథకాల్లో సిప్ ప్రారంభించాడనుకుందాం. ఈ పెట్టుబడులపై సగటున 12 శాతం రాబడులు వచ్చినా రిటైర్ అయ్యే నాటికి రూ.10 కోట్లు పోగై ఉంటుంది. అదే ఒక 10 సంవత్సరాలు ఆలస్యంగా ప్రారంభిస్తే నెలకు రూ.లక్ష చొప్పున పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

ఆస్తుల వివిధీకరణ

అన్ని గుడ్లు ఒకే బుట్టలో పెట్టకూడదనేది సామెత. ఇది రిటైర్మెంట్ పెట్టుబడులకూ వర్తిస్తుంది. రుణ పత్రాల్లో పెట్టుబడులు స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చినా.. ద్రవ్యోల్బణం ఆ రాబడులను మింగేస్తుంది. దీర్ఘకాలంలో మన పెట్టుబడులు ద్రవ్యోల్బణానికి మించి రాబడులు ఇవ్వాలంటే మంచి కంపెనీల ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాల్లోనూ మదుపు చేయాలి. ఇదంతా ఎందుకనుకుంటే ఈక్విటీ, రుణ పత్రాలు, బంగారం, వెండిలో సమానంగా మదుపు చేయడం మంచిది. ఇది కూడా మా వల్ల కాదనుకుంటే మ్యూచువల్ ఫండ్ సంస్థలు.. మల్టీ అసెట్ ఫండ్స్ పేరుతో ప్రత్యేక పథకాలు అందిస్తున్నాయి. మంచి రాబడులు అందించడంతో ఇటీవల ఈ ఫండ్స్ మంచి ఆదరణ పొందుతున్నాయి.

భారత రోడ్లపైకి విన్‌ఫాస్ట్ కార్లు



న్యూఢిల్లీ: వియత్నాం కంపెనీ విన్‌ఫాస్ట్ ఎలక్ట్రిక్ కార్లు కూడా మన రోడ్లపైకి ప్రవేశించబోతున్నాయి. కంపెనీ తొలుత రెండు ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడళ్లు వీఎఫ్6, వీఎఫ్7ను భారత మార్కెట్లోకి శనివారం విడుదల చేసింది. మూడు వేరియంట్లలో లభించనున్న వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు కాగా.. గరిష్ఠ రేటు రూ.18.29 లక్షలుగా ఉంది. ఐదు వేరియంట్లలో లభించే వీఎఫ్7 ప్రారంభ రేటు రూ.28.89 లక్షలుగా ఉండగా గరిష్ఠ ధర రూ.25.49 లక్షలుగా ఉంది. ఈ కార్లు ఆరు రంగుల్లో లభించనున్నాయి. ఈ రెండు కార్లకు జూలైలోనే బుకింగ్‌ను ప్రారంభించింది. కాగా విన్‌ఫాస్ట్.. హైదరాబాద్ సహా దేశంలోని 27 నగరాల్లో మొత్తం 32 విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	108	విజయవాడ	132
వరంగల్	108	గుంటూరు	120
కరీంనగర్	108	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	108	చిత్తూరు	95
కర్నూలు	108	నెల్లూరు	100
విశాఖపట్నం	136	అనంతపురం	100
గోదావరి	132		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	545
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	



ఢిల్లీలోని మన్మోహన్‌సింగ్ నివాసంలో ఆయన సతీమణి గురుచరణ్‌కౌర్‌కు అవార్డును అందిస్తున్న మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా, కె.రామచంద్రమూర్తి, జయప్రకాశ్ నారాయణ, పోలా విజయబాబు, మాదంశెట్టి అనిల్‌కుమార్ తదితరులు

మన్మోహన్‌సింగ్‌కు పీవీ స్మారక అవార్డు

» ఆయన సతీమణి గురుచరణ్‌కౌర్‌కు ప్రదానం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు పీవీ నరసింహారావు స్మారక అవార్డు లభించింది. దేశ ఆర్థిక రంగంలో మన్మోహన్ చేసిన సేవలకు గానూ ఆయనను ఈ అవార్డుకు పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ (పీవీఎన్ఎంఎఫ్) ఎంపిక చేసింది. మన్మోహన్ నివాసంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన సతీమణి గురుచరణ్‌కౌర్‌కు ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా, మాజీ సంపాదకులు, పీవీఎన్ఎంఎఫ్ ఉపాధ్యక్షుడు కె.రామచంద్రమూర్తి, మాజీ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ, ఆర్టీఐ మాజీ కమిషనర్ పోలా విజయబాబు, పీవీఎన్ఎంఎఫ్ ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్‌కుమార్ అవార్డును ప్రదానం చేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జయప్రకాశ్ నారాయణ, రామచంద్రమూర్తి, విజయబాబు మాట్లాడుతూ... దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నప్పుడు ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చి పీవీ, మన్మోహన్ దేశాన్ని గట్టెక్కించారని అన్నారు. వారు సామాన్యుడి జీవితాన్ని మెరుగుపరిచే సమ్మిళిత అభివృద్ధి కావాలని కృషి చేశారని అయితే వారు చేపట్టిన ఈ పని అసంపూర్తిగా మిగిలిపోయిందని అన్నారు. దేశంలో కొంత ప్రగతి కనిపిస్తున్నా అందులో సామాన్యుడిని పూర్తిగా భాగస్వామ్యం చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. పీవీ అరుదైన రాజకీయవేత్త అని, నిజాయతీ, వినమ్రత, హుందాతనం, సామాన్యుల పట్ల అపారమైన ఆర్ద్రత మూర్తీభవించిన మనిషి అని కొనియాడారు. పీవీ, మన్మోహన్ సంకల్పించిన సమాజం సాకారం చేసేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జేఎన్టీయూ కాలేజీలో సమస్యలను పరిష్కరించాలి

» శాశ్వత భవనాల నిర్మాణం ప్రారంభించాలి: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఉన్న జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు. వేములవాడ డిగ్రీ కాలేజీలోని తాత్కాలిక తరగతి గదులకు తాళం వేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమస్యను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ విషయమై జేఎన్టీయూ కిషన్‌కుమార్ రెడ్డి, సాంకేతిక విద్యా కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై సాంకేతిక విద్య కమిషనర్ స్పందిస్తూ.. పెండింగ్ బకాయిలను చెల్లించడంతోపాటు తరగతులకు ఎలాంటి అంతరాయం లేకుండా, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

42% బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యం: కవిత

» తెలంగాణ జాగృతిలో పలువురు బీసీ నాయకుల చేరిక

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించడం కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో శనివారం పలువురు బీసీ నాయకులు జాగృతిలో చేరారు. అందులో జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ గోపు సదానందం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఆరెకటిక సంఘం నాయకుడు సురేందర్, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. శాసనసభ, మండలిల్లో బీసీ బిల్లులను ఆమోదించినప్పటికీ వాటికి రాష్ట్రపతి ఆమోదం పొందడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. బీసీలను మోసం చేయడానికి కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందన్నారు.

డీజే శబ్దానికి గుండెపోటు

» నారాయణపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

నారాయణపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. గణనాథుడి నిమజ్జన ఊరేగింపులో ఏర్పాటు చేసిన డీజే వద్ద డ్యాన్స్ చేస్తూ ఓ వ్యక్తి మృతి చెందారు. స్థానిక బురుడువాడికి చెందిన శేఖర్(45) స్థానిక మునిసిపాలిటీలోని నీటి సరఫరా విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వినాయక నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న శేఖర్ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నృత్యం చేశాడు. అయితే డ్యాన్స్ చేస్తుండగానే అకస్మాత్తుగా కిందపడి స్పృహ కోల్పోయారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని పలువురి సాయంతో శేఖర్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఎస్సై ముందుగా సీపీఆర్ చేశారు. అంతలోనే డాక్టర్ వచ్చి కూడా సీపీఆర్ చేశారు. పరిస్థితి విషమించిందని అక్కడి నుంచి జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.



ర్యాంక్ సర్టిఫికెట్లు చూపిస్తున్న కేఎల్‌యూ వీసీ సారథివర్మ, యూనివర్సిటీ అధికారులు

ఎన్ఐఆర్ఎఫ్‌లో కేఎల్‌యూకు 26వ ర్యాంక్

తాడేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు పాటించే యూనివర్సిటీలకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఇచ్చే ర్యాంకింగ్‌లలో యూనివర్సిటీ విభాగంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ 26వ ర్యాంక్ దక్కించుకున్నట్టు ఉపకులపతి డాక్టర్ సారథివర్మ తెలిపారు. శనివారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా ప్రణాళిక, మౌలిక వసతులు, నాణ్యత నైపుణ్యం వంటి ప్రమాణాలు, పరిశోధనా ప్రాజెక్టు, ప్లేస్‌మెంట్స్, పీహెచ్‌డీ పొందిన ప్రొఫెసర్స్ వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ఇస్తారని, ఈ అంశాలలో తమ యూనివర్సిటీ అత్యుత్తమంగా ఉందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో జాతీయ స్థాయిలో 26వ ర్యాంక్, ఇంజనీరింగ్ విభాగంలో 35వ ర్యాంక్, ఓవరాల్ కేటగిరిలో 46వ ర్యాంక్, మేనేజ్‌మెంట్ విభాగంలో 70వ ర్యాంకు వచ్చిందని చెప్పారు. యూనివర్సిటీ నుంచి ప్రతి ఏటా 6200 మంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసుకుంటున్నారని, అలాగే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కూడా గత పదిహేడేళ్లుగా 100 శాతం ప్లేస్‌మెంట్స్ సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పన్ను సరళీకరణ..

అందరికీ ఉపయోగమే

(మొదటిపేజీ తరువాయి)

సమాధానాల్లో ముఖ్యాంశాలు..



భవిష్యత్తులో మరోసారి జీఎస్టీ శ్లాబులు మారే అవకాశం ఉందా?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక పరోక్ష పన్నుల విధానంలో చేపట్టిన అతిపెద్ద సంస్కరణ.. జీఎస్టీ అమలు. కేంద్ర, రాష్ట్ర పన్నులను ఏకీకృత వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా జీఎస్టీ అనేది జాతీయ మార్కెట్‌ను సృష్టించింది. పన్నులను సరళీకరించింది. పారదర్శకతను పెంచింది. భారత దేశ పరోక్ష పన్ను వ్యవస్థకు ఇది వెన్నుముకగా మారింది. పన్నుల వ్యవస్థను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా అవసరమైన సమయంలో మార్పులు తీసుకురావడం అనేది ఆర్థిక వ్యవస్థలో నిరంతర ప్రక్రియ. దీన్ని స్వాగతించాల్సిన అవసరం ఉంది. ద్రవ్యోల్బణం, పన్నుల భారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జీఎస్టీ రిజిస్ట్రేషన్ పరిమితిని సమీక్షించాల్సిన అవసరం ఉంది.

జీఎస్టీ సంస్కరణలతో నేరుగా ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది? నిజంగా ధరలు తగ్గుతాయా?

గతంలో జీఎస్టీ వస్తువులు లేదా సేవలను వాటి కోడ్‌లు, పేర్లతో చూసేవారు, కానీ ఈ సంస్కరణలలో వాటిని రోజువారీ వినియోగ వస్తువుల కోణంలో క్రోడీకరించారు. మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా పేదలు వినియోగించే వస్తువులు, రైతులను ప్రభావితం చేసే వస్తువులపై ఎక్కువగా దృష్టిసారించారు. మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న దశ నుంచి వికసిత్ భారత్ దిశగా వెళ్లేందుకు కొత్త పన్ను రేట్లు దోహదపడే అవకాశం ఉంది. టూత్‌పేస్ట్ నుంచి వెన్న, జున్ను, కండెన్స్‌డ్ మిల్క్, పాస్తా, ప్యాక్ చేసిన కొబ్బరి నీళ్లు, గింజలు, ఖర్జూరాలు, సాస్‌లు, ఎయిర్ కండిషనర్లు, టీవీ సెట్‌లు, చిన్న కార్లు, బైక్‌లు, బ్యాండేజీలు, డయాగ్నస్టిక్ కిట్‌లు వంటివాటి దాకా వినియోగ వస్తువులపై తక్కువ పన్ను రేట్లు ఉంటాయి. ఇవన్నీ ప్రజలకు నేరుగా పన్ను ప్రయోజనాలు అందించేవే.

పన్ను తగ్గింపు ప్రయోజనాలు వినియోగదారులకు బదిలీ అవుతున్నాయో లేదో పరిశీలించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

కొత్త ధరలు సెప్టెంబరు 22 నుంచి అమలయ్యేలా కంపెనీలు తమ వ్యవస్థల్లో మార్పులు చేయాలి. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జీఎస్టీ రేటు తగ్గింపు ప్రయోజనాలను బదిలీ చేయడానికి వివిధ మంత్రిత్వ శాఖలతో కలిసి పని చేస్తున్నారు. ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు, దేశీ ఆటోమొబైల్ కంపెనీలు ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటిస్తున్నాయి. పన్నుల తగ్గింపునకు ముందు, తరువాత ధరల స్థితిని జీఎస్టీ విభాగం నిశితంగా పరిశీలిస్తోంది. తగ్గిన పన్ను ప్రయోజనాలు వినియోగదారులకు అందివ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

రిటైల్ వ్యాపారులు పాత బిల్లులతో అంటే 28 శాతం బిల్లుల ఇన్‌పుట్ సరుకు లేకుండా తీసుకుని.. సెప్టెంబరు 22 తరువాత వాడుకునే అవకాశం ఉందా?

పన్ను చెల్లింపుదారులు వస్తువులు లేదా సేవల వాస్తవ సరఫరా లేకుండా పన్ను ఇన్వాయిస్ జారీ చేస్తుంటే అవి నకిలీ ఇన్వాయిస్‌లు అవుతాయి. అటువంటి ఇన్వాయిస్‌లను గ్రహీతలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందలేరు. ఉపయోగించుకోలేరు. ఇది జీఎస్టీ చట్టం ప్రకారం నేరం.

చిరు వ్యాపారులు, ఎంఎస్ఎంఈ సంస్థల నిర్వాహకులకు ఈ పన్నుల తగ్గింపు ఉపయోగపడుతుందా? పోటీలో నిలబడగలరా?

ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం, వేగవంతమైన పన్ను వాపసు ద్వారా దేశీయ డిమాండ్‌ను పెంచడం వల్ల.. ఎంఎస్ఎంఈ నిర్వాహకులకు ప్రయోజనాలు కలుగుతాయి. సరళీకరించిన పన్నుల వల్ల ధరలు తగ్గి.. విక్రయాలు పెరిగే అవకాశం ఉంది. ఈ మార్పులు వర్కింగ్ క్యాపిటల్ అడ్డంకులను కూడా తగ్గిస్తాయి. నగదు ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. తద్వారా ఎంఎస్ఎంఈల అభివృద్ధికి, ఉపాధి కల్పనకు మెరుగైన అవకాశాలు ఏర్పడతాయి. వారిలో మరింత పోటీతత్వం పెరుగుతుంది.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎఫ్ఎంసీజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ తగ్గింపు ఎలాంటి ప్రభావాన్ని చూపవచ్చు?

రోజువారీ వస్తువులపై తక్కువ పన్ను విధించడంతో, అమ్మకాల పరిమాణం పెరుగుతుంది. ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. తద్వారా కొత్త ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఆటోమొబైల్ రంగంలో.. చిన్న కార్లు, ద్విచక్ర వాహనాలు, విడిభాగాలు తక్కువ ధరలకే అందుబాటులోకి వస్తాయి. ధరలు తగ్గడం వల్ల అమ్మకాల శాతం వృద్ధి చెందుతుంది. పన్నుల తగ్గింపు వల్ల అందే ప్రయోజనాలను ప్రజలకు అందిస్తామంటూ.. ఇప్పటికే టాటా మోటార్స్ తన కార్ల ధరలను రూ.1,55,000 వరకూ తగ్గించింది. జీఎస్టీ తగ్గింపుతో.. ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశీయ ఉత్పత్తి మెరుగవుతుంది.

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ఎక్కువ మంది స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేందుకు ముందుకు వస్తారా?

పన్ను రేట్లను తగ్గించడం సాధారణంగా పన్ను సమ్మతిని మెరుగుపరుస్తుంది. పన్ను రిటర్నుల్లో నిజాయితీని పెంచుతుంది, ఎగవేతలను తగ్గిస్తుంది. అంతిమంగా పన్నుల రూపంలో ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

పన్నుల తగ్గింపు ప్రభావం ఏయే రంగాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉంది?

రూ.2,500 కంటే ఎక్కువ విలువైన వస్త్రాల ఖరీదు మరింత పెరుగుతుంది. ఎంఎంఎఫ్ ఫైబర్, నూలుపై పన్నును 18%, 12% నుంచి 5శాతానికి తగ్గించడం వల్ల వేలాది మంది స్పిన్నర్లు, నేత కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న మూలధన పెట్టుబడి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఎంఎస్ఎంఈ రంగంలో 70%-80% వస్త్ర, దుస్తుల యూనిట్లు ఉన్నందున, ఈ సంస్కరణ ఆర్థిక ఒత్తిళ్లను తగ్గిస్తుంది. పరిశ్రమలో పోటీతత్వాన్ని పెంచుతుంది.

ఈ తగ్గింపు వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుందా? ఒకవేళ తగ్గితే.. దాన్ని భర్తీ చేసే మార్గాలు ఏమైనా ఉన్నాయా?

2023-24 జీఎస్టీ ఆదాయ వివరాల ఆధారంగా.. వార్షిక ప్రాతిపదికన జీఎస్టీ పన్నుల హేతుబద్ధీకరణ నికర ఆర్థిక ప్రభావం రూ.48,000 కోట్లుగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. దీనిపై ఎస్‌బీఐ నివేదిక, హెచ్ఎస్‌బీసీ ఇచ్చిన నివేదిక.. రెండూ జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రభుత్వం స్వల్పకాలిక ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటుందని చెప్పాయి. అయితే వినియోగం పెరగడం ద్వారా పన్నుల చెల్లింపుల శాతం పెరుగుతుందని, దీని వల్ల దీర్ఘకాలిక ప్రతిఫలం ఆర్థిక నష్టం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని సూచించాయి.

డెయిరీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పాదకాలపై జీఎస్టీ తగ్గింపుతో 10 కోట్ల మంది రైతులకు లబ్ధి

» కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: డెయిరీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పాదకాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులపై జీఎస్టీ రేటును తగ్గించడం వల్ల నేరుగా 10 కోట్ల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ శనివారం పేర్కొంది. రేట్ల తగ్గింపు నిర్ణయం సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపింది. జీఎస్టీ పునర్‌వ్యవస్థీకరణ ఎరువుల రంగంలో విలోమ సుంకాల నిర్మాణాన్ని పరిష్కరిస్తుందని, ధరల పెరుగుదలను నిరోధించే అవకాశం ఉండటంతో పాటు సాగు సీజన్లలో సకాలంలో ఉత్పాదకాల లభ్యత ఉండేందుకు దోహదపడుతుందని తెలిపింది. పాలు, పన్నీర్‌పై పన్ను మినహాయింపు, ప్రాసెసింగ్ ఎక్విప్‌మెంట్‌పై రేట్ల తగ్గింపు వల్ల రైతులు, కోఆపరేటివ్‌ల మార్జిన్లు మెరుగుపడతాయని పేర్కొంది. ట్రాక్టర్లు, విడిభాగాల ధరల్లో తగ్గింపు మిశ్రమ వ్యవసాయం, పశుపోషణలోని చిన్న రైతులకు ప్రయోజనం కలిగిస్తుందని తెలిపింది.

రేపు కామన్ పీజీసెట్ ఫలితాలు

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్-2025 ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఈ పరీక్షలను ఆగస్టు 4 నుంచి 11 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించారు. ఈ ఏడాది 44 సబ్జెక్టులకు గాను 54,695 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి మధ్యాహ్నం 3:30 గంటలకు ఫలితాలను అధికారికంగా విడుదల చేస్తారని సీపీగెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఉపరాష్ట్రపతి భద్రతా విధులు సీఆర్‌పీఎఫ్‌కు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: కొత్తగా ఎన్నికవనున్న ఉపరాష్ట్రపతికి జడ్-ప్లస్ భద్రతా విధులు నిర్వర్తించే బాధ్యతను ఢిల్లీ పోలీసు విభాగం నుంచి సీఆర్‌పీఎఫ్‌కు మార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్టు తెలిసింది. తాజాగా బెదిరింపు హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో భద్రతాపరమైన అంచనా నిర్వహించిన కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఈనెల 9న నూతన ఉపరాష్ట్రపతిని ఎన్నుకోనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీస్, సీఆర్‌పీఎఫ్, ఇంటెలిజెన్స్ సంస్థలు, పారామిలిటరీ దళాల అధికారులతో సంయుక్త భద్రతా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలోనే భద్రతాపరమైన తాజా ప్రణాళికను సీఆర్‌పీఎఫ్ అధికారులు ఢిల్లీ పోలీసు అధికారులకు వివరించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఉపరాష్ట్రపతి ఎన్‌క్లేవ్ ఆవరణలో కమాండోల నియామకాన్ని సీఆర్‌పీఎఫ్ నిర్వహిస్తుందని, కారు పాసేజ్ క్లియరెన్స్ విధులను ఢిల్లీ పోలీసులు నిర్వహిస్తారని ఈ భేటీలో స్పష్టం చేసినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, దీనిపై అధికారిక ఆదేశాలు అందలేదని తెలిపాయి.

అతివల ప్రాతినిధ్యం అరకొరే!

» దేశంలో మహిళా ముఖ్యమంత్రులు ఇద్దరే

» నాలుగు రాష్ట్రాల్లో మహిళా మంత్రులే లేరు

» ఢిల్లీ, జమ్మూ కశ్మీర్‌లలో ఒక్కరికే అవకాశం

» ఏడీఆర్, ఎన్ఈడబ్ల్యూ నివేదికల్లో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: దేశవ్యాప్తంగా చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం అరకొరగానే ఉంటోంది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మంత్రివర్గాల్లో అతివలు పది శాతం మాత్రమేనని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈడబ్ల్యూ) తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. అసెంబ్లీల్లో సీట్ల పరంగా చూసినా వీరి వాటా అంతంతమాత్రంగానే ఉంది. పార్లమెంట్‌లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు హామీ ఇచ్చిన 33శాతం రిజర్వేషన్లకు ఆమడ దూరంలోనే ఆగిపోయింది. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినా ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావాల్సి ఉంది.

నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు....

- మణిపూర్ మినహా 27 రాష్ట్ర అసెంబ్లీలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర మంత్రివర్గంలో మొత్తం 643 మంది మంత్రులు ఉండగా వీరిలో 540 మంది పురుషులు. మహిళలు 63 మంది (10%) ఉన్నారు. కేంద్ర క్యాబినెట్‌లోని 72 మంది మంత్రుల్లోమహిళలు ఏడుగురు (10%) మాత్రమే.
- బెంగాల్ అసెంబ్లీలో అత్యధికంగా 8మంది (20%) మహిళా మంత్రులు ఉన్నారు. మధ్యప్రదేశ్ నుంచి ఐదుగురు(16%), ఉత్తరప్రదేశ్‌లో ఐదుగురు (9%), మహారాష్ట్ర నలుగురు (10%) ఉన్నారు.
- గోవా, హిమాచల్‌ప్రదేశ్, పుదుచ్చేరి, సిక్కిం క్యాబినెట్లలో మహిళలకు మంత్రి పదవి దక్కనే లేదు.
- ఢిల్లీ, జమ్మూ కశ్మీర్‌ల్లో ఒకే ఒక్క మహిళకు మంత్రిగా అవకాశం దక్కింది.
- దేశంలో మొత్తం 30 మంది ముఖ్యమంత్రులకు గాను మహిళా సీఎంలు ఇద్దరే. (పశ్చిమ బెంగాల్- మమతా బెనర్జీ, ఢిల్లీ- రేఖా గుప్తా).
- దేశవ్యాప్తంగా అన్ని అసెంబ్లీల్లో ఉన్న 4,092 మంది ఎమ్మెల్యేల్లో పురుషులు 3,692 మంది కాగా మహిళలు 400 మంది మాత్రమే.
- మొత్తం 90 మంది ఎమ్మెల్యేలకు గాను మహిళలు 20 శాతానికి పైగా (19 మంది) ఉన్న ఏకైక రాష్ట్రం ఛత్తీస్‌గఢ్.
- ఇక పార్లమెంట్ విషయానికి వస్తే లోక్‌సభలో 75 మంది, రాజ్యసభలో 42మంది మహిళా ఎంపీలు ఉన్నారు.
- లోక్‌సభలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్ నుంచి 11మంది, యూపీ, మహారాష్ట్రల నుంచి ఏడుగురు చొప్పున, మధ్యప్రదేశ్ నుంచి ఆరుగురు మహిళా ఎంపీలున్నారు. 14 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఒక్క మహిళా ఎంపీ లేరు.

కవిత వ్యాఖ్యలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా

రాష్ట్ర సాధనలో నా నిబద్ధత అందరికీ తెలుసు.. నా జీవితం తెరిచిన పుస్తకం: హరీశ్

» కేసీఆర్‌తో హరీశ్‌రావు కీలక భేటీ

» లండన్ నుంచి రాగానే.. ఎర్రవల్లి ఫాంహౌస్‌కు

» భేటీలో కేటీఆర్.. సుదీర్ఘ మంతనాలు

» కవిత వ్యాఖ్యలు, కాళేశ్వరంపై చర్చ

» వారం రోజులుగా కేసీఆర్‌తోనే కేటీఆర్



శంషాబాద్ విమానాశ్రయంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

హైదరాబాద్, శంషాబాద్ రూరల్/గజ్వేల్/మర్కుక్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత తనపై చేసిన వ్యాఖ్యలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తన 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం తెలంగాణ ప్రజల ముందు ఒక తెరచిన పుస్తకం వంటిదని, రాష్ట్ర సాధనలో తన నిబద్ధత అందరికీ తెలుసునని పేర్కొన్నారు. కవిత తనపై ఆరోపణలు చేసిన సమయంలో లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావు.. శనివారం ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. కవిత చేసిన ఆరోపణలపైనా స్పందించారు. "గత కొంతకాలంగా మా పార్టీపై, నాపై కొందరు నాయకులు, కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలనే వారు (కవిత) కూడా చేశారు. ఆ వ్యాఖ్యలను వారు ఎందుకు చేశారనేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా" అని హరీశ్‌రావు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎరువులు దొరక్క రైతులు గోస పడుతున్నారని, మరోవైపు వరద ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలిచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ దశాబ్ద కాలంలో ఎంతో కష్టపడి నిర్మించిన వ్యవస్థలను ఒక్కొక్కటిగా ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ద్రోహుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుంటామని, కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ అధికారంలోకి వస్తామని అన్నారు.

కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ

మాజీ మంత్రి హరీశ్‌రావు శనివారం బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఆయనతోపాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. లండన్ పర్యటన ముగించుకొని శనివారం హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన హరీశ్‌రావు.. వెంటనే ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లారు. అక్కడే ఉన్న కేటీఆర్‌తో కలిసి కేసీఆర్ వద్దకు వెళ్లగా.. వీరితో ఫాంహౌస్ పై అంతస్తులో అధినేత సమావేశమైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా కవిత చేసిన వ్యాఖ్యలపై వీరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అంతేకాకుండా కాళేశ్వరం అంశంలో వ్యవహరించాల్సిన తీరు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎలా ఇరకాటంలో పెట్టాలన్న దానిపైనా సుదీర్ఘంగా మంతనాలు జరిపినట్లు తెలిసింది. వీరి మధ్య చర్చ జరుగుతున్న సమయంలో ఎవరినీ లోపలికి రానివ్వలేదని, సాయంత్రం వరకు హరీశ్‌రావు ఫాంహౌస్‌లోనే ఉన్నారని సమాచారం. కాగా, హరీశ్‌రావు, కేటీఆర్‌తో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు ఫొటోలు దిగి తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసుకున్నారు. కవిత సస్పెన్షన్ అనంతరం పార్టీకి వీరిద్దరే కీలకమన్నదే సదరు పోస్టుల సారాంశమని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కేటీఆర్ వారం రోజులుగా ఎర్రవల్లి ఫాంహౌస్‌లోనే మకాం వేశారు. ఇక్కడే ఉంటూ పార్టీ కార్యక్రమాలను చేపడుతున్నారు. శనివారం ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఫాంహౌస్‌కు వచ్చారు.

పోడు రైతులకు బ్యాంకు రుణ భాగ్యమెన్నడో?

» హక్కు పత్రాలున్నా ఏళ్లుగా అప్పు పుట్టని వైనం..

» పోడుభూముల వివరాలను భూభారతికి అనుసంధానిస్తే సమస్యకు పరిష్కారం

» ఈమేరకు వ్యవసాయ కమిషన్ నివేదిక సిద్ధం

» 2.30 లక్షల మంది పోడు రైతుల వద్ద 7.54 లక్షల ఎకరాలు

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులు పంట రుణాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం పోడు భూములకు హక్కు పత్రాలు పొందినప్పటికీ రెవెన్యూ రికార్డులతో ఆ వివరాలను అనుసంధానం చేయకపోవడంతో ఆ రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకురావడం లేదు. దీంతో పోడు భూముల రైతులు అప్పులు పుట్టక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రాష్ట్రంలో సుమారు 7.54 లక్షల ఎకరాల్లో పోడు వ్యవసాయం జరుగుతోందని, అయితే ఒక్క పోడు రైతుకు కూడా బ్యాంకు రుణం అందడంలేదని వ్యవసాయ కమిషన్ గుర్తించింది. కొత్తగా రాష్ట్రంలో అమల్లోకి తెచ్చిన భూభారతి పోర్టల్‌లో పోడు భూములను అనుసంధానం చేస్తే రైతులు పంట రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ధారణకు వచ్చింది. ఈ మేరకు రెవెన్యూ శాఖకు ఇచ్చేందుకు ఓ నివేదికను సిద్ధం చేసింది. 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం (ఆర్‌వోఎఫ్ఆర్) హక్కులు కల్పించాలని 2017 వరకు ప్రభుత్వానికి 1,86,534 అభ్యర్థనలు వచ్చాయి. సుమారు 11 లక్షల ఎకరాలకు సంబంధించి హక్కులు కల్పించాలనే ప్రతిపాదనలు వచ్చినా ప్రభుత్వం వ్యక్తిగత అభ్యర్థనల కింద 93,494 మందికి 3 లక్షల ఎకరాలు, సామూహిక అభ్యర్థనల కింద వచ్చిన సుమారు 700 దరఖాస్తులకు 4.54 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు జారీ చేసింది. అయితే పోడు భూములకు హక్కులు పొందిన రైతుల రికార్డులు గిరిజన సంక్షేమ కార్యాలయాలకే పరిమితమయ్యాయి. రైతు భరోసా వంటి పథకాల కోసం గిరిజన సంక్షేమశాఖ నుంచి రికార్డులు తీసుకుని వ్యవసాయ శాఖ అమలు చేస్తోంది. కానీ పంట రుణాలకు మాత్రం ఈ రికార్డులను బ్యాంకులు పరిగణనలోకి తీసుకోవడంలేదు. రాష్ట్రంలో సుమారు 2.30 లక్షల మంది రైతులు పోడు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు.


చట్టంలో ఉన్నా అమలు కాలేదు: భూమి సునీల్

పోడు భూముల రికార్డులను ఆర్వోఆర్ రికార్డులతో అనుసంధానం చేయాలని ఆర్వోఎఫ్ఆర్ నిబంధనల్లో ఉన్నా ఆచరణలో అమలుకావడం లేదని భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్ పేర్కొన్నారు. పహాణీ రికార్డుల్లోనూ గ్రామ రెవెన్యూకు సంబంధించిన చివరి సర్వే నంబరు తర్వాత పోడు భూముల హక్కుదారులవివరాలను నమోదు చేయాలని ఉన్నా అమలు చేయలేదని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ డేటా రెవెన్యూ రికార్డులతో సంబంధం లేకుండా ఉండటం వల్ల ఆర్వోఆర్ రికార్డులతో అనుసంధానమైతేనే రుణాలిస్తామని బ్యాంకులు చెబుతున్నాయన్నారు.





నిమజ్జనం.. ప్రభంజనం


చార్మినార్ పరిసరాల్లో ఊరేగింపుగా వెళుతున్న గణనాథుడు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. మూడు అడుగులలోపు విగ్రహాలు 92 వేలకుపైగా ఉండగా, అంతకన్నా పెద్దవి 1.62 లక్షలకుపైగా ఉన్నాయని వెల్లడించింది. హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా హుస్సేన్ సాగర్, పరిసర ప్రాంతాలకు వచ్చే భక్తుల కోసం 600 బస్సులు, రైల్వేశాఖ అదనపు ఎంఎంటీఎస్ సర్వీసులు నడిపాయి. అర్ధరాత్రి 2 గంటల వరకు మెట్రోరైల్ సర్వీసులను కొనసాగించారు. శోభాయాత్రల మార్గంలో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించేందుకు సుమారు 15 వేల మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తించారు. సుమారు 30వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందని డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వినాయక నిమజ్జనాన్ని డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి ఆయన పరిశీలించారు. గట్టి భద్రతా ఏర్పాట్లు చేశామని, డ్రోన్లతో పర్యవేక్షణ చేపట్టామని తెలిపారు. ఇక మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, డీజీపీ జితేందర్, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రత్యేక హెలికాప్టర్‌లో గణేశ శోభాయాత్రలను, నిమజ్జనాన్ని పరిశీలించారు.

శంభు కుమారా.. లంబో 'ధరా'


శనివారం నిమజ్జనానికి ముందు చాలా చోట్ల వినాయక మంటపాల్లో లడ్డూ ప్రసాదం వేలం పోటాపోటీగా సాగింది. ప్రఖ్యాత బాలాపూర్ గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని (21 కిలోలు) కర్మాన్‌ఘాట్ బీజేపీ నేత లింగాల దశరథ్‌గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. మరోవైపు గణేశుడి లడ్డూ వేలం సంప్రదాయం విదేశాలకూ చేరింది. కెనడాలోని స్కార్‌బరో తెలుగు అసోసియేషన్ గణేశుడి 10 కేజీల లడ్డూను కొందరు స్నేహితులు కలసి రూ.15.1 లక్షల (18,116 కెనడా డాలర్లు) రూపాయలకు కొంతమంది స్నేహితులు కలసి దక్కించుకున్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో తెలుగు సంఘం ప్రతినిధులు ఏర్పాటు చేసిన గణేశుడి లడ్డూను సినీ పంపిణీదారు మోహన్ కమ్మ రూ.2.55 లక్షలు (4,694 ఆస్ట్రేలియన్ డాలర్ల)కు సొంతం చేసుకున్నారు. బ్యాంకాక్‌లో థాయ్‌లాండ్ తెలుగు సంఘం ప్రతినిధుల వినాయకుడి లడ్డూను సంఘం సభ్యుడు రుద్రారం రవి రూ.48 వేలకు (21,000 థాయ్‌భాత్) పొందారు.



బుజ్జి పాపకు బొజ్జ గణపయ్య లడ్డూ

సికింద్రాబాద్‌లో వైఎంసీఏ భక్తసమాజం వినాయకుడి వద్ద 111 కేజీల లడ్డూ ప్రసాదం లక్కీడ్రాలో శాన్వి అనే మూడేళ్ల చిన్నారికి దక్కింది. మంటపంలో గణనాథుడి దర్శనానికి వచ్చిన ఆమె తల్లిదండ్రులు.. రూ.200 చెల్లించి శాన్వి పేరుతో టోకెన్ తీసుకున్నారు. శనివారం ఆ చిన్నారితోనే లక్కీడ్రా తీయించగా.. ఆమె పేరే రావడంతో ప్రసాదం అందజేశారు.


కోలాహలంగా బాలపూర్ గణేశుని ఊరేగింపు


ట్యాంక్‌బండ్ వద్ద బారులు తీరిన వినాయక విగ్రహాలు


రూ.35 లక్షలకు బాలాపూర్ లడ్డూను దక్కించుకున్న లింగాల దశరథ్‌గౌడ్

వరదంతా సముద్రంలోకే!

- తెలుగు రాష్ట్రాల్లో నిండుకుండల్లా జలాశయాలు
- వచ్చిన వరద వచ్చినట్లే దిగువకు విడుదల
- ఈ వాటర్ ఇయర్‌లో ఇప్పటికే గోదావరి బేసిన్‌లో.. 2,350, కృష్ణాలో 726 టీఎంసీలు కడలిలోకి

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి బేసిన్‌ల నుంచి తెలుగు రాష్ట్రాలకు వస్తున్న వరద అంతా సముద్రం పాలవుతోంది. వరదను గరిష్ఠంగా నిల్వ చేసే రిజర్వాయర్లు లేకపోవడంతో.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదలాల్సివస్తోంది. ఈ వాటర్ ఇయర్ (2025 జూన్ 1)లో ఇప్పటికే గోదావరి కింద 2,350 టీఎంసీలు, కృష్ణాలో 726 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. కృష్ణా బేసిన్‌ను పంచుకుంటున్న రాష్ట్రాల్లో భారీ రిజర్వాయర్లు లేవు. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన నాగార్జునసాగర్, శ్రీశైలం మాత్రమే అతిపెద్ద రిజర్వాయర్లు. వీటిలో శ్రీశైలం సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, నాగార్జునసాగర్ సామర్థ్యం 312.05 టీఎంసీలు. ఇక కర్ణాటకలోకి ఆల్మట్టి సామర్థ్యం 129 టీఎంసీలు కాగా, మహారాష్ట్రలో బీమా నదిపై ఉజ్జయిని జలాశయం సామర్థ్యం 121 టీఎంసీలు, తుంగభద్ర



జలాశయం సామర్థ్యం 105.79 టీఎంసీలే. గోదావరి బేసిన్‌లో పరిమిత సంఖ్యలోనే రిజర్వాయర్లు ఉన్నాయి. వీటిలోనూ మహారాష్ట్రలోని ఔరంగాబాద్ శివారు పైఠన్‌లో 102 టీఎంసీల సామర్థ్యం కలిగిన జయక్వాడీ రిజర్వాయర్, తెలంగాణలో 80 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీరామ్‌సాగర్‌లే పెద్దవి. ఆ తర్వాత ఏపీలో ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఉంది. 194 టీఎంసీల సామర్థ్యం ఉన్న పోలవరం పూర్తయితే గోదావరిలో ఇదే అతిపెద్ద ప్రాజెక్టు కానుంది. కాగా, శనివారం కృష్ణా బేసిన్‌లో చిట్టచివరన ఉన్న ప్రకాశం బ్యారేజీకి 30,876 క్యూసెక్కుల వరద రాగా సముద్రంలోకి వదిలేశారు. గోదావరిలో చిట్టచివరన ఉన్న రాజమహేంద్రవరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 7.98 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. దీనిని కూడా పూర్తిగా కిందికి వదిలారు.

గత 12 ఏళ్లుగా సముద్రంలో కలుస్తున్న జలాలు (టీఎంసీలు)

సంవత్సరం	గోదావరి	కృష్ణా
2014-15	2006.20	73.34
2015-16	1611.49	9.26
2016-17	2895.49	55.21
2017-18	1025.66	0
2018-19	2446.86	39.30
2019-20	3797.31	797.12
2020-21	3481.88	1278.12
2021-22	2502.25	501.36
2022-23	6250.60	1331.55
2023-24	2828.71	62.60
2024-25	3732.51	713.66
2025-26	2350	726 (ఈనెల 6వ తేదీ నాటికి)

'వందే భారత్'కు జై!

- దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 7 రైళ్లలో ఐదింటికి పెరిగిన ఆక్యుపెన్సీ
- సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ బోగీలు 16 నుంచి 20కు పెంచేందుకు గ్రీన్ సిగ్నల్
- రైల్వే బోర్డు నుంచి అందిన కబురు
- విజయవాడ-చెన్నై వందే భారత్‌కు త్వరలో బోగీలు పెంచే అవకాశం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వందే భారత్ హైస్పీడ్ రైళ్లకు ప్రయాణికుల మంచి ఆదరణ లభిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఆరు మార్గాల్లో 7 వందే భారత్‌లు నడుస్తుండగా, ఐదింటిలో ప్రయాణికుల ఆక్యుపెన్సీ 115 నుంచి 135 శాతం నమోదవుతోంది. దీంతో త్వరలోనే పలు మార్గాల్లో వందే భారత్‌లకు అదనపు బోగీలు జతచేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ బోగీలను 16 నుంచి 20కు పెంచాలని



రైల్వే శాఖ తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు రైల్వే బోర్డు నుంచి కబురు అందింది. దీనిపై వెంకన్న భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్యుపెన్సీ అధికమే అయినా...

ఇప్పటికే సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రెండు వందే భారత్ రైళ్లు పూర్తిస్థాయి సామర్థ్యం కలిగిన రేక్ (20 బోగీల)తో నడుస్తున్నాయి. వీటికి 126 నుంచి 129 శాతం ఆక్యుపెన్సీ ఉన్నప్పటికీ ఇప్పటికే పూర్తిస్థాయి సామర్థ్యంతో నడుస్తున్నందున బోగీలను పెంచే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ మార్గంలో మరో వందే భారత్‌ను నడపాలని తెలుగు రాష్ట్రాల ప్రయాణికులు కోరుతున్నారు. విజయవాడ-చెన్నై మధ్య వందే భారత్ 8 బోగీలు 135 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తోంది. దాంతో 20 కోచ్‌ల రేక్‌ను మంజూరు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. త్వరలో బోగీలు పెంచే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. జాల్నా నుంచి ముంబైకి వందే భారత్ 8 బోగీలతో నడుస్తుండగా ఈ నెల 26 నుంచి 16 కోచ్‌లకు పెంచి నాందేడ్ వరకు పొడిగించారు. ఈ మార్గంలో కూడా ఆక్యుపెన్సీ పెరిగితే 20 బోగీలకు పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందే భారత్‌కు ఆక్యుపెన్సీ 77 శాతానికి మించకపోవడంతో ఇటీవల 20 బోగీలను 8కి కుదించారు. కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందే భారత్‌కు ఆశించిన మేరకు ఆక్యుపెన్సీ పెరగలేదు. దీంతో బోగీల సంఖ్య పెంచే అవకాశం లేదని తెలుస్తోంది.

ఆగస్టులో వందే భారత్‌ల ఆక్యుపెన్సీ ఇలా

రైలు నం.	మార్గం	ఆక్యుపెన్సీ%
20707	సికింద్రాబాద్-విశాఖపట్నం	126
20834	విశాఖపట్నం-సికింద్రాబాద్	129
20678	విజయవాడ-చెన్నై	135
20701	సికింద్రాబాద్-తిరుపతి	116
20102	నాందేడ్-ముంబై	116
20102	సికింద్రాబాద్-నాగ్‌పూర్	77
20703	కాచిగూడ-యశ్వంత్‌పూర్	84



నిమజ్జనోత్సవంలో రేవంత్

ఎలాంటి భద్రతలేకుండా, సాదాసీదాగా ఎన్టీఆర్ మార్గ్‌కు సీఎం

- 45 ఏళ్ల తర్వాత గణేశ్ నిమజ్జనానికి ఓ సీఎం.. భాగ్యనగర్ ఉత్సవ సమితి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి హంగు లేదు.. ఆర్భాటమూ లేదు. పోలీసుల హడావుడీ లేదు. కాన్వాయ్ లేదు.. ఎప్పుడూ వెంట ఉండే భద్రతా సిబ్బందీ లేరు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదాసీదాగా, ఓ సామాన్యుడిలా, వేలమంది భక్తజనంలో తానొకరు అన్నట్లుగా హుస్సేన్‌సాగర్ తీరంలో నిమజ్జన కార్యక్రమానికి విచ్చేశారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ నినదించి భక్తుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనం అనంతరం సాయంత్రం 4:15 గంటలకు మూడు వాహనాలతో ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా రేవంత్ ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్నారు. సీఎం కనిపించడంతో అక్కడ నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. రేవంత్ సింపుల్‌గా, తమలో ఒకరిగా పక్కనే ఉండటాన్ని చూసి ఆయన్ను భక్తులు ఫొటోలు తీశారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. తొలుత.. వాహనం దిగగానే రేవంత్, అక్కడ.. కుమారుడితో నిల్చున్న ఓ మహిళకు అభివాదం చేశారు. ఆ బాలుడికి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. క్రేన్ నంబరు-4 వద్దకు చేరుకొని నిమజ్జనం జరుగుతున్న తీరును పరిశీలించారు. హైదరాబాద్ కలెక్టర్ హరిచందన హుస్సేన్‌సాగర్ తీరాన ఏర్పాట్లు, నిమజ్జనం జరుగుతున్న తీరును ఆయనకు వివరించారు. ఎన్టీఆర్‌మార్గ్ నుంచి భక్తులను పలకరిస్తూ.. వారికి అభివాదం చేస్తూ, కొందరితో కరచాలనం చేస్తూ, సెల్ఫీలు దిగుతూ సచివాలయం ముందు నుంచి తెలుగుతల్లి ఫ్లై ఓవర్ వద్దకు చేరుకున్నారు. అక్కడే స్వాగత వేదిక ఏర్పాటు చేసిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వహకులు వేదిక మీదకు సీఎంను ఆహ్వానించారు. వేదిక మీదకు చేరిన రేవంత్‌ను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు గణనాథుడి కండువా వేసి సన్మానించారు. వేదికపై నుంచి రేవంత్, భారీగా తరలివచ్చిన భక్తులకు అభివాదం చేశారు. గడిచిన 45ఏళ్లలో గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి ఏ సీఎం రాలేదని, ఉత్సవ సమితి వేదికపైకి వచ్చిన మొట్టమొదటి సీఎం రేవంత్ అని భాగ్యనగర ఉత్సవ సమితి నిర్వాహకులు ప్రకటించారు. 'జై బోలో గణేశ్ మహారాజ్‌కీ' అంటూనే 'సీఎం రేవంత్ రెడ్డికి జై' అంటూ నిర్వాహకులు నినదించగా.. సీఎం వారించారు. భక్తులను ఉద్దేశించి మాట్లాడాలంటూ నిర్వాహకులు కోరగా ఆయన సుముఖత వ్యక్తం చేయలేదు. వేదిక మీద నుంచే గణపతి బప్పా మోరియా అంటూ నినదించారు. నిమజ్జనానికి ఏమైనా ఇబ్బందులున్నాయా? అని ఉత్సవ సమితి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. హుస్సేన్‌సాగర్‌లో ఎన్టీఆర్‌మార్గ్, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డులో నిమజ్జన కార్యక్రమంలో నిమగ్నమైన సిబ్బందిని సీఎం అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు అదే స్ఫూర్తితో పని చేయాలని సూచనలు చేశారు. గత ఏడాది జరిగిన నిమజ్జనోత్సవానికి కూడా రేవంత్ హాజరయ్యారు. అప్పట్లో ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనం జరగడానికి ముందే ఏర్పాట్లను పరిశీలించి.. క్రేన్ల ఆపరేటర్లతో మాట్లాడారు. ఈ సారి అందుకు భిన్నంగా సీఎం రేవంత్‌రెడ్డి ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనం పూర్తయ్యిన తర్వాత వచ్చారు.



మా ప్రిన్సిపాల్‌ను ఎక్కడికైనా పంపితే
పురుగుల మందు తాగుతాం

- సార్ లేకపోతే మేం చదువుకోం.. టీసీలు ఇవ్వండి
- స్టేషన్‌ఘన్‌పూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ రాజు డిప్యూటేషన్‌ను వ్యతిరేకిస్తూ విద్యార్థుల ఆందోళన

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమను ఐదేళ్లుగా కంటి కిరెప్పలా చూసుకుంటున్న ప్రిన్సిపాల్ ధరావత్ రాజును డిప్యూటేషన్‌పై పంపిస్తే పురుగుల మందు తాగుతామని, సార్ లేకుంటే పాఠశాలలో చదువుకోబోమని, టీసీలు ఇవ్వాలని విద్యార్థులు ఆందోళనకు దిగారు. శనివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ ఘటన జరిగింది. పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న ఓ టీచర్ విద్యార్థులతో పాలు కాయించడం, అంట్లు తోమించడంతో పాటు, ప్రిన్సిపాల్ గదిలో విద్యార్థులను మోకాళ్ల పైన నిలబెట్టిన ఫొటోలు ఇటీవల వైరల్ అయ్యాయి. విచారణ జరిపిన ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్ రాజును డిప్యూటేషన్‌పై అరెపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు శనివారం మధ్యాహ్నం భోజనం చేయకుండా పాఠశాల గేటు ఎదుట బైఠాయించారు. ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ వేణు, ఎస్సై వినయ్‌కుమార్‌లు పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. నెల రోజుల్లో సార్‌ను మళ్లీ తీసుకువచ్చేలా చూస్తామని పేర్కొన్నా వినలేదు. దీంతో ఆర్డీవో.. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి ప్రిన్సిపాల్ డిప్యూటేషన్ తమ పరిధిలో లేదని, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్(పీవో)తో మాట్లాడి నెల రోజుల వ్యవధిలో ఆయనను తీసుకువచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. దీంతో విద్యార్థులు శాంతించి, హాస్టల్‌కు వెళ్లి భోజనం చేశారు.

నేడే బ్లడ్ మూన్

- రాత్రి 8.58 గంటల నుంచి చంద్రగ్రహణం
- 11 నుంచి 12.22గంటల దాకా సంపూర్ణ గ్రహణం

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి అరుదైన సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించనుంది. గ్రహణం సమయంలో చంద్రుడు గాఢ ఎరుపు రంగు(బ్లడ్ మూన్)లో కనువిందు చేయనున్నాడు. భారత కాలమాన ప్రకారం గ్రహణం ఆదివారం రాత్రి 8:58 గంటలకు ప్రారంభం అవుతుంది. సంపూర్ణ చంద్రగ్రహణం 11గంటల నుంచి 12:22వరకు ఉంటుంది. రాత్రి 2:25 గంటలకు గ్రహణం వీడిపోతుంది. సూర్యుడికి, చంద్రునికి సరిగ్గా మధ్యలోకి భూమి రావడం, చంద్రుడిపై పడే సూర్య కిరణాలు భూ వాతావరణంలోనే పరిక్షేపణం చెందడం, భూమి కొసల నుంచి ఎరుపు రంగు కాంతి చంద్రుడిపై పడటంతో చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు. అందుకే దీన్ని బ్లడ్ మూన్ అంటారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ప్రపంచంలో 85% మంది ఈ గ్రహణాన్ని వీక్షించగలరని నిపుణులు అంటున్నారు. సంపూర్ణ చంద్రగ్రహణాన్ని భారతదేశంలోని అన్ని ప్రాంతాల్లో స్పష్టంగా వీక్షించవచ్చు.

దసరా, దీపావళికి 122 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను నడపనుంది. సెప్టెంబరు 10 నుంచి డిసెంబరు 3 వరకు వివిధ ప్రాంతాల మధ్య మొత్తం 122 ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మధురై-బరౌని 12 రైళ్లు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- బరౌని 12 రైళ్లు, తిరువంతపురం నార్త్-సంత్రాగచి 7 రైళ్లు, తిరునెల్వేలి-శివమొగ్గ టౌన్ 8, షాలిమార్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ 10 ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. అలాగే, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచి 3 రైళ్లు, ఎస్ఎంవీటీ బెంగళూరు-బీదర్ 9 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. రైళ్ల వేళలు, ఆగే స్టేషన్లు, ఇతర వివరాల కోసం రైల్వే అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

చిత్రకారుడు శంభు కన్నుమూత

- ప్రఖ్యాత కవి కె.శివారెడ్డి తనయుడు
- చిత్రలేఖనంతో పాటు కవిత్వ రచనలోనూ ప్రవేశం


శంభు (ఫైల్)

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారుడు, కవి కె.శంభు ప్రసాద్ రెడ్డి(54) హఠాన్మరణం పొందారు. శనివారం మధ్యాహ్నం బాత్రూంలో ఉన్నప్పుడు గుండెపోటు రావడంతో కుప్పకూలారు.గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వైద్యులను పిలిపించగా, శంభు అప్పటికే మరణించినట్లు వారు నిర్ధారించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు కవులు, రచయితలు వారి ఇంటికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రఖ్యాత కవి కె.శివారెడ్డి, రమాదేవీ దంపతుల కుమారుడైన శంభు ఎన్నో పుస్తకాలకు ముఖ చిత్రాలు గీశారు. కొంతకాలం బోధనా వృత్తిలోనూ పనిచేశారు. తండ్రి ప్రేరణతో కవిత్వం కూడా రాశారు. శంభు అంత్యక్రియలు ఆదివారం ఉదయం 11 గంటలకు సరూర్‌నగర్‌లోని వీవీనగర్ శ్మశానవాటికలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

కొత్తగా 31 క్రిటికల్ కేర్ బ్లాక్‌లు

(మొదటిపేజీ తరువాయి)

అడుగుల విస్తీర్ణంలో, వివిధ జిల్లాల్లో ఏర్పాటయ్యే 50 పడకల కేంద్రాలను ఒక్కోదాన్ని 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. వంద పడకల కేంద్రాలు వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణం పూర్తయి.. సేవలు ప్రారంభిస్తాయని చెప్పారు. కేంద్రం దేశవ్యాప్తంగా పీఎమ్-అభిమ్ (ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత వైద్య మౌలిక సదుపాయాల పథకం) కింద ఐదు లక్షల జనాభా దాటిన ప్రతి జిల్లాలో సీసీబీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. 2021-22 నుంచి 2025-26 మధ్య వీటిని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. నిర్మాణ వ్యయంలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నాయి. సీసీబీలను జిలా ఆస్పత్రులతో పాటు బోధనాస్పత్రుల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య వర్గాలు పేర్కొన్నాయి. నిజామాబాద్, నల్గొండ కేంద్రాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. మరో ఏడు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మరో 8 కేంద్రాలు ఈ నెలఖారుకు, ఇంకో 8 డిసెంబరులో అందుబాటులోకి రానున్నాయి. మిగిలినవి వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని వైద్య శాఖ నిర్ణయించింది. జాతీయ రహదారుల వెంబడి ఏర్పాటు చేస్తున్న ట్రామా కేర్ సెంటర్లకు అదనంగా సీసీబీలను నెలకొల్పుతున్నారు.

ఏ వైద్య సేవలు అందుతాయంటే...

సీసీబీల్లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ), ఐసోలేషన్ వార్డు, డయాలసిస్ యూనిట్, ఎమర్జెన్సీ బెడ్స్, మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్, లైఫ్ సేవింగ్ సపోర్ట్, బ్లడ్ బ్యాంక్, డయాగ్నస్టిక్ లేబొరేటరీ ఉంటాయి. ఆర్థోపెడిక్స్, న్యూరో సర్జన్, ప్లాస్టిక్ సర్జన్, జనరల్ సర్జరీ, జనరల్ ఫిజీషియన్, మత్తుమందు వైద్యుడు, ఇతర పారామెడికల్ సిబ్బంది ఉంటారు. సీసీబీల్లో అత్యవసర కేసుల్లో శస్త్రచికిత్సలు సహా వైద్య సేవలందిస్తారని వైద్య శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.



రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ

- జపాన్, చైనా పర్యటనలపై చర్చ
- జీఎస్టీ సంస్కరణలపై కూడా!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆయన తాను ఇటీవల జరిపిన జపాన్, చైనా పర్యటనల గురించి వివరించారు. జపాన్‌తో జరిగిన ఒప్పందాల గురించి తెలిపారు. అదే సమయంలో చైనాలోని తియాన్‌జెన్ నగరంలో జరిగిన ఎస్‌సీఓ సమావేశం వివరాలు కూడా పంచుకున్నారు. ఎస్‌సీఓ వేదికగా రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లతో జరిగిన సమావేశాలపై ముర్ముకు వివరించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలపై కూడా రాష్ట్రపతికి వివరించినట్లు సమాచారం.

నార్కోటిక్స్ తయారీ గుట్టురట్టు

5.79 కిలోల మెఫెడ్రోన్ స్వాధీనం.. నార్కోటిక్స్ బ్యూరో, మహారాష్ట్ర పోలీసుల ఆపరేషన్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/కుషాయిగూడ/రాంనగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్యవసర మందుల తయారీ మాటున చర్లపల్లి పారిశ్రామిక వాడలో ప్రమాదకరమైన మెఫెడ్రోన్(మ్యావ్‌మ్యావ్-ఎండీఎంఏ) మత్తుమందును తయారు చేస్తున్న ఫ్యాక్టరీ గుట్టును మహారాష్ట్ర పోలీసులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అధికారులు రట్టుచేశారు. భారీఎత్తున మెఫెడ్రోన్ మత్తుమందును స్వాధీనం చేసుకుని.. వేర్వేరు ప్రాంతాల్లో ఒక బంగ్లాదేశీ యువతి సహా.. 12 మందిని అరెస్టు చేశారు. కేసు వివరాలను మహారాష్ట్రలోని మీరా భయాందర్-వాసాయ్ విహార్(ఎంబీవీవీ) పోలీసులు ఓ ప్రకటన ద్వారా విడుదల చేశారు. ఎంబీవీవీ కమిషనరేట్ పరిధిలోని కాశీమీరా ఏరియాలో గత నెల 8న అనుమానాస్పదంగా కనిపించిన 23 ఏళ్ల యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 105 గ్రాముల మెఫెడ్రోన్(విలువ రూ.23.97 లక్షలు) లభించింది. ఆమెను బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా మురాద్ షేక్ అలియాస్ మొల్లాగా గుర్తించారు. తదుపరి దర్యాప్తులో రెహ్మాన్ షేక్ ఆమెకు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు గుర్తించి, అతణ్ని అరెస్టు చేశారు. రెహ్మాన్ షేక్ ఇచ్చిన సమాచారం ఆధారంగా మెఫెడ్రోన్ దేశవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. దీంతో మహారాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. మత్తుమందు క్రయవిక్రయాలతో సంబంధమున్న గ్యాంగులోకి తమ మనుషులను ప్రవేశపెట్టారు. రెహ్మాన్ షేక్‌తో కలిసి.. ఆ గ్యాంగు ద్వారా.. మహారాష్ట్రలోని 60 చోట్ల దాడులు చేసి, మత్తుమందుల రవాణాలో సంబంధం ఉన్న జావీద్, మహమ్మద్ ఫహీమ్, ఫిరోజ్, ముస్తఫా యూనస్ ఖాన్, ఇమ్రాన్, సలీంలను అరెస్టు చేసి, 178 గ్రాముల మెఫెడ్రోన్(విలువ రూ.23.97 లక్షలు) సీజ్ చేశారు. ఇదే ముఠాపై జరిపిన దాడిలో మరోచోట రూ.23.97 లక్షలు విలువ చేసే 178 గ్రాముల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా.. హైదరాబాద్‌కు డ్రగ్స్ తయారీ కంపెనీ వివరాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో చర్లపల్లి ప్రాంతంలో రెక్కీ నిర్వహించి, శుక్రవారం సాయంత్రం భారీ ఆపరేషన్ చేపట్టారు. స్థానిక నవోదయకాలనిలో ఉన్న వాగ్దేవి లాబ్స్‌పై దాడి, చేసి కంపెనీ యజమాని, ఐటీ నిపుణుడు శ్రీనివాస్ విజయ్ ఒలేటీతోపాటు తానాజీ పండరీనాథ్ పట్వారీని అరెస్టు చేశారు. వాగ్దేవి ల్యాబ్స్‌లో అత్యంత ఆధునిక యంత్ర పరికరాలను గుర్తించారు. 2016లో నాచారంలో ప్రారంభమైన ఈ కంపెనీ.. కొవిడ్ సమయంలో అత్యవసర మందుల తయారీకి ప్రత్యేక అనుమతి పొందినట్లు గుర్తించారు. నాలుగేళ్ల క్రితం చర్లపల్లిలో అద్దెకు తీసుకున్న రేకుల షెడ్డులో యూనిట్‌ను ఏర్పాటు చేసి.. ఎండీఎంఏను తయారు చేస్తున్నట్లు నిర్ధారించారు. ఎన్‌సీబీ, మహారాష్ట్ర పోలీసుల దాడుల్లో మత్తుమందు తయారీలో ఉపయోగించే 35,500 లీటర్ల రసాయనాన్ని, 5,790 గ్రాముల మెఫెడ్రోన్, 19 బాక్స్‌ల్లో ఉన్న మెథలిన్ డైక్లోరిన్(ఎండీసీ)ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో 27 మొబైల్ ఫోన్లు, మూడు ల్యాప్‌టాప్‌లు, ఒక ట్యాబ్, నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుకున్న మత్తుమందుల విలువ పెద్దమొత్తంలో ఉన్నందున.. సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ముంబై పోలీసుల జాయింట్ ఆపరేషన్ విషయాన్ని తెలంగాణ పోలీసులకు ఏమాత్రం చెప్పకుండా రహస్యంగా కొనసాగించారు. ఈ కంపెనీలో నాలుగేళ్లుగా వందల కిలోల మెఫెడ్రోన్‌ను తయారు చేసి ఉంటుందని భావిస్తున్నారు. కాగా.. చర్లపల్లిలో స్వాధీనం చేసుకున్న ముడిసరుకుతో సుమారు 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను తయారు చేయవచ్చని ఎన్డీటీవీ పేర్కొంది.


మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

ల్యాబ్‌కు అనుబంధంగా కంపెనీ

ప్రధాన నిందితుడు శ్రీనివాస్ విజయ్ ఓలేటి మోసాలు చాలానే ఉన్నట్లు సమాచారం. అతను రాంనగర్ గుండు ప్రాంతంలో ఉంటున్నారు. గతంలో ఇక్కడే సాఫ్ట్‌వేర్ సంస్థను నడిపి.. బోర్డు తిప్పేశారు. ఆ తర్వాత చర్లపల్లిలో డెయిరీ ఫామ్ వ్యాపారం చేశారు. ఆ సమయంలో ఆంధ్రా బ్యాంకు రాంనగర్ బ్రాంచ్ నుంచి అప్పు తీసుకుని, మోసం చేసినట్లు సమాచారం. రాంనగర్ గుండు చౌరస్తా వద్ద కొంతకాలం ఓలేటి సూపర్ మార్కెట్‌ను నడిపారు. ఆ సమయంలో దుకాణాన్ని అద్దెకిచ్చిన యజమానికి కిరాయి చెల్లించకుండా.. ఇబ్బందులకు గురిచేసినట్లు తెలుస్తోంది. తాను ఉంటున్న ఇంటికి కూడా అద్దె చెల్లించకుండా, యజమాని డాక్టర్ అనంతలక్ష్మిని వేధించినట్లు సమాచారం. 2016లో నాచారంలో వాగ్దేవి ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో పారిశ్రామిక వేత్త జలంధర్‌రెడ్డికి సంబంధించిన ప్లాట్ నంబర్ 193లో ఉన్న రేకుల షెడ్డులో డ్రగ్స్ తయారీ మొదలు పెట్టారు. ఇక్కడ కూడా యజమానికి అద్దె చెల్లించకుండా వేధించినట్లు సమాచారం.

ఐదేళ్ల పరిశోధనతో డ్రగ్స్ తయారీ

నిందితుడు శ్రీనివాస్ గతంలో జీవీకే ల్యాబ్‌లో పనిచేసేవారు. ఆ సమయంలోనే మత్తుపదార్థాల ఫార్ములాలను సేకరించారు. ఎండీఎంఏ తయారీకి ఉపయోగపడే రసాయనాలపై పరిశోధన చేశారు. డ్రగ్స్ తయారీపై అవగాహన వచ్చాకే.. చర్లపల్లిలో కంపెనీ పెట్టినట్లు సమాచారం.

కిలో మెఫెడ్రోన్ రూ.1.50కోట్లు

మెఫెడ్రోన్ డ్రగ్ విలువ బహిరంగ మార్కెట్లో కిలోకు రూ.1.5కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ లెక్కన చర్లపల్లిలో స్వాధీనం చేసుకున్న 5.79 కిలోల మెఫెడ్రోన్ విలువ సుమారు రూ.7.5కోట్లుగా ఉంటుంది. మహారాష్ట్రలోని వేర్వేరు ప్రాంతాల్లో సీజ్ చేసిన మెఫెడ్రోన్‌తో కలిపితే.. ఈ కేసులో ఎంబీవీవీ పోలీసులు మొత్తం రూ.11.58 కోట్లు విలువ చేసే డ్రగ్స్‌ను సీజ్ చేశారు.

అంగన్‌వాడీలకు సిబ్బంది కొరత

- ఖాళీగా ఆయా, టీచర్ పోస్టులు
- రాష్ట్ర వ్యాప్తంగా 14,236 ఖాళీలు
- పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులు
- భర్తీకి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆమోదం
- అయినా ముందుకు కదలని ప్రక్రియ
- రెండేళ్లుగా నిరుద్యోగుల నిరీక్షణ

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయా, టీచర్ పోస్టులను రెండేళ్లుగా భర్తీ చేయడంలేదు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ 4 నెలల క్రితం ఆమోదం తెలిపినా ఇంకా ముందడుగు పడలేదు. సిబ్బంది కొరతతో ఆ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి, రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఒక్కో కేంద్రంలో ఒక టీచర్, ఒక ఆయా ఉంటారు. ఈ కేంద్రాల ద్వారా ఆరేళ్ల లోపు బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతలకు ఒక పూట పౌష్టికాహారాన్ని అందిస్తారు. పలు చోట్ల ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను పక్క గ్రామాల్లోని కేంద్రాల టీచర్లు, ఆయాలకు బాధ్యత అప్పగించారు. పని భారం పెరగడంతో వారు విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారు. దీంతో కేంద్రాలకు వచ్చే పిల్లలు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులపై రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్ పోస్టుల్లో 6,399, ఆయా పోస్టుల్లో 7,837 ఖాళీలున్నాయి. మొత్తం 14,236 ఖాళీలున్నాయి. వీటి భర్తీపై ఎంతో మంది నిరుద్యోగ యువతులు ఆశలు పెంచుకున్నారు. టీచర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణత, ఆయా పోస్టులకు కనీసం 7వ తరగతి చదివి ఉండాలనే నిబంధన ఉంది. జూన్‌లోనే స్త్రీ శిశు సంక్షేమ శాఖ 14,236 టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని ఆమోదం తెలిపినప్పటికీ, సాంకేతిక అవరోధాల కారణంగా చేయడం లేదని తెలుస్తున్నది. ఖాళీలన్నీ ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉన్నాయని, పూర్వ ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలని, స్థానికులకే పోస్టుల భర్తీకి అవకాశం ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయి. ప్రభుత్వం, సంబంధిత మంత్రి స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ యువతులు, మహిళలు కోరుతున్నారు.

సమీకృత గురుకులాల్లో సౌరశక్తితో వంట!

- సోలార్ కిచెన్ల ఏర్పాటుకు ప్రభుత్వ యోచన
- గ్యాస్, విద్యుత్ ఖర్చులో 70 శాతం ఆదా
- 14 గురుకులాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం



హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల్లో సోలార్ కిచెన్లు(సౌరశక్తితో పని చేసే వంట గదులు) ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఒక్కో యంగ్ ఇండియా గురుకులంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కలిపి దాదాపు 3,000 మంది ఉంటారు. వీరిందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు వండి వడ్డించాలి. మూడు పూటలా కలిపి 9,000 మందికి వంట చెయ్యాల్సి ఉంటుంది. సాధారణ విధానంలో ఇంతమందికి భోజనం అందించాలంటే గ్యాస్, విద్యుత్ ఖర్చు భారీగా అవుతుంది. ఈ ఖర్చును తగ్గించేందుకే ప్రభుత్వం అధునాతన సోలార్ కిచెన్‌ల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. సోలార్ కిచెన్ల వల్ల గ్యాస్, విద్యుత్ ఖర్చు 70 శాతం మేర ఆదా అవుతుందని అంచనా వేశారు. అయితే, ఈ విధానం ఎంతమేరకు సఫలీకృతం అవుతుందనేది తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఓ 14 గురుకులాల్లో పైలట్ ప్రాజెక్టుగా సోలార్ కిచెన్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. 300 నుంచి 900 మంది వరకు విద్యార్థులున్న గురుకులాలను ఇందుకు ఎంపిక చేస్తున్నారు. 900 మందికి ఏర్పాటుచేసే సోలార్ కిచెన్ కోసం రూ.78లక్షలు, 300 మంది ఉన్న గురుకులానికైతే రూ.45లక్షల వరకు ఖర్చవుతుందని కంపెనీలు ప్రతిపాదనలు అందజేశాయి. ఈ గురుకులాల్లో సోలార్ కిచెన్ల ఏర్పాటుకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. సోలార్ కిచెన్‌ల ఏర్పాటుపై ప్రభుత్వానికి పలు కంపెనీలు ప్రతిపాదనలు అందించాయి. వాటి ప్రకారం.. జర్మన్ టెక్నాలజీతో కూడిన సోలార్ డిష్‌ల ద్వారా కిచెన్‌లను నడపనున్నారు. సాధారణంగా వాడే సౌర ఫలకాలు కాకుండా సమీకృత గురుకులాల్లో కొన్ని సౌర ఫలకలతో కూడిన డిష్(యాంటెనా లాంటిది)లను భవనాలపై ఏర్పాటు చేస్తారు. ఈ డిష్‌లు సూర్యుడు ఎటువైపు ఉంటే అటు తిరుగుతూ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఒక్కో భవనంపై 12 డిష్‌లను ఏర్పాటు చేస్తే వాటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్.. వంటతోపాటు విద్యార్థులందరికీ స్నానానికి వేడి నీళ్లు అందించడానికి సరిపోతుందని చెబుతున్నారు.అయితే, ఆకాశం మేఘావృతమై ఉన్నప్పుడు, వర్షాలు కురిసినప్పుడు సౌర విద్యుత్ ఉత్పత్తి సాధ్యం కాదు. ఏడాదికి 100 రోజులు సౌర విద్యుత్ ఉత్పత్తి సాధ్యం కాదని వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో పైలట్ ప్రాజెక్టు ద్వారా సమగ్ర అధ్యయనం చేయాలని నిర్ణయించారు.

పోటెత్తుతున్న నదులు

- పలు రాష్ట్రాలకు తీవ్ర వరద ముప్పు
- దేశ వ్యాప్తంగా 22 ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో ప్రవాహం
- కేంద్ర జల సంఘం హెచ్చరిక



న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: దేశంలో నదులు ప్రమాదకరస్థాయిలో పోటెత్తుతున్న నేపథ్యంలో పలు రాష్ట్రాలకు తీవ్ర వరద ముప్పు పొంచి ఉందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) హెచ్చరించింది. సీడబ్ల్యూసీ రోజు వారీ వరద పరిస్థితి నివేదిక ప్రకారం.. 22 నదీ పర్యవేక్షణ కేంద్రాల వద్ద తీవ్ర వరద ప్రవాహం నమోదైంది. ఆ కేంద్రాలు ఎనిమిది చొప్పున బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో, ఒక్కోటి చొప్పున గుజరాత్, ఢిల్లీ, జార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఉన్నాయి. అస్సాం, జమ్మూకశ్మీర్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్లోని మరో 23 కేంద్రాల వద్ద సాధారణం కంటే ఎక్కువగా నీటి ప్రవాహం ఉంది. కర్ణాటకలో 12, తెలంగాణలో 6, ఆంధ్రప్రదేశ్‌లో 5 ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉంది. ఇతర రాష్ట్రాల్లో కూడా పలు ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. వచ్చే రెండు రోజుల పాటు గుజరాత్‌లోని నర్మద, తపతి, దామన్‌గంగ, సబర్మతి నదుల్లో వరద కొనసాగనుంది. రాజస్థాన్‌లోని మహి, సబర్మతి, చంబల్, బనాస్ నదులు పొంగుతున్నాయి. మహారాష్ట్రను కూడా వర్షాలు ముంచెత్తుతున్నాయి. అక్కడి నదుల్లో వరద ఉరకలేస్తోంది. గంగ, యమున తదితర నదులు ఇంకా ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో ఉత్తరప్రదేశ్, బిహార్‌ల్లో వరదలు కొనసాగుతున్నాయి. గుజరాత్, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ హెచ్చరించింది. కృష్ణ, గోదావరి, నర్మద, మహానది, కావేరి నదులపై డ్యామ్‌లు ఇప్పటికే నిండుకుండల్లా ఉన్నందున ఆయా ప్రాజెక్టుల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.